# కౌముది.నెట్

చక్కటి కుటుంబ వార పత్రిక

## జూలై 2013

## కథలు




వసంతకు పెళ్ళి కుదిరింది-ట!

చేతిలో వున్న శుభలేఖ ఆవార్తను దృఢపరిచింది. నాకు చాలా సంతోషం కలిగింది. వసంత నేను ఒకే కాలేజిలో చదువుకున్నాము. నేను డిగ్రీ తర్వాత పై చదువులు చదవడం కుదరక టీచర్ ట్రైనింగ్ చేసి టీచరుగా జీవితంలో స్థిరపడిపోయాను. నేను సాధిద్దామనుకున్నది సాధించకుండా జీవితంతో రాజీపడిపోయాను.

కాని వసంత మటుకు పై చదువులు కొనసాగించింది. నిజానికి వాళ్ళింట్లో ఎవరికీ అలా చదవడం యిష్టం లేదు. వాళ్ళ అన్నయ్యలు ఆమె చదువును వ్యతిరేకించారు 'ఆడపిల్ల చదివి ఏం చెయ్యాలి?' అని ఈసడించుకున్నారు.

'ఎంత చదివినా పరాయి యింటికి పోయేదే కదా!' అని ఆమె తల్లితండ్రులు కూడా వాపోయారు.

'ఇలా ఆడపిల్లను చదివిస్తూ వుంటే మాకొచ్చే ఆస్థిపాస్తులన్నీ హారతి కర్పూరంలా కరిగిపోతాయి!' అని ఒక వదిన అనడం కూడా నాకు తెలుసు.

ఎవరు ఎన్ని అన్నా వసంత తన పంతం మానలేదు. అన్నం మానేసింది - మొండికేసింది. చివరికి ఆమె పట్టుదల ముందు ఆమె తల్లితండ్రులు తలవంచక తప్పలేదు. చుట్టు ప్రక్కలవారు జోక్యం చేసుకుని ఆమె అన్నయ్యలకు - తల్లితండ్రులకు కూడా నచ్చచెప్పారు. అలా వసంత పట్టుదలకు మారు పేరుగా చదువుకు అంకితమయి పోయింది. చదువుల సరస్వతి అని మా స్నేహితురాళ్ళు ఆమెను ఎక్కిరించే వాళ్ళు ఈర్ష్యతో.

ఇదంతా పది ఏళ్ళ క్రిందటి మాట!

ఆ తరువాత పెళ్ళి చేసుకుని ఉద్యోగం వెతుక్కుంటూ కర్నూలుకు వచ్చేశాను. వసంత పై చదువులకంటూ బిజీగా ఎక్కడెక్కడో తిరిగేది - ఒకటి రెండు సంవత్సరాలు ఉత్తరాలు రాసింది కాని నేను బిజీగా వుండటం వలన జవాబు కూడా ఇవ్వలేకపోయాను. మరి సంసారం - పిల్లలు!

అందుకే ఇన్ని సంవత్సరాల తరువాత నా అడ్రసు వెతుక్కుంటూ వచ్చిన శుభలేఖ నాకు స్వాతి చినుకులా ఆనందం కలిగించింది.

పెళ్ళి ఎక్కడా అని వెతికాను - కడపలో! ఎప్పుడు అని చూశాను - అరే రేపు ఉదయమే! టైం లేదు. వెంటనే మా హెడ్ మాస్టరు గారిని కలిసి పరిస్థితి వివరించి - సెలవు చీటి యిచ్చి యింటికి బయలు దేరాను.

కడపలో ఆ కళ్యాణ మండపం కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. చాలా ఖరీదైన కళ్యాణ మండపం!

'వసంత వెడ్స్ వెంకట్!' ఆ బోర్డు చదివి ఆమె పెళ్ళి మండపానికే వచ్చినట్లు నిశ్చయించుకుని మెట్లెక్కి మండపంలోకి ప్రవేశించాను. ఎదుర్కోలు కార్యక్రమాలు జరుగుతున్నాయి.

వసంత రివటలాగా కాలేజీ రోజుల్లో ఉన్నట్లే ఉంది! ఆమె వయసు ముప్పయిదాటిందని నాకు తెల్సు! చూసేవాళ్ళు ఆమెకు పాతిక సంవత్సరాలు ఉంటాయనుకుంటారేమో!

వసంత వాళ్ళు మధ్యతరగతి కుటుంబీకులు! కాని అక్కడ చూస్తే పెళ్లి చాలా ఆర్భాటంగా జరుగుతున్నది. బహుశా పెళ్ళికొడుకు వాళ్ళు పట్టుపట్టి ఉంటారు.

ఇంతలో రమేష్ నన్ను గుర్తు పట్టి విష్ చేశాడు.

"మీరు... శాంతి కదండి - చెల్లాయికి క్లాసుమేటు - సంతోషం కూర్చోండి!" ఆహ్వానించాడు నవ్వుతూ.

"ఓ రమేష్ గారా! బాగా కనుక్కున్నారు! బస్సు కొంచెం ఆలశ్యమైంది - వసంత బిజీగా ఉంది." నవ్వుతూ చెప్పాను.

"మీరు ముందు టిఫిన్ తినండి - భోజనాలకు ఆలశ్యం ఉంది!'

"ఒకేసారి భోంచేస్తా లేండి -"

"నో! నో! టిఫిను కాఫీ రెడీగా ఉంది... రండి క్రింద డైనింగ్ టేబులు చూపిస్తాను." అంటూ రమేష్ నన్ను బలవంతంగా కిందకు తీసుకొచ్చి వంటల మేనేజరుకు చూపించి వెళ్ళిపోయాడు.

నాముందు ప్లేటులో రెండు రకాల స్వీట్లు - మిర్చి బజ్జీ - వడలు ఉన్నాయి. తినసాగాను పారెయ్యడం యిష్టంలేక.

ఇంతలో కాఫీ తెచ్చియిచ్చారు.

కాఫీ సిప్ చేస్తూ ఉన్నాను.

వంట యింట్లోంచి ఏదో గలాటా వినిపించసాగింది.

కుతూహలం కొద్దీ కొంచెం లోపలికి పోయి చూశాను.

అక్కడ ఒక యువతి ఏడుస్తున్నది... ఆమె వీపు మీద కొట్టారు - అక్కడ వున్న వాళ్ళు - తిడుతున్నారు.

"దొంగది! పోలీసులకు అప్పచెప్పండి... చిన్న వాళ్ళు చిన్న బుద్ధులు - నీకు కడుపునిండా తిండి పెట్టాం కదే - మళ్ళీ ఈ దొంగబుద్ధులెందుకు?" వంట మేనేజరు జుత్తు పట్టుకుని కొడుతూ అడిగాడు.

"తప్పయిపోయిందయ్యా! ఆకలి వేసింది" ఏడుస్తూ చెప్పింది ఆమె.

"కడుపునిండా తిన్నావు గదుటే దెయ్యమా! ఇంకా ఆకలా?" అతను కోపంగా అన్నాడు.

"నాకు కాదయ్యా! నా బిడ్డలకు - ఇంట్లో నాకు నలుగురు బిడ్డలున్నారు - వాళ్ళు ఆకలితో నకనకలాడుతున్నారు - నేను తింటే వాళ్ళ కడుపులు నిండుతాయా? అందుకే ఈ కాస్త పొట్లం కట్టుకుని తీసుకు పోతున్నాను." దీనంగా చెప్పింది ఆమె.

"ముష్టి అడిగితే వేసే వాళ్ళం కదే! అయినా అంట్లు తోమడానికి ఎవరినన్నా మంచివాళ్ళని పట్టుకురమ్మంటే నీలాంటి దొంగవెధవల్ని తెచ్చిందానికి మా వెధవని చెప్పు తీసుకు కొట్టాలి! నీ పేరేంటి!" అతను చిందులు తొక్కుతూ అడుగుతున్నాడు.

"పార్వతి అయ్యా! మేం కూడా బాగానే బతికి నోళ్లమయ్యా! నా మొగుడు జబ్బు పడ్డాడు - లేకపోతే రిక్షా తొక్కి సంపాదించేవాడు -" ఏడుస్తూ చెప్పింది.

వాళ్ళు ఇంకేవో తిడుతున్నారు...

'పార్వతి' అన్న మాట వినగానే నాకేవో ఆలోచనలు తొలుస్తున్నాయి. కొన్ని ఏళ్ళ క్రిందట - నేను స్కూల్లో ప్రవేశించిన కొత్తల్లో అనుకుంటాను ఆ సంఘటన జరిగింది...

"టీచర్! నేను చదువు మానేస్తున్నాను" పార్వతి చెప్పింది... నేను ఉలిక్కిపడి పార్వతివంక చూశాను. పాలుకారే బుగ్గలతో - చిదిమి దీపం పెట్టుకునేటట్లు చాలా అందంగా ఉంది. చాలా అణుకువ కలపిల్ల. చదువులో చాలా చురుకుగా ఉండేది. ఎనిమిదో క్లాసు ఫస్టు క్లాసు మార్కులతో పాసు అయి తొమ్మిదో తరగతి చదువుతున్నది....

"పార్వతి! జోకు చేయడానికి కూడా హద్దూ పద్దూ ఉండాలి! ఎప్పుడూ అలా మాట్లాడకు" కోపంగా చెప్పాను.

"కాదు టీచర్! నిజంగానే మానేస్తున్నాను" ఈసారి పార్వతి కళ్ళల్లోంచి కొన్ని కన్నీటి చుక్కలు చెంపలమీదుగా జారిపడ్డాయి.

"అదేంటి పార్వతి - ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నావు!" ఆశ్చర్యంగా అడిగాను.

"నేను తీసుకోలేదు టీచర్ - మాయింట్లో వాళ్ళు తీసుకున్నారు - నాకు పెళ్లి కుదిరింది! ఇంక చదువు మాన్పించి పెళ్ళిచేసి అత్తారింటికి పంపిస్తున్నారు" ఏడుస్తూ చెప్పింది పార్వతి.

"ఛీ! ఛీ! ఇంత చిన్న వయసులో పెళ్ళేంటి! నువ్వింకా మైనరువి కదా - తప్పు!" కోప్పడ్డాను - నచ్చచెప్పాను... దానికి సమాధానంగా వాళ్ళ అమ్మ మరునాడు స్కూలుకు వచ్చింది.

"చూడు టీచరమ్మా! మా కులంలో పెద్దమనిషి కాగానే పెళ్లి చెయ్యడం ఆచారం. మేము యింకా ఆలశ్యం చేశాము. నువ్వు లేనిపోని కబుర్లు చెప్పి దాని మనసు విరిచి - దాని జీవితం పాడు చెయ్యకు" కసిరింది ఆమె.

"చూడు కాళి! ఈ కాలం పెళ్లికంటే కూడ ఆడపిల్లలకు చదువు చాలా ముఖ్యం! పెళ్లిదేముంది వయసు రాగానే అవుతుంది. కాని

చదువు మటుకు ఎప్పుడు పడితే అప్పుడు రాదు. చదువురాని వాడు రెండు కాళ్ళ వింత పశువు-" అంటూ చెప్పబోయాను.

కాళి నా మాటలు వినిపించుకోలేదు. తీవ్రస్వరంతో అంది. "ఇదంతా మీ పిచ్చి! నేను చదువుకున్నానా? మా అమ్మ చదువుకుందా? మా అమ్మమ్మ చదువుకుందా? మా వంశంలో ఎవరికీ చదువులేదు. కాని మాకేం తక్కువయింది. పెళ్లి చేస్తే మా బాధ్యత తీరిపోతుంది - ఆతర్వాత గొంతు దాకా చదువుకున్నా ఎవరూ అడగరు."

"వివాహం విద్య నాశాయ - శోభనం సర్వనాశాయ అని వినలేదా? పెళ్ళికి చదువుకు సరిపోదు. సంసార లంపటంలో పడితే చదువు అస్సలు ముందుకు సాగదు. అయినా పార్వతికి వయసేం ముదిరిపోయింది . పధ్నాలుగు యింకా రాలేదు. పద్దెనిమిదేళ్ళ లోపు పెళ్ళిచేయడం నేరం కూడా. బాల్యవివాహాన్ని చట్టం నిషేధించింది." నచ్చచెప్పబోయాను.

" అమ్మా! నే చదువుకుంటానే! టీచరు చెప్పింది నిజం!" పార్వతి చెప్పింది.

"ఛస్! నోర్మూయ్! మన కులాచారం టీచరమ్మకు ఏం తెల్సు! ఇంకా కొన్ని రోజులు నిన్ను ఇలానే వదిలేస్తే మన కులంవోళ్ళు మనల్ని వెలివేస్తారు. చూడు శాంతి టీచరమ్మా! చదువు ఎందుకు చదువుకోవాలమ్మా నాకు తెలియక అడుగుతాను. చదువుకున్నోల్లందరికి కలెక్టరుద్యోగాలు వస్తున్నాయా? చదువుకొని మారాజులు ఎంతమంది లేరు?" కాళి అడిగింది.

"చదువుకుంటే ప్రపంచ జ్ఞానం వస్తుంది. మన తెలివి పెరుగుతుంది. జీవితంలో మోసపోకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు. అంతేకాదు నువ్వన్నట్లు ఉద్యోగాలు కూడా చేసుకోవచ్చు. ఉద్యోగం చేసుకుని గౌరవంగా బ్రతకచ్చు!" అంటూ చదువు ఆవశ్యకత గురించి ఓ పదినిమిషాలు ఉపన్యాసం యిచ్చాను.

కాళి - పార్వతి విన్నారు గాని - నా ఉపన్యాసం ఏ మాత్రం వారిమీద ప్రభావం చూపలేదని - రెండు రోజుల తర్వాత తెల్సింది.

పార్వతి చదువు మానేసి పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయింది... ఇన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడు చూస్తున్నాను...

"పదండి పోలీసులకు అప్పగిద్దాం" అంటూ ఆమెను ఈడ్చుకు పోతున్నారు - పార్వతి ఏడుస్తున్నా వినకుండా.

"ఆగండి... ఆమెని వదిలి పెట్టండి!" గట్టిగా అరిచాను.

"మేడం - ఇది దొంగతనం చేసింది... మేము చూడకపోతే ఇంకెన్ని దొంగిలించేదో!" మేనేజరు అంటున్నాడు.

"నేనటువంటిదాన్ని కాదన్నా! ఆకలి వేసింది." పార్వతి రోదిస్తున్నది.

"చూడండి... ఆకలి అన్ని అనర్థాలకు మూలం - ఆమెని వదిలిపెట్టండి... దొరికితే దొంగలు - లేకపోతే దొరలు! మనలో పట్టుపడని దొంగలు చాలామంది ఉంటారు." అంటూ వాతపెట్టాను.

ఎందుకో నన్ను - నా అవతారం చూసి మేనేజరు ఆమెని వదిలేశాడు.

"మీకు ఈమె తెల్సా మేడం?" అడిగాడు కాస్త కోపంగా.

"ఆ! పార్వతి - అని నా స్టూడెంటు ఒకప్పుడు" చెప్పాను.

ఆ మాటకు ఏడుస్తున్న పార్వతి - తలెత్తి నన్ను పరిశీలనగా చూసింది... ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"టీచరు - చాలా థాంక్సు టీచరు!" అంటూ నా కాళ్ళమీద పడింది.

"లే - లే! ఎందుకీపని చేశావు?" ఆమెని పైకి లేపుతూ లాలనగా అడిగాను.

పార్వతి ఏడుస్తూ - నన్ను బయటకు తీసుకువచ్చింది ఆ కళ్యాణమండపం నుండి... ఆమె ఏడుస్తూ చెప్పితే నాకు అర్థమయింది

ఇది.

పార్వతికి రంగడితో పెళ్ళి కుదిరింది. రంగడు మొదట్లో పొలాలకు కూలికి వెళ్ళేవాడు. అతనికి తోడు తనూ వెళ్ళేది... నలుగురు పిల్లలు పుట్టారు. చివరికి అతన్ని బలవంతాన ఒప్పించి ఫ్యామిలీ ప్లానింగు చేయించుకుంది... కరువు వచ్చి వాళ్ళ ఊరిలో పొలం పనులు ఆగిపోయాయి.

పొట్ట చేత్తో పట్టుకుని కడప చేరుకున్నాను. కడపలో ఓ రిక్షా బాడుగకు తీసుకుని తొక్కుతూ ఉండేవాడు. పార్వతి కూడా అంట్లు తోముతూ నాలుగు డబ్బులు సంపాదిస్తూ ఉండేది.

ఇలా ఉండగా రంగడికి క్షయ వ్యాధి వచ్చింది. రిక్షా తొక్కలేక పోతున్నాడు మంచంమీద పడ్డాడు.

కుటుంబ భారం పార్వతి మీద పడింది... అంట్లు తోమితే ఎంతని సంపాదించగలదు. చాలీచాలని సంపాదనతో ఇల్లు గడుపుకొస్తున్నది...

ఎప్పుడన్నా ఇలా పెళ్ళిళ్ళకు పిలిస్తే - నాలుగు పూటలా అన్నం తినచ్చు. అందుకనే తను తిన్నంత తిని - అన్నం - స్వీటు - కారాలు ఓ ప్లాస్టిక్ బ్యాగులో మూట కట్టుకుని చీరలో దోపుకుని తీసుకుపోతూ పట్టుపడింది.

"దొంగతనం నేరం అని నువ్వు చదువుకోలేదా పార్వతీ!" ఆర్ద్రంగా అడిగాను.

"నిజమే టీచర్! కాని... ఆకలితో నా పిల్లలు - మా పెనిమిటి చచ్చిపోతున్నారు. ప్రాణాలు నిలుపుకోవడానికి ఆపద్ధర్మంగా ఈ పని చేయవలసి వచ్చింది... ఆరోజు మీరు చెప్పినట్లు చదువుకుని ఉంటే నేను కూడా మీలాగా టీచరుద్యోగం చేస్తూ హాయిగా ఉండేదాన్ని?" పార్వతి వలవల ఏడ్చింది.

నాకు ఆమెను చూస్తే జాలి కలిగింది.

"పోనీ ఇప్పుడన్నా చదువుకోవచ్చు గదా! ఓపెన్ యూనివర్సిటీలో చదువు చదువుకోవచ్చు." పార్వతిని అడిగాను.

"తిండానికే తిండి లేదు - నా చదువుకు డబ్బులు ఎక్కడ్నుంచి తేసుకురాను - కాని మీరన్నట్లు సంసారంలో పడిన తరువాత చదువుల సారం ఎవరికీ అంటదు - మిగిలేది నిస్సారం - నీరసం మాత్రమే జివితంలో." బాధగా చెప్పింది.

పర్సు తీసి ఓ అయిదొందల కాగితం ఆమె చేతిలో పెట్టాను. "ఎందుకు టీచరు?" సంభ్రమంతో అడిగింది.

"ఏదో నాకు చేతనైనంత సాయం - దీంతో నీ సంసారం వెళ్ళిపోతుందని కాదు - ఓ నాలుగు రోజులు ఆనందంగా గడుపుతావని ఆశ!"

"వద్దు టీచరు - గురువుల దగ్గర తీసుకోకూడదు. నేనే మీకివ్వాలి ఆ రోజు మీరు చెప్పిన మాటలు విని ఉంటే నా జివితం ఇలా ఉండేది కాదు - అన్నట్లు నా స్నేహితురాలు గౌరీ కూడా నాలాగే చదువు మానేసి కూలికి పోతూ నానా పాట్లు పడుతున్నది - తెల్సా!" అడిగింది.

గుర్తొచ్చింది గౌరీ పార్వతి స్నేహితురాలు. పార్వతి మానేసిన ఓ నెలకు తనుకూడా మానుకుంది. ఏదో ఫ్యాక్టరీలో కూలికి పోతానని చెప్పి ఎంత నచ్చ చెప్పినా వాళ్ళ వాళ్ళు వినలేదు.

'ఆడపిల్లకు చదువు ఎందుకు?' అని గొడవ చేసి తీసుకుపోతారు.

"గౌరీ కనిపిస్తుందా?" అడిగాను.

"లేదు ఎప్పుడన్నా రోడ్లమీద తవ్వుతున్నప్పుడు కూలిపని చేస్తూ కనిపిస్తుంది!" చెప్పింది.

"పోనీలే ఆమె అన్నా బాగుందా?"

"ఏం బాగు. అదే బాగు! గుడిసెలో కాపురం - రేపు ఏమవుతుందో తెలియని బతుకులు మావి!"

"చిలక్కి చెప్పినట్టు చెప్పాను - మీ యిద్దరికీ చదువుకోమని - వింటేగా మీరు -" బాధగా చెప్పాను.

"మాకు ప్రాప్తం లేదు టీచరు -" అంటూ నేనిచ్చిన నోటు జేబులో పెట్టుకుని నా కాళ్ళకు నమస్కరించి మళ్ళీ కలుస్తానని వెళ్ళిపోయింది.

భారమైన మనసుతో పెళ్లిమందిరంలోకి వచ్చాను.

మరునాడు కాని మనసు విప్పి వసంతతో మాట్లాడ్డం కుదరలేదు.

"వసంతా! ఆలశ్యంగానన్నా పెళ్ళి చేసుకున్నావు - సంతోషం!" చెప్పాను.

"మరి ఏం చెయ్యను - చదువు అయ్యేసరికి పాతికపై పట్టింది. ఆ తరువాత రీసెర్చి -" చెప్పుకుంటూ పోయింది.

"ఇంతకీ నువ్వు ఇప్పుడేం చేస్తున్నావు?" అడిగాను.

"భారత ప్రభుత్వం నడిపే ఓ గొప్ప రీసెర్చి ఆఫీసర్ని - నేను చేసిన రీసెర్చికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. రేపు అమెరికాలో జరిపే కాన్ఫరెన్సులో నన్ను పేపరు చదవమని రాయల్ సొసైటీ వాళ్ళు ఆహ్వానించారు." చెప్పింది వసంత.

ఇంతలో వసంత అన్నయ్య వచ్చాడు అక్కడికి.

"శాంతి గారు మేము ఆడపిల్లలకు చదువు ఎందుకని అనుకున్నామా? అలా అని చదువు మాన్పించి ఉంటే చాలా ఘోరమైన పొరపాటు చేసిన వాళ్లమయ్యే వాళ్ళం - ఇప్పుడు చెల్లాయి పేరు తెలియని దేశంలేదు. ఫిజిక్సులో తను చేసిన రీసెర్చికి

అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. తనలో ఇన్ని తెలివి తేటలున్నాయని మాకు తెలియదు." చెప్పాడు వసంత అన్నయ్య.

"నాకు ముందే తెల్సు - వసంత జీనియస్సు అని!" చెప్పాను. "కాని పెళ్ళి చేసుకుని రీసెర్చి చేసి ఉంటే బాగుండేది." ఆమె ఏదో పోగొట్టుకున్నట్లు చెప్పాను.

"తప్పంట - అ యాల పెళ్ళి చేసుకొని ఉంటే ఆమె రీసెర్చి ఇంత బాగా చేసేది కాదు - మీకో సంగతి తెల్సా! బహుళజాతి కంపెనీలో కొన్ని ఆమె రీసెర్చిని తమకు అమ్మమని కోట్లు కోట్లు ఆశ చూపుతున్నాయి - ఆమెపైన ఆ విషయంలో ఎంతో ఒత్తిడి ఉంది." చెప్పాడు.

నేను బిత్తరపోయి నిజమా అన్నట్లు వసంత వంక చూశాను. "అవును శాంతి! ఎన్ని కోట్ల డాలర్లు నాకు ఆశ చూపించినా నా రీసెర్చి ఫలితాన్ని బహుళజాతి కంపెనిలకు అమ్మను. అది భారతదేశానికి మటుకే యిస్తాను. అది ప్రజలకు ఉపయోగపడాలి! స్వార్థపరులచేతుల్లో పడి డబ్బు సంపాదనకు పునాది వెయ్యకూడదు. నా జీవితాశయం అదే! నా తెలివితేటలు - నా పరిశోధన ఈ భరతజాతికి - ఈ మానవ జాతికి ఉపయోగపడాలి! వాళ్ళ జీవితాల్లో కొత్త వెలుతురు నింపాలి - అదే నా జీవిత ధ్యేయం!" వసంత చెప్పింది ఆవేశంగా.

నా వసంతలో కొత్త అవతారాన్ని చూశాను.

"భారతప్రభుత్వం ఈమెకు బిరుదు ప్రదానం చేయబోతున్నది. అదీగాక ఏన్నో వసతులు కల్పిస్తున్నది... వసంత మాకు - ఈ దేశానికి గర్వకారణం!"

వసంత తండ్రి చెప్పాడు గర్వంగా.

నాకు గుర్తొచ్చింది - ఆయనే వసంతకు చదువు ఎందుకని నానా యాగీ చేశాడు కొన్ని సంవత్సరాలక్రిందట! వసంత, నేను డిగ్రీలో పోటీ పడి చదివేవాళ్ళం - చాలాసార్లు నేను ఫస్టు వచ్చేదాన్ని - ఆమె నావెనుక ఉండేది. నా తెలివి తేటలకు తను ఈర్ష్యపడేది. అటువంటిది ఇప్పుడు ఆమె తెలివికి దేశం గర్వపడుతున్నది. చాలామంది ఈర్ష్య పడుతున్నారు. నేను కూడా ధైర్యం చేసి ఆమెలా చదువుకుని ఉంటే - నాకూ కీర్తి ప్రతిష్ఠలు గుర్తింపు వచ్చేవి!

వసంత తన భర్తను పరిచయం చేసింది -

"వెంకట్ అని నా కొలిగు రీసెర్చి ఆఫీసరు - నా ఫ్రెండ్ శాంతి!"

అతను నమస్కరించాడు. వసంతకు తగ్గట్టు చక్కని అందగాడు - సంస్కారవంతుడు - తెలివిగలవాడు.

"శాంతిగారు! వసంత లాంటి ఆడపిల్లను కన్న తల్లితండ్రులు ధన్యులు, కన్న దేశం చరితార్ధకమయింది. నేను అందరికి మనవి చేసేది ఒకటే! తెలివి తేటలున్నప్పుడు ఆడపిల్ల అని ఈసడించి చదువు మానిపించకుండా - ఆమెని బాగా చదివించండి - చదువు విషయంలో స్త్రీ పురుష వివక్ష తీసుకురావద్దు -" వెంకట్ చెప్పాడు.

"నిజమే! నా పిల్లల్ని బాగా చదివిస్తాను" అని నిర్ణయం తీసుకున్నాను.




"సుఖస్వరూపుడు, ఆనందస్వభావుడు అయిన జీవికి దుఃఖం ఎక్కడ నుంచి వస్తున్నది?" పురాణం చెబుతున్న శాస్త్రులు గారు ప్రశ్న.

"స్వామీ! మానవుడు సుఖస్వరూపుడు అని ఎలా చెప్పగలరు? ఆనంద స్వభావుడు అని ఎలా చెప్పగలరు? చిదానందంకు సందేహం కలిగింది. అతను సందేహ నివృత్తికోసం లేచి స్వామిని అడిగాడు.

శాస్త్రులు గారు చిన్నగా నవ్వారు. అందరి వంక కలయ చూశారు.

"నిద్రలో నీ స్వభావం ఏమిటి? గాడనిద్ర అయిపోయింతర్వాత నీ అనుభవం ఏమిటి? ఎవరైనా సరే హాయిగా నిద్ర పోయామంటారు. రాజుగాని, పేదగాని, ఎవరికైనా సరే గాడనిద్రలో కలిగే అనుభవం ఒకటే! ఆనందం! నిద్రలో నువ్వెవరు అంటే చెప్పగలవా? నువ్వురాజువా, సేవకుడివా, భర్తవా - భార్యవా అన్న బేధభావం కనిపిస్తుందా గాడనిద్రలో? కనపడదు. అక్కడ అనుభవించేదంతా ఆనందమే! ఆలోచించండి!" ఆగారు శాస్త్రులుగారు.

చాలామంది అర్ధం చేసుకుని తలలు వూపారు.

"ఆనందం స్వభావం మనది అని ఎలా చెబుతారు?" చిదానందం!

"ఎవరైనా సరే దుఃఖాలు కావాలని కోరుకుంటున్నారా? పుట్టిన శిశువు దగ్గరనుండి మరణించే వృద్ధుడి దాకా సుఖం పొందాలనే తాపత్రయం చెందుతూ ఉంటారు. అందరూ అర్రులు చాచేది సుఖం కోసమే! ఆ సుఖం ఎక్కడున్నది అన్నది ప్రశ్న - ప్రతి మనిషికి సుఖంలో తేడా వస్తూ వుంటుంది. కాని అతని కోరిక సుఖం కావాలనడంలో మటుకు సందేహం ఉండదు - అందుకని అతని స్వభావం సుఖం!" వివరించారు శాస్త్రులుగారు.

"మరి ఎందుకు మనం ఏడుస్తున్నాం! ప్రతి చిన్నదానికి దుఃఖం పొందుతున్నాం?" చిదానందం బుర్ర గోక్కుంటూ అడిగాడు.

"మీ అనుమానమే నా సందేహం కూడా! దార్న పోయే మారమ్మను పిలిచి మరీ తలమీద కెత్తుకుంటున్నాం! దుఃఖం బజారులో పోతూ ఉంటే వెంటబడి మరీ మన భుజాల మీదటి ఎక్కించుకుంటున్నాం! ఒక్కటి గుర్తించుకోండి - జీవితంలో అంతగా దుఃఖించవలసిన విషయాలు ఏవీ లేవు - మనం ఏం తీసుకువచ్చాం - మనవెంట ఏం తీసుకుపోతాం అని కనుక ఆలోచిస్తే ఎవరికీ దుఃఖం రాదు."

పురాణ ప్రవచనం అయ్యే సరికి రాత్రి పది దాటింది. చిదానందం ఆనందంగా ఇల్లు చేరుకున్నాడు. శాస్త్రులు గారు ఇచ్చిన ఉపన్యాసం అతని లోని నిరుత్సాహాన్ని పోగొట్టింది. ఇంక ఎప్పుడూ ఆనందంగా జీవించాలనుకున్నాడు. మాయకు లోబడకూడదనుకున్నాడు.

"ఏమండీ చిదానందం గారు! మీ పాటికి మీరు ఊళ్ళు పట్టుకు ఊరేగండి - నేను ఏ గంగలో నన్నా దూకి చావాల్సి వస్తుంది." కస్సుమని లేచింది అతని భార్య శారద.

"ఇప్పుడు నీకెంత కష్టమేమొచ్చిందే!" ఆశ్చర్యంగా అడిగాడు చిదానందం.

"అస్సలు ఇల్లు గురించి మీకేమన్నా పట్టిందా? మీరు ఒక భర్తలాగా - ఒక బాధ్యత గల తండ్రిలా ప్రవర్తిస్తున్నారా?" నిలదీసింది శారద.

చిదానందం బుర్ర గోక్కున్నాడు. 'బాధ్యత' అంటే అర్థం కాలేదు.

"సరే! ఉపోద్ఘాతం వద్దులే - విషయంలోకి రా!" విసుగ్గా అన్నాడు చిదానందం.

"లోపలికి రండి - చెబుతా!" శారద అతన్ని వంటింట్లోకి తీసుకుపోయింది తలుపులు మూసేసింది.

"శారదా! ఇప్పుడేంటి తలుపులు మూస్తున్నావు! అక్కడ కూతురు, కొడుకు చదువుకుంటున్నారు?" చిదానందం ఆశ్చర్యంగా అడిగాడు.

"అందుకే - వాళ్ళకు మన మాటలు వినిపించ కూడదని!" చెప్పింది.

"అంత రహస్యాలు ఏమున్నాయి మన మధ్య?"

"మీ అమ్మాయి ప్రవల్లిక ప్రేమలో పడింది? తెలుసా?"

"ఆ! ప్రేమా! దాని మొహానికి ప్రేమకావాల్సి వచ్చిందా? ఇంకా చదువుకూడా పూర్తి కాలేదు - బిటెక్కు యింకో సంవత్సరం ఉంది కదా!?" చిదానందం విస్తుపోయాడు.

ప్రవల్లిక అతని కూతురు - చాలా అందంగా ఉంటుంది. సన్నగా, పొడుగ్గా - ఆకర్షణీయంగా - చక్కటి కంఠస్వరంతో అందరిని ఇట్టే ఆకట్టుకుంటుంది.

"అంటే చదువు పూర్తయిన తర్వాత ప్రేమలో పడచ్చనా మీ ఉద్దేశ్యం? మనది సంప్రదాయ కుటుంబం - ఇట్లా ప్రేమలు - గీమలు అంటూ ఉంటే దాన్ని ఎవరు పెళ్ళిచేసుకుంటారండి? ఆడపిల్ల మీద ఒక్కసారి చెడ్డపేరు వచ్చిందంటే... మనలో ఎవరూ పెళ్ళి చేసుకోవడానికి ముందుకు రారు." గుర్తు చేసింది శారద.

"కరెక్టేనే! మన వాళ్ళు అంతా చాంధస్తపు వెధవలు! అన్నీ బావుంటేనే సంబంధాలు కుదరడం కష్టంగా ఉంది... మళ్ళీ క్యారెక్టర్ మీద మచ్చపడిందంటే ఇంకా ఎవరూ చూడ్డానికి కూడా రారు." చిదానందం దిగులు పడ్డాడు.

"ఇంతకీ అది ఎవరిని ప్రేమిస్తున్నాదో తెల్సా? మనకులం వాడ్ని కాదు - ఎవరో రెడ్డినిట! అవ్వ! మనం బ్రాహ్మలం - పోయిపోయి నాన్ వెజ్ రెడ్డిని ప్రేమించడమేంటి? మన కులంలో మన శాఖవాడ్ని కాకుండా - ఇతర శాఖలవాడ్ని చేసుకోవాలంటేనే బ్రహ్మ ప్రళయం అవుతున్నది... అటువంటిది ఏకంగా కులం - గోత్రం లేని వాడ్ని ప్రేమించేస్తున్నది..." శారద చెబుతున్నది...

చిదానందం మెదడు మొద్దు బారుతున్నది... కోపం నసాళానికి అంటుతున్నది. ఆనంద స్వరూపుడు కాస్తా విషాద స్వరూపుడు - క్రోధ స్వరూపుడుగా మారిపోయాడు.

"ఏదీ! దాన్ని చంపేస్తాను" చిదానందం ఆవేశంగా చిందులేశాడు...

"అయ్యో! మీకేది చెప్పినా ఒకటే ఆవేశం! కాస్త ఆలోచించండి - అని ఆవేశంలో ఏంచేసినా మనకే చెడ్డపేరు - కాస్త మంచిగా చెప్పాలి! మామాట వినకుండా ఇంట్లోంచి పారిపోయి వాడ్ని చేసుకున్నా మనకి మాయని మచ్చతెస్తుంది. ఆత్మహత్య చేసుకున్నా మనకే తలవంపులు - కొంచెం టాక్టుఫుల్ గా మాట్లాడాలి..." శారద మళ్ళీ హితబోధ చేయసాగింది.

చిదానందంకు ఆ ఆలోచనతో భోజనం సయించలేదు - నిద్ర కూడా సరిగా పట్టలేదు.

మరునాడు ఆదివారం... ప్రవల్లిక కాలేజికి వెళ్లనక్కర్లేదు...

"అమ్మా! నేను క్లాసుకు వెళ్ళొస్తాను..." అని బయలుదేరింది స్కూటరు మీద ప్రవల్లిక.

"ప్రవల్లికా - కాస్త ఆగు - నీతో మాట్లాడాలి!" చిదానందం చెప్పాడు.

"ఏంటి నాన్నా!" ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ పది నిమిషాలు టైమిస్తే మాట్లాడతాను - మేడ మీదికి పోదాం రా!" చిదానందం మేడమీదికి వచ్చాడు. మేడమీద రెండు గదులున్నాయి. అవి ఎక్కువగా వాడరు. గెస్టులు వచ్చినప్పుడు వాడతారు.

ప్రవల్లిక ఆశ్చర్యపడుతూ పైకి వచ్చింది.

చిదానందం ఓ కుర్చీలో కూర్చున్నాడు - ప్రవల్లిక అతని ఎదురుగా కూర్చుంది. "చూడు తల్లీ - ఈ మధ్య నీ ప్రవర్తనలో ఏదో మార్పు కనిపిస్తున్నది!"

"నా ప్రవర్తనలోనా!?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ! ఏదో పరధ్యానంలో ఉంటున్నావు - సరిగా నిద్రపోవడం లేదు - పుస్తకం ముందేసుకున్నా ఎక్కడో ఆలోచిస్తున్నావు!" చిదానందం చెప్పాడు.

"ఏం లేదు నాన్నా! బాగానే ఉన్నాను -" ప్రవల్లిక చెప్పింది.

"కొంపదీసి ప్రేమలోకాని పడ్డావా!"

"ఛీ! ఛీ! నన్నెందుకు అలా అనుకుంటున్నారు?" సిగ్గుగా అడిగింది.

"అది నీ తప్పు కాదమ్మా! నీ వయసు తప్పు! వయసు వేడి అలా ఉంటుంది ఈ వయసులో ఏమొగాడు కన్పించినా మన్మధుడిలా కనిపిస్తాడు. కాస్త ఒడ్డు - పొడుగు ఉండి - నాలుగు మాటలు స్టైల్ గా మాట్లాడంగానే ఆడోళ్ళు మనసు పారేసుకుంటారు - కాని ఈ ప్రేమలు, దోమలు, నమ్మద్దు. మగాడు తుమ్మెద లాంటివాడు. మధువు కోసం పువ్వు మీద వాలతాడు - మధువు ఆఘ్రాణించి తుమ్మెద వేరే పువ్వును వెతుక్కుంటూ వెళ్ళినట్లు - ప్రేమ ముసుగులో పబ్బం గడుపుకుంటాడు. తీరా పెళ్ళి అనే సరికి కులం - గోత్రాలు - కట్నాలు గుర్తుకొస్తాయి. మొగాడు చపలచిత్తుడు! ఆడది ప్రేమించినంత గాడంగా ప్రేమించలేదు! అవకాశవాది! అందులో ఈ కాలేజిలో ప్రేమలు అస్సలు నమ్మదానికి లేదు. బరువు బాధ్యతలు లేని వయసు. అందమైన అనుభవం కోసం అర్రులుచాస్తూ ఉంటాడు. కాని ప్రకృతి స్త్రీ పట్ల శత్రువు అవుతుంది. ఆనాటి శకుంతల నుండి ఈ కాలం ఆధునిక స్త్రీ దాకా మొగాడి మాయమాటల్లో పడి మోసపోతూనే ఉంది. జాగ్రత్త!" చిదానందం చిన్న ఉపన్యాసం యిచ్చాడు చిన్నగా.

" కాని నాన్నా, నాకివన్నీ ఎందుకు చెబుతున్నారు! నేను మీకూతుర్ని!" ప్రవల్లిక ఆశ్చర్యంగా అడిగింది.

"అందుకే గదమ్మా నా బాధ! ఆకు వచ్చి ముల్లు మీద పడ్డా - ముల్లు వచ్చి ఆకుమీద పడ్డా ఆకుకే నష్టం! పెళ్ళి కాని పిల్లవు నువ్వు ఒక్క పొరపాటు అడుగు వేసినా మా పరువు పోతుంది - మాకు ఆత్మహత్య తప్పించి వేరే గతిలేదు - ఆలోచించుకో - నాప్రాణం - మీ అమ్మప్రాణం నీ చేతిలో ఉంది - మా ఆశలన్నీ నీపైనే - నీ తమ్ముడి భవిష్యత్తు కూడ దెబ్బతింటుంది!" చిదానందం ముగించాడు.

ప్రవల్లిక మొహం బాగా నల్లబడిపోయింది. చివాల్న లేచి కిందకు వెళ్ళిపోయింది. బండి స్టార్టయి వెళ్ళిపోయిన శబ్దం అయింది.

చిదానందం తృప్తిగా నవ్వుకున్నాడు - తండ్రిగా తన బాధ్యత నెరవేర్చాడు. వార్నింగు యివ్వలేదనకుండా తను చెప్పాల్సింది చెప్పాడు బ్రెయిన్ వాష్ చేశాడు - ఇంక జీవితంలో తప్పటడుగు వెయ్యదు కాక వెయ్యదు.

ఇంకో రోజు శారద చిదానందంకు యింకో కంప్లెయింటు యిచ్చింది - "మీ సుపుత్రరత్నం సరిగ్గా చదువుకోవడం లేదు - చెడు స్నేహాలు పట్టి చెడిపోతున్నాడు - వాడికి చదువు మీద కంటే క్రికెట్ మీద ధ్యాస ఎక్కువయింది." అంటూ చాలా సేపు అతనికి తలంటి పోసింది.

చిదానందంకు ప్రసన్నకుమార్ పైన చాలా కోపం వచ్చింది.

"ఒరేయ్ ప్రసన్నా! అడ్డగాడిదా! ఇలారారా!" కోపంతో కేకలేశాడు.

"ఏంటి డాడీ!" వినయంగా వచ్చాడు క్రికెట్ బ్యాట్ పట్టుకుని.

"ఎక్కడికిరా పోతున్నావు ప్రొద్దున్నే!"

"ఇవ్వాళ గ్రౌండ్ లో మ్యాచ్ ఉంది డాడీ!" ప్రసన్నకుమార్ చెప్పాడు.

"జీవితమంతా క్రికెట్టేనేరా? ఒరేయ్ ఈ ఆటలు కూడు బెడతాయా గుడ్డనిస్తాయా?" వెక్కిరింతగా అడిగాడు.

"అదేంటి డాడీ! మన క్రికెటర్లు కోట్లు సంపాదించడం లేదా? నేను కూడ ఒక సచినో - ఒక లక్ష్మణో - ఒక ధోనినో అవుతే ఇంక డబ్బుకు లోటేముంటుంది?" విస్మయంగా అడిగాడు ప్రసన్నకుమార్.

"నిజమే నువ్వు ఆ స్థాయికి పోతే ఫర్వాలేదు - కాని ఫెయిలయ్యావో అనుకో -"

"ఎందుకనుకోవాలి! నా కృషి నే చేస్తున్నాగా -" అర్థం కాలేదు ప్రసన్నకు.

"కాసేపు అనుకోరా? దేశంలో ఎంతమంది క్రికెట్ పిచ్చివాళ్ళు లేరు."

నూట పదికోట్ల జనాభాలో ఎన్ని లక్షల మంది క్రికెట్ ప్లేయర్లు లేరు. మరి వాళ్ళందరికీ నేషనల్ టీమ్ లో చాన్సు దొరుకుతున్నదా? ఆలోచించు!" చిదానందం లాజికల్ గా అడిగాడు.

ప్రసన్నకుమార్ బిత్తరపోయాడు - బ్యాట్ నేలకేసి కొట్టాడు...

"ఆ! ఆ చాన్సు కోసమే గదా నేను రోజూ ప్రాక్టీస్ చేస్తున్నది" చెప్పాడు.

"నిజమేరా? మరి చదువు ఎవరు చదువుతారురా? ఇంటర్ అయిపోయింది... మెరిట్ లో బిటెక్కులో సీటు రాలేదు - లాంగ్ టర్మ్ కోచింగ్ లో చేరావు - ఈ సారన్నా ఎమ్ సెట్ లో ర్యాంకు వచ్చి - మంచి కాలేజిలో సీటు వస్తుందా?" అడిగాడు చిదానందం.

"వస్తుందనే అనుకుంటున్నాను - కాని డాడీ! ఎప్పుడూ చదివినంత మాత్రాన సీటు వస్తుందనుకోవద్దు - రోజుకు ఇన్ని గంటలని చదువుతున్నా - మిగతా గంటలనే ఆటలమీద పెడుతున్నాను. అయినా మీరు అన్నట్లు సీటు వచ్చినా - బిటెక్కు చేసినా మంచి జాబు వస్తుందని మీరు రాసివ్వగలరా? రోజూ ఎంతమందిని చూడ్డం లేదు. సంవత్సరానికి అరవై డబ్బై వేలమంది బిటెక్కు పూర్తి చేస్తున్నారు. అందులో! వీరిలో క్యాంపస్ సెలక్షన్లు కేవలం కొన్ని వందల మందికే వస్తున్నాయి. కొందరు అమెరికా పోతున్నారు - ఇంకా కొందరు చిన్నా - చితక ఉద్యోగాలు చేస్తున్నారు. అత్యధికులు ఉద్యోగాల వేటలో వున్నారు - బాగా చదువుకున్నంత మాత్రాన గ్యారంటీగా ఉద్యోగం వస్తుందని నమ్మకం లేదు -"

ప్రసన్నకుమార్ రివర్సు స్వింగ్ వేశాడు.

చిదానందం ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. కాసేపటి తర్వాత అన్నాడు "అందుకని చదవకుండా అడ్డగాడిదలా తిరుగుతానంటావు!"

"అని అనడం లేదు - నా భవిష్యత్తు నాకు తెల్సు - మీరేం నాగురించి వర్రీ అవ్వద్దని చెబుతున్నాను - నా గురించి ఆలోచించి మీరు బిపి పెంచుకుంటే అమ్మకు - మాకు కష్టం కులుగుతుంది. అప్పుడు మా కాన్సంట్రేషన్ దెబ్బతింటుంది" ప్రసన్నకుమార్ తండ్రికి క్లాసు తీసుకున్నాడు.

"అబ్బా! చాలా ఎదిగి పోతావురా!" చిదానందంకు నోట మాటరావడం లేదు.

"డాడీ! నా టీమ్ మేట్లు నాకోసం ఎదురు చూస్తూ ఉంటారు - నేను వెళ్ళాలి - అందులో యివ్వాళ నేను సెంచురీ చేసి తీరాలి!" ప్రసన్నకుమార్ బై చెప్పేసి బండి మీద వెళ్ళిపోయాడు.

ఈ సంభాషణ లోపలినుంచి విని ప్రవల్లిక నవ్వుకుంది.

"ఏమోవ్! నీ కొడుకు చూడు ఎంత పెద్దవాడయ్యాడో - వాడికి తండ్రి అన్నాకూడ లెక్కలేకుండా ఉంది. వెధవకి నాలుగు రోజులు తిండి పెట్టడం మానేస్తే తెలుస్తుంది. జీవితమంటే

ఏమిటో! కష్టపడి సంపాదించి తెస్తుంటే బాగా తిని అందరికీ నీతులు చెబుతున్నాడు - ఇడియట్!" కోపం వచ్చింది చిదానందంకు.

"అబ్బ! మీకు ఏది చెప్పినా కష్టమే - మీరు మీ పని చూసుకోండి!" శారద చెప్పింది చిదానందంకు.

ఒకరోజు చిదానందం ఆఫీసులో బిజీగా ఉన్నాడు. ఆఫీసరు అవతారం పిల్చి కొన్ని ఫైల్సు గురించి అడిగాడు. చిదానందం ఓపిగ్గా చెప్పాడు అవతారంకు అర్ధం కాలేదు - మళ్ళీ రాసి తీసుకురమ్మన్నాడు.

"ఏం సార్! ఈ ఫైళ్ల గురించి యింత యిదిగా ఆలోచిస్తారు. జగత్ మిథ్య బ్రహ్మ సత్యం! అంతా జగన్నాటకం! దాని గురించి ఇంత తలబద్దలు కొట్టుకోవడం ఎందుకు సార్! పైవాడి కేం తెలుస్తుంది సార్!" అంటూ కొంత మెట్ట వేదాంతం చెప్పుకొచ్చాడు.

ఆఫీసరు అవతారం తలూపి పంపించేశాడు.

కాని మరునాడు చిదానందం టేబులు మీద మెమో ఉంది.

లబలబలాడుతూ అవతారం గదిలోకి వెళ్ళి వాపోయాడు చిదానందం.

"ఏముందిలే చిదానందం - ఆఫీసు మిథ్య - మెమో మిథ్య - ఈ మాయా ప్రపంచంలో ఏది శాశ్వతం? ఈ మెమో గురించి అంత వర్రీ ఎందుకవుతావు? బ్రహ్మ సత్యం -" అని చెప్పి పంపించేశాడు, ఆఫీసరు అవతారం.

దాంతో చిదానందంకు ఆఫీసులో కూడా కష్టాలు మొదలయ్యాయి.

ఇంతలో - ఓ రోజు ప్రవల్లిక జెండా ఎత్తేసింది. తన ప్రియుడు హరినాధరెడ్డితో తిరుపతికి పారిపోయి పెళ్ళి చేసుకుంది.

ఉత్తరం ద్వారా ఈ సంగతి తెలుసుకుని చిదానందం హతాశుడయ్యాడు శారద పరిస్థితి చెప్పనక్కరలేదు.

అతి కష్టం మీద ప్రవల్లిక ఇంటి అడ్రసు కనుక్కుని వెళ్ళాడు -

"నాన్నా! మమ్మల్ని ఆశీర్వదించు నాన్నా!" అంటూ ప్రవల్లిక అతని కాళ్ళమీద పడింది.

"ఒసేయ్! అయిందేదో అయిపోయింది... ఇంక మనింటికి వచ్చెయ్యి." ఆమె చేతులు పట్టుకుని చెప్పాడు.

"అంటే నాన్నా! మా పెళ్ళిని మీరు పెద్ద మనసుతో ఆమోదిస్తున్నారు కదూ!" అనుమాన నివృత్తి కోసం అడిగింది.

"ఛీ! ఛీ! అది పెళ్ళి కాదు - బొమ్మలాట! వాడు కట్టిన తాళిని వాడి మొహాన విసిరేసి రా! ఇది పీడకలగా మర్చిపో!" చిదానందం చెప్పాడు.

"నాన్నా! ఓ తండ్రి అయి ఉండి ఇలా మాట్లాడతారా! కూతురు కాపురం చేతులారా చెడగొడతారా?" ప్రవల్లిక ఆశ్చర్యపోతూ అడిగింది.

"మామగారు! పెద్ద వాళ్ళు మీరు మాట్లాడవలసిన మాటలా యివి?" హరినాధరెడ్డి బాధగా అడిగాడు.

"షటప్ యూ రాస్కెల్! నువ్వు మాట్లాడకు. నీ మీద పోలీసు కంప్లెయింట్ యిస్తాను. మా అమ్మాయికి మందుపెట్టి అమాయకురాలిని బుట్టలో వేసుకుంటావా? ఇంతకు యింత అనుభవిస్తావు! జాగ్రత్త!" చిదానందం ఆవేశంగా శివతాండవం చేశాడు కాసేపు.

హరినాధరెడ్డికి కోపం వచ్చింది. ఆవేశంగా మీదకు పోయాడు. ప్రవల్లిక అడ్డుపడి దండం పెట్టింది - ఏమీ చెయ్యొద్దని.

"చూడు - మీ అమ్మాయి మొహం చూసి వదిలి పెడుతున్నాను - ఇంకోసారి నా గుమ్మం తొక్కొద్దు - మర్యాదగా ఉండదు." హెచ్చరించాడు రెడ్డి.

"ఏమ్మా! ప్రవల్లిక! నువ్వు అలా నిలబడ్డావేమ్మా! మీ అమ్మ తిండి తిప్పలు లేకుండా మంచాన పడి ఉంది. నువ్వు రాకపోతే చచ్చిపోతుంది. ఒక్కసారి రామ్మా మనింటికి!" ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"నాన్నా! అది మనిల్లు ఎలా అవుతుంది! అది మీ ఇల్లు! ఆడపిల్లకు పెండ్లి కాగానే అది పరాయి యిల్లు అవుతుంది. మెట్టినిల్లే తనిల్లవుతుంది అని నువ్వు చెప్పావుగా నాన్నా!" ప్రవల్లిక చెప్పింది.

"అది సాంప్రదాయంగా పెండ్లి చేసి పంపితే! నీలాగా లేచిపోయి - గోప్యంగా గుళ్ళో పెళ్లి చేసుకుంటే కాదమ్మా! నువ్వు వయసు వేడిలో తొందరపడ్డావు. వీడు నిన్ను వాడుకుని వదిలేస్తాడు - అపుడు నీకు దిక్కెవరమ్మా? ఏమ్మా! ఈ తండ్రి నీకు పెండ్లి చెయ్యలేడనుకున్నావా?" ఏడ్చాడు చిదానందం.

ప్రవల్లిక కొంత కరిగి పోయింది.

"నాన్నా! వస్తాను - కాని ఆయన్ని ఏమి అనకూడదు - ఇద్దర్నీ ఆశీర్వదించి పంపించండి - చాలు" అని బ్రతిమాలింది.

"ఛీ! ఛీ! వీడి మొహం చూస్తేనే పంచమహా పాతకాలు పుడతాయి. కులం తక్కువ వీడ్ని ఎలా చేసుకున్నావమ్మా! మీ ఇద్దర్ని చూస్తే మీ అమ్మ గుండె పగిలి చచ్చిపోతుంది. నువ్వొక్కదానివిరా!" చిదానందం చెప్పాడు.

"ఏం హరనాధ - వెళ్ళమంటావా?" అడిగింది ప్రవల్లిక.

"ప్రవల్లిక! ఈ ముసిలాళ్ళ సంగతి నీకు తెలీదు - పచ్చటి కాపురంలో చిచ్చు పెడతారు - నిన్నేమైనా చేస్తారు - వద్దు -" హరినాధరెడ్డి చెప్పాడు.

"సారీ! నాన్నా! మీ మనసు మారింతర్వాత వస్తాం - వెళ్ళండి -" చెప్పింది.

"ఒసే ఇరవై సంవత్సరాలు పెంచిన ప్రేమ కంటే ఓ రెండు నెల్ల కామం నీకు ఎక్కువయిందటే! పురుగులు పడి చస్తావే! తల్లితండ్రుల్ని ఏడ్పించిన వాళ్ళు ఎవరూ బాగుపడరు - సర్వ నాశనమై పోతావు!" అంటూ శాపనార్థాలు పెట్టి వచ్చేశాడు.

ఆ షాక్ తో శారదకు మునుపటి ఆరోగ్యం చేకూరలేదు - చిదానందంకు మునుపటి ఆనందం - భక్తి కలగడం లేదు -

గోరుచుట్టుపైన రోకటి పోటులాగా - ప్రసన్నకుమార్ కు ఎమ్ సెట్ లో ఈసారి ర్యాంకు రాలేదు. ప్రముఖ కాలేజీల్లో కాదు గదా - పరిసర ప్రాంతాల్లో అనుకున్న సబ్జెక్టులో సీటు దొరకడం గగనకుసుమంగా మారింది.

"ఒరేయ్ బడుద్ధాయి! ఏం చేద్దామనుకుంటున్నావు?" అడిగాడు ఓ రోజు.

"మళ్ళీ లాంగ్ టర్మ్ కోచింగ్ లో చేరతాను"

"ఇప్పటికే ఒక సంవత్సరం పోయింది - నాకు ఓపిక లేదు?" చెప్పేశాడు చిదానందం చిరాగ్గా.

"సరే! నన్ను క్రికెట్ మీద కాన్సన్ట్రేట్ చెయ్యనివ్వండి - మీరు చదువు చదువు అని పట్టు పట్టకుండా ఉంటే ఈ లైన్ లో నేను బాగా రానిస్తాను."

"ఉట్టికెగరలేని అమ్మ స్వర్గానికెగిరిందని - కాలేజీలో సీటు తెచ్చుకోలేకపోయావు - క్రికెట్ లో ఎలా పైకొస్తావు!" చిదానందం అడ్డు ప్రశ్న.

"దానికి దీనికి సంబంధం ఏమిటి? అది బలవంతాన చదివేది - ఇది ఇష్టపడి ఆడేది. కష్టపడి చదివే ఇష్టం లేని చదువు తలకెక్కదు. నా ఆటలో నా అదృష్టాన్ని పరీక్షించుకోనివ్వండి". ప్రసన్నకుమార్ చెప్పాడు.

"నీకేంరా - అడ్డగాడిదలా తిని బలిసిపోతున్నావు! ఒక బాధ్యత లేదు - ఒక బరువు లేదు రేపొద్దున నేను రిటైరైపోతే ఎవరు నిన్ను పోషిస్తారు? ఈలోగా నీకు మంచి ఉద్యోగం రావాలి కదా! నీ క్వాలిఫికేషన్ చూస్తే పిల్చి నీకు అటెండర్ పోస్టు కూడా యివ్వరు. పది రూపాయలు బయట సంపాదించు తెలుస్తుది రూపాయి విలువ!" అవకాశం

దొరకపుచ్చుకొని క్లాసు పీకాడు చిదానందం.

అంతా విని ప్రసన్నకుమార్ ఓ మాట అన్నాడు - "నీకు బరువైతే - అక్క బావ పోషిస్తారులే - నువ్వేం బాధపడకు!"

ఆ మాటకు షాక్ తిన్నాడు చిదానందం. చిత్తర్వులా నిలబడిపోయాడు.

"నామీద మీరు ఎంత ఖర్చు పెట్టింది - పద్దు రాసి పెట్టండి - నేను ప్రయోజకుడినైన తరువాత - అణాపైసలతో సహా మీ బాకీ తీర్చేస్తాను" చెప్పి బ్యాట్ పట్టుకుని వెళ్ళిపోయాడు చక్కగా ప్రసన్నకుమార్ అప్రసన్నంగా.

"అయ్యో! నాకు చావు కూడా రావడం లేదు. ఇవన్నీ బ్రతికుండగానే చూడాల్సి వస్తున్నది." శారద బాధపడింది. వల వల విలపించింది.

అప్పటి నుంచి చిదానందంకు జీవితం నరక ప్రాయమైంది. ఎప్పుడూ ఒకటే ఆలోచన! ఆఫీసులో కూడ సరిగా పనులు

చేయలేకపోతున్నాడు. ఇంటికొస్తే భార్య అనారోగ్యం - కొడుకు ఆటల పిచ్చి! బయటికి పోతే కుటుంబం పరువు గురించి గుసగుసలు! తోటి కులస్తులతో తలవంపులు!

ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్నది...

కొంతకాలం తర్వాత, ఆరోజు శాస్త్రులుగారు కర్నూలు వేంచేస్తున్నట్లు పేపర్లో చూశాడు. చిదానందంకు అంతకు ముందు ఆయన సంభాషణ - ఉపన్యాసం గుర్తుకొచ్చి బాధపడ్డాడు.

కాని ఇంట్లో కూర్చుని ఏడ్వడం కంటే - అలా పురాణకాలక్షేపం కోసం వెళ్ళితే రిలీఫ్ ఉంటుందని బయలుదేరి వెళ్ళాడు.

వేదాంతం గురించి ఉపన్యసించారు శాస్త్రులుగారు.

"సుఖ స్వరూపుడు - ఆనంద స్వభావుడు అయిన నీకు దుఃఖం ఎక్కడ నుంచి వస్తున్నది? నీ స్వభావం ఆనందం - నీ స్వరూపం ఆనందం. ఎందుకు దుఃఖిస్తున్నావు? జీవితంలో ఏం పోగొట్టుకున్నావని బాధపడుతున్నావు?" అంటూ అందరిని ఉద్దేశించి చాలా చాలా మంచి విషయాలు చెప్పుకొచ్చారు.

అవి వింటున్నంత సేపు చిదానందంకు బాగుంది. కాని ఆయన ఉపన్యాసం అయిపోగానే తన కష్టాలు గుర్తుకొచ్చాయి.

అందరూ వెళ్ళిపోయే దాకా ఉండిపోయి - శాస్త్రులు గార్ని ఏకాంతంగా కలుసుకున్నాడు.

"స్వామీ! మీరు చెప్పినట్లు దుఃఖం జయించడం అంత సులభం కాదు. మన కళ్ళ ఎదుట ఎన్నో చేదు సంఘటనలు జరుగుతూ ఉంటే మనం ఎలా ఆనందంగా ఉండగలం?" చిదానందం ప్రశ్న.

"నువ్వు స్థిత ప్రజ్ఞుడువు కావాలి! నీ దుఃఖం అర్జునుడికంటే గొప్పదా! తాతలు - తండ్రులు - గురువులు ఎదురుగా నిల్చుని పోరాడుతున్నారు అయినా అతను దుఃఖించలేదే! తన కర్తవ్యం నెరవేర్చాడు!" శాస్త్రులు చెప్పారు.

"నిజమే, అతను గొప్పవాడు - అందరూ ఆస్థాయికి ఎదగలేరు గదా! వారికి దుఃఖం తప్పదు కదా! అయినా మీకు నాలాంటి అనుభవాలు జరిగి ఉంటే ఇలా మాట్లాడి ఉండేవారు కాదు - సన్యాసులకు సంసారుల కష్టాలు ఏం తెలుస్తాయిలేండి!" అని నిష్ఠూరంగా పలికాడు.

"చిదానందం! నీకోసం అయిదు నిమిషాలు కేటాయిస్తాను - నీ సమస్యలు చెప్పు." అన్నారు శాస్త్రులుగారు. చిదానందం జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్లు చెప్పాడు.

"చూడు చిదానందం! నువ్వు మాయలో వున్నావు. అందరూ నీ మాట వినాలి అని ఆలోచిస్తునావు! ఎందుకు వినాలి? వాళ్ళు నీకేమవుతారు?"

"అయ్యో! వాళ్ళు నా కన్నబిడ్డలు -"

"వారి కాయాలు కనడానికి నువ్వు కారణమాత్రుడివే! వారి అదృష్టాన్ని నువ్వు కన్నావా? నువ్వు పెంచావని వారు పెరిగారా? అలా పెరిగేటట్లయితే కోటీశ్వరుల ఇంట్లో పెరిగే పిల్లలు కూడా చనిఓతున్నారే! పెళ్లి చేసేవాడివి నువ్వా? అలా అయితే శాస్త్ర బద్ధంగా - సంప్రదాయం ప్రకారం జరిగిన పెళ్ళిళ్ళు కొన్ని విఫలమయి పోతున్నాయే!"

"నిజమే! కాని వారి భవిష్యత్తు పాడయిపోతుందని నా ఆవేదన!"

"జరగాల్సింది జరక్కమానదు - దాని గురించి నువ్వు ఆరోగ్యం పాడు చేసుకోవడం చింతించడం మూర్ఖత్వం!

అంతకంటే దేవుని మీద ధ్యాస పెట్టి ఉంటే పుణ్యం పురుషార్థం వస్తుంది." చెప్పాడు శాస్త్రుజ్ఞులు.

"ఇన్ని కష్టాలుంటే మనసు ఎలా నిలుస్తుంది స్వామి - మీ కంటే ఏ సమస్యలూ లేవు! మీరు ఎన్ని పురాణాలైనా చెబుతారు!" తీసి పారేశాడు నిష్ఠూరంగా.

"చిదానందం! నువ్వు నాతో పోలిస్తే చాలా అదృష్టవంతుడివి! మీ అమ్మాయి కేవలం కులం కాని వాడ్ని చేసుకుంది. మా అమ్మాయి మతం కాని వాడ్ని కూడా చేసుకుంది. నేను పరమ నిష్ఠాగరిష్ఠుడ్ని - అది నా మతాన్ని కులాన్ని నాశనం చేసింది. మా అబ్బాయి దొంగతనం చేసి జైలు పాలయ్యాడు. ఈబాధలు పడలేక నా భార్య గుండెనొప్పితో చనిపోయింది! మరి నీ కష్టం ఎక్కువా? నాదా?" శాస్త్రులు గారు అడిగారు.

చిదానందం నివ్వెరపోయాడు.

"నీది కాని దాన్ని నీది అనుకుంటేనే నీకు దుఃఖం వస్తుంది. ప్రపంచం అంటే పంచేంద్రియాలకు ప్రముఖంగా కనిపించేది. సత్యమన్నది మూడు అవస్థల్లో, మూడు కాలాల్లో ఉండాలి. నీ దుఃఖం జాగ్రదావస్థలో ఉంటుంది. కాని గాడనిద్రలో ఉండదు. కాబట్టి అది నిజం కాదు. గాడనిద్రలో వున్నప్పుడు పులి కల్లో కొచ్చి మింగబోతే భయపడతామా లేదా? నిద్ర లేచింతర్వాత మన భయానికి మనమే నవ్వుకుంటాం! ఇది కూడ అంతే! ఈ మాయా ప్రపంచంలో మనది కాని కష్టాన్ని మనదనుకుని భ్రమ పడి బాధలు పడుతున్నాం!" వివరించారు శాస్త్రులు.

"అంతే నంటారా స్వామి?"

"ఆ! మనసు బహిర్గతం చేసుకుంటే బాధలు - మనసు అంతర్గతం చేసుకుంటే ఆనందం కలుగుతుంది. మనం వచ్చేప్పుడు ఏం తెచ్చాం? వెళ్ళేప్పుడు ఏం తీసుకుపోతున్నాం? వాళ్ళు నీకు తోడుగా ఎంత దాకా వస్తారు? మహాఅయితే కాటి దాకా - ఆపైన ప్రయాణం నువ్వు ఒంటరిగా చెయ్యాలి! ఆ ప్రయాణంలో నీకు భగవంతుడే తోడు!" శాస్త్రులుగారు బోధించారు.

"అయితే నేను విచారపడనక్కర లేదంటావా?" చిదానందం అడిగాడు.

"ఒక నటుడు విషాద పాత్ర నటిస్తూ ఉంటే - ఆ విషాదం ఆ నాటకం ముగిసింతర్వాత అతని వెంట వస్తుందా? ప్రపంచమనే నాటకరంగంలో మనమందరం పాత్ర ధారులం మాత్రమే! ఈ మాత్రం దానికి ఆనందమయజీవితాన్ని దుఃఖమయం చేసుకోవడం అనవసరం!" శాస్త్రులుగారు చెప్పారు.

"అస్సలు నాకు ఆనందం ఎక్కడా కనిపించడం లేదు స్వామి యవ్వనంలో వున్నప్పుడు కొన్నాళ్ళు ఆనందపడ్డాను - కాని ఇప్పుడు -"

"ఎండమావులలో నీ దాహం ఎంత తీరుతుందో, విషయవాంచలలో నీ దాహం అంత తీరుతుంది. కోరికలు అనంతం! ఒక కోరిక పూర్తి కాగానే ఇంకో కోరిక పుట్టుకొస్తుంది. విషయానందం దుఃఖాన్ని మాత్రమే మిగిలిస్తుంది. కాని పరమాత్మ పైన మనసు నిలిపితే వచ్చే పరమానందం శాశ్వతం! అది అలవరచుకో!" శాస్త్రులుగారు చెప్పారు.

కాని అంత సులభమా స్వామి?" చిదానందం ప్రశ్న.

"కాదు కాబట్టే అభ్యాసం - వైరాగ్యం చేత ధ్యానాన్ని నిలుపుకోవచ్చు. ఎక్కువ ఆహారం తీసుకోవద్దు - ఎక్కువ ఆలోచనలు చేయవద్దు - ఎక్కువ మాట్లాడద్దు! అన్నీ సర్దుకుంటాయి. మనసుకోతి లాంటిది - అసలే కోతి - ఆపై కల్లు తాగింది ఆపై ముల్లుగుచ్చుకుంది లాగా - చంచలమైన మనసు విషయ వాంచలతో గంతులేసి ఆనందం ఆనందం అని అర్రులు చాచి విషయ భోగాలతో చిక్కుకుని - రోగాల పాలవుతున్నది. అందుకని బుద్ధితో మనసును అదుపులో పెట్టుకుంటే కొన్ని దినాలకు అంతా అదుపులోకి వస్తాయి! చిత్త వృత్తులను నిరోధించడమే యోగం! యోగం సిద్ధిస్తే యోగి అవుతావు - నిరోధించలేకపోతే రోగివవుతావు! జన్మ జన్మల దుఃఖం అనిభవిస్తావు! కాబట్టి సుఖపడాలంటే మనసును మాయం చేసుకో!" చిదానందం శాస్త్రులుగారి ప్రవచనానికి ఆనందంతో పొంగిపోయాడు మార్గం సుగమం అయింది.




"హలో ! సుజా...లవ్ యు ..."

"ఇది ఎన్నోసారి చెప్పడం" కిలకిల నవ్వుతూ అంది...

"వందసార్లు చెబుతానోయ్ నీకేమన్నా అభ్యంతరమా!" అన్నా

"నాకేమీ అభ్యంతరం లేదు కానీ ... కొన్ని పదాల్ని పొదుపుగా వాడితేనే అందమేమో...ఆలోచించు ..."

నేను అలోచనలో పడ్డా... సుజా చెప్పిందంటే ఆలోచించాల్సిందే...ఆమె చెప్పిన ప్రతి విషయం చాలా సున్నితంగా, ప్రాక్టికల్ గా వుంటుంది...

"కానీ నాకు పదే పదే చెప్పాలనిపిస్తుంది... సుజా మరేం చేయను, నీతో ప్రేమలో పడ్డం ఒక వింత అనుభవం... ఒక్క నిముషంకూడా మరపు రావే... మనసంతా నీవే ఉంటావే " నా మనసులో వున్న విషయం చెప్పా.

"సరేలే... పర్లేదులే చెబుతూ వుండు... కానీ నేను మా ప్రొఫెసర్ దగ్గరున్నప్పుడు మాత్రం ఫోన్ చేయకు... నాకు చాలా ఇబ్బందిగా వుంటుంది...

నీతో ప్రేమలో పడ్డం నాక్కూడా చాలా థ్రిల్లింగ్ గా వుంది... కానీ నీకు వచ్చినట్లు, మరీ అంత జ్వరం రాలేదులే..." నవ్వు చప్పుడు కాకుండా చేయి అడ్డం పెట్టుకుంది కాబోలు నాకు కిలకిలలు వినపడలేదు.

"వూ... అయితే ప్రేమ జ్వరం నాకే సోకింది... నీకు ఈ అంటు వ్యాధి తాకలేదు. నీకు చాలా... చాలా రెసిస్టన్స్ వుంది కదా! అబ్బ సుజా... నిన్ను చూడాలనిపిస్తోంది... ప్లీజ్ కలుద్దాం..."

"నాకు ఉదయం నుండి చాలా పని ఉండింది సరే... ఫస్ట్ షో వెళదాం... వస్తావా...! "

"నేను అమ్మమ్మ గారి వూర్లోవున్నా... గంట అవుతుంది ఓకే..."

"త్వరగా వచ్చేయ్... అప్సరలో రాజేంద్ర ప్రసాద్ సినిమా "ఓనమాలు" వెళదాం..."

"ఇంకేం మంచి సినిమాలు లేవా"

"అంటే అది మంచి సినిమా కాదనా నీ ఉద్దేశం?". సుజా గొంతులో తీవ్రతకి ఉలిక్కి పడ్డా.

"అబ్బే అదికాదు ఆయన ఇప్పుడు కామెడీలు వదిలేసి చాలా సీరియస్ సినిమాలు చేస్తున్నారు కదా !"

"అయితే..."

ఇదేదో... సీరియస్ చర్చకు దారి తీసేట్టుగా వుంది. సుజకు నచ్చినట్లుగా వుండటం మేలు, ఆమెను సంతోషంగా ఉంచితే చాలు, నాకు సంతోషం వస్తుంది...

ఒరేయ్... పిచ్చి విశాల్ నీ పని అయిపోయిందిరా... ప్రేమలో పడ్డాక...ఇంక నీ ఇష్టాలు నడవవు... నన్ను నేను హెచ్చరించుకుని... "ఓకే... ఓకే వచ్చేస్తా... టికెట్ తీయమని నా ఫ్రెండ్ కి చెబుతాను..." అన్నా.

"మనం సినిమాకి వెళుతుంటే ఇంకొకరు టికెట్ తీయడమేంటి...? నేను తీసుకుని అక్కడుంటా సినిమా మొదలయ్యే లోపల వచ్చేయండి..."

"అదేంటి నువ్వు... ముందే వెళ్లి టికెట్ తీసుకుంటావా?"

"మరి... ఎవెరెస్ట్ ఎక్కుతావా అన్నట్లుంది... నేను వెళ్లి తీసుకుంటానులే, జాగ్రత్తగా త్వరగా వచ్చేయ్ విశాల్..."

ఏమీ చెప్పలేకపోయాను... తనేమి ఖర్చుపెట్టనీయదు, మామూలుగా అమ్మాయిలు పర్సుతీయరని వాళ్లకు వెంట వుండే మగవాళ్ళు పెట్టడం సంప్రదాయం అని నాకు ముందు పుట్టినోళ్ళు చెప్పారు... తీరా చూస్తే ఇక్కడది వర్కవుట్ కావడం లేదు... అంతా సీనియర్లు చెప్పినట్లు జరగడం లేదు. ఇప్పుడు సరయిన టైం కు పోయి చాలా పంక్చువల్ అని పేరు తెచ్చుకోవాలి, సుజా టైం కు చాలా విలువనిస్తుంది. సినిమా 6.15 కు మొదలవుతుంది... ఇప్పుడు 5 .05 అవుతుంది... అంటే 45 మైళ్ళు గంటలో వెళ్ళాలి... రోడ్డు బాగాలేదే... ఒకే నో ప్రాబ్లెం నడిపేది ఎవరు... విశాల్! అనుకున్నా.

ఒక్క నిముషంలో హాంగర్ కున్న జాకెట్ వేసుకుని... కార్ కీస్ తీసుకుని... "అమ్మమ్మా... నే వెళుతున్నా... " సమాధానం కోసం చూడకుండా కారు స్టార్ట్ చేశా... నా కళ్ళముందు అప్సర థియేటర్... ఆ థియేటర్ ప్రాంగణం లో నా అప్సరస సుజా... మాత్రమే వుంది... పరుగున వచ్చిన అమ్మమ్మ" అదేంటిరా అప్పుడేనా!.." అన్న మాటలు కూడా నా తలకెక్కలేదు . చేయివూపి ఆక్సిలరేటర్ పై నా కాలు ఎంత బలంగా నొక్కానో... రైల్వే గేటు పడక ముందే పోవాలి... లేకపోతే లేట్ అవుతుంది... నా వేగాన్ని... నా కారు వేగాన్ని అందుకోలేనంత అధ్వానంగా వున్న రోడ్డుపై విపరీతమైన కోపం వచ్చింది రోడ్డు గురించి పట్టించుకోని ఆ వూరి ప్రెసిడెంట్ మామయ్య మీద ఆవేశ మొచ్చింది... హు... గేటు పడింది బాబోయ్... టైం చూసుకున్నా... 5.20. వూ వీడెప్పుడుగేటు తీస్తాడో ! సుజా కి కాల్ చేద్దాం అనిపించింది... చేశా...

"చెప్పు"

"వూరికే చేశా... బయలు దేరా, గేట్ పడింది."

"వూరికే చేయడం లేదు ..ప్రతినిముషానికి చెల్లిస్తున్నావు..ని ప్రతిమాట ఖరీదైంది... తొందరేమీ లేదు జాగ్రత్తగా రా"

"లవ్ యూ "

"వూ సరే..." నవ్వు తెరలమధ్య సుజా కొంటె గా కొంచం, పిచ్చోడా అన్నట్లుగా కొంచం భావాన్ని కలిపి అన్నది... కానీ ఆమాట తననుంచి రావడం బాగా అన్పించింది....యాహూ అని మనసులోనే ఎగిరి గంతేశా.

"ఇంక ఫోన్ చేయకు డ్రైవ్ లో, నేను బయలు దేరుతున్నా..."

"అప్పుడేనా ఇంకా 5.30 నే కదా టికెట్లు నేను వచ్చాక అయినా తీసుకోవచ్చు.

నేను వచ్చి తీసి కెళతాగా... నిన్ను..."

"అబ్బ వద్దులే విశాల్ దగ్గరేగా... నడిచి వెళతా..." ఏదో చెప్పబోయి గేట్ తీయడంతో సుజాకి బాయ్ చెప్పి వేగంగా బయలు దేరా...

"ఏ శ్యాం మస్తాని... మద్ హోష్ కియే జాయే

ముఝే దోర్ కోయీ ఖించే, తేరీ ఓర్ లిఏ జాయే

దూర్ రహతీ హైన్ తూ, మేరె పాస్ ఆతీ నహీ

హోఠ్వోన్ పే తేరే, కభీ ప్యాస్ ఆతీ నహీ

అయేసా లగే జైసి కే తూ, హస్ కే జహ కోయీ పియె జాయే..." కిషోర్ తో పాటుగా పాడుకుంటూ హుషారుగా కారులో షికారు చేస్తున్న నాకు రోడ్డుకు అడ్డంగా ఒక ముసలాయన నిలబడి కారు ఆపమన్నట్టు సైగ చేస్తూ చేతులు చాచాడు. నిర్మానుష్యంగా వున్న ప్రదేశం కావడం వలన ఏ వాహనాలు కూడా రోడ్డుపై లేనందు వలన నేను ఆఘమేఘాలపై వెళ్ళేవాడిని కాస్త చిరాగ్గా... కారు ఆపాను... గ్లాసు తీసి ఏమిటి అన్నట్టు చూసాను. ప్రక్కనే నిలబడ్డ ఓ అమ్మాయి నిండు నెలలతో వుంది. ఆ అమ్మాయిని చూపిస్తూ "నాయనా మా పాపకు నెలలు నిండాయి... కడుపులో నొప్పిగా ఉందంట... కానుపు నొప్పులో ఏమో... నువ్వు గాని మమ్మల్ని ధర్మాసుపత్రిలో దింపుతే మేలు నాయనా!" అతనికి కనీసం అభ్యర్థించడం కూడా రాలేదు, ఒక్క నిముషం నా హృదయం ద్రవించింది... టైం చూశా 5.45 దాటింది... వీళ్ళను హాస్పిటల్ దగ్గర దింపి వెళ్ళేప్పటికి ఏడవుతుంది...సుజా ముద్దు మోములో నా ఆలస్యానికి కనిపించే చిరాకు ఊహించా ! తక్షణమే ఎవ్విరితింగ్ ఇస్ ఫెయిర్ ఇన్ లవ్ అనుకుని" లేదు తాతా నేను కడప పోవడం లేదు... పాయసం పల్లె పోతున్నా" అన్నా.

"సరే నాయనా నువ్వు పో... మేము గవర్నమెంటు ఆస్పత్రికి పోవాలగానీ... ఇబ్బంది పెట్టినాను, బస్ వస్తే దాంట్లో పోతాం గానీ" అని అటుపక్క తిరిగి ఆ అమ్మాయిని రోడ్డు పైనుండి చెట్టు కిందికి తీసికెళ్ళాడు. ఊపిరి పీల్చుకుని... ఒక్క సారి టైం చూశా 5.50. ఇంకా 25 నిముషాల్లో... కడప చేరాలి... అప్సర దగ్గరకి వెళ్ళే టప్పటికి... ఎందుకో చిరాకు తో పాటు ఏదో అసంతృప్తి... ఏదో తెలియని... భావాలు... మూడ్ ని మామూలు చేసుకోవడానికి తగ్గించిన వాల్యూం ని ఎక్కించా... జిందగీ ఏక సఫర్ హాయ్ సుహాన యహ కల్ క్యా హోగా కిసనే జానా! కిషోర్ ఉత్సాహంగా పాడుతున్నాడు... కానీ మనసు ఏదో కోల్పోయింది. యాంత్రికంగానే అప్సర చేరా... దూరం నుండే నా కార్ చూడ గానే నవ్వుతూ సుజా చేయి ఊపింది... సుజా నవ్వు చూడగానే నా మనసు తేలికైంది. గులాబి రంగు చీరలో ముద్దుగా వుంది సుజా, ఇద్దరం లోపలికి వెళ్లాం.

కూర్చున్నాక అడిగింది "లేట్ అయింది... కదా... స్టార్ట్ అవుతుందేమో అనుకున్నా... నాకు సినిమా అంటే కర్టన్ రైసింగ్ నుండి చూస్తేనే తృప్తి..."

గేట్ పడ్డం వరకు చెప్పి."ఒక ముసలాయన..." అనేంతలోనే... తెర లేవడం తో... సుజ అటుకేసి చూస్తోంది... నా మనసులో ఏదో... తప్పు చేసిన భావన... ఆ ముసలాయనకు అబద్ధం చెప్పి... ఆ నిండు చూలాల్ని... ఆ పరిస్థితిలో వదిలి ఛ. ఛ... నాకేమయ్యింది... సుజ ను కలవడానికి అర్ధగంట లేట్ అయితే నష్టమేముంది... ఆమెను ఇంప్రెస్స్ చేసేదానికి నేను మనిషిని అన్న విషయం మర్చిపోయా, వాళ్లకు బస్సు దొరికిందో లేదో... ఆ అమ్మాయికి ఏమైనా అయితే, పాపం ఆ ముసలాయన... ఏమి చేయగలడు...? తల విదిలించి సుజను చూశా... తను ఏదో ఇంగ్లీష్ ట్రయలర్ చూస్తోంది...

"సుజా..." మెల్లిగా పిలిచా

"ఏంటి... లవ్ యు చెబుతావా ! "

"వూ... లవ్ యూ..."అన్నా

"నేను మాత్రం చెప్పను విశాల్... కానీ ప్రేమిస్తూ ఉంటా" నా చెవి దగ్గర గుస గుసగా అంది

నా మనసు కొంచెం లయ తప్పింది... సుజ నున్నటి బుగ్గల మెరుపు నన్ను కాసేపు మత్తులోకి తోసింది... మరు నిముషంలోనే నాలోని మరొక విశాల్ లేచాడు.

"సుజా నేను బయటికి వెళ్లి వస్తా, ఒక గంట... అంతే సినిమా చూస్తూ వుండు..."

తన సమాధానం కోసం కూడా చూడకుండా... లేచి బయటికి వచ్చా.

కారు పార్కింగ్ నుండి కార్ తీస్తుండగా ప్రక్కనే సుజ.

"ఏమయ్యింది విశాల్... అలా వచ్చావేమి? ఎనితింగ్ రాంగ్?"

"ఇప్పుడే వస్తా, వెళ్లి సినిమా చూడు... లేకుంటే కార్లో కూర్చో నేను వెళ్ళాలి "కొంచం చిరాగ్గానే అన్నా.

మౌనంగా వచ్చి కార్లో కూర్చుంది సుజా.

ఎంత వేగంగా కారు నడిపానో నాకే తెలియదు ఏదో అడగబోయిన సుజా... మళ్ళీ విరమించుకుంది... నా మనసంతా... విపరీతమైన అలజడితో నిండి పోయింది.

ఆ అమ్మాయికి ఏమైనా అయ్యుంటే... ఛి ఛి నేను మనిషినా... నా స్వీట్ హార్ట్ సమక్షం నన్ను కొంచం కూడా ఉత్సాహపరచలేదు.

దూరం నుండే నన్ను ముసలాయన ఆపిన ప్రదేశం వెతుక్కుంటూ వచ్చాను 5.50 కి వాళ్ళిక్కడున్నారు... ఇప్పుడు 6 .30 అయింది, ఉంటారో లేదో! ఏదైనా కారో, బస్సో వచ్చి వెళ్లి పోయారో ..! దూరంగా వున్న ముసలాయన్ని... ఆ అమ్మాయిని చూసి నా మనసు సంతోషంతో ఉరకలు వేసింది.

కారు ఆపి ఇద్దరినీ ఎక్కమన్నా. "ఏమి నాయన పాయసం పల్లె పోతివా... బస్సు వచ్చింది గాని, శానా మంది వుండ్రి... కడుపుతో వున్న బిడ్డను ఎక్కిస్తే కష్టమని ఎక్కకపోతిమి నాయనా... ఎవరో పుణ్యాత్ములు రాక పోతారా అని చూస్తా వుండా! నీవే వస్తివి... భయంగా వుండే, పాపకి నొప్పులు మొదలాయే..." వార్ధక్యం తోను, పేదరికంతోను, బాధ్యతల బరువు తోను వంగిపోయిన అతన్ని... అతని వయసుని, అతనున్న పరిస్థితిని, గమనించ కుండా వెళ్లి పోయానే... హమ్మయ్య దిద్దుకునే అవకాశం ఇచ్చినతనికి నాలో నేనే కృతజ్ఞతలు చెప్పుకున్నా... లేకపోతే... ఈగిల్ట్ నన్ను ఎంత బాధించేదో...!

"శశికాంత్... రిమ్స్ లో     గైనిక్ లో మనకు తెలిసిన వాళ్ళెవరున్నారు ?" ప్రొద్దుటూరు జి జి హెచ్ లో పని చేసే ఫ్రెండ్ ని అడిగా

తన క్లాస్ మేట్ వనజ వుందని చెప్పడంతో పని సులభమయింది. అమ్మాయిని అక్కడ అడ్మిట్ చేసి ముసలాయన చేతిలో ఒక వెయ్యి పెట్టి... డాక్టర్ వనజ కు విషయం చెప్పి బయటకు వచ్చాం... అంతవరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు సుజా.

బహుశ తను చూడాలనుకున్న సినిమాని చూపలేకపోయినందుకు, చేసే పని సరయిన పద్ధతిలో చేయనందుకు పెద్ద క్లాస్ తీసుకుంటుంది అనుకున్నా... కారు ఎక్కగానే సుజా ఏమన్నా ఇప్పుడు హాయిగా భరించే దానికి సిద్ధంగా ఉన్నా.

సమయం7.50 అయింది సగం సినిమా అయిపోయి వుంటుంది. సుజా కేసి చూశా... నాకళ్ళలోకి చూస్తోంది... ఏదో చెప్పబోతుంటే సిద్ధంగా ఉన్నా... కాని తను మాట్లాడలేదు "సారీ...సినిమా మిస్ అయింది కదా నా కారణంగా...అమ్ రియల్లి సారీ... సుజా... ఏదైనా చెప్పు... మాట్లాడు... కొప్పడు... కాని మౌనం వద్దు.ప్లీజ్..!"

"లవ్ యు"

"వాట్!" ఎగిరి పడ్డా.

"లవ్ యు"

"యాహూ... నిజంగా... నిజంగానేనా !"

"లవ్ యు"

"కోపం రాలేదా నాపై సినిమా మిస్ అయినందుకు"

"లవ్ యు."

"కొన్ని పదాల్ని పొదుపుగా వాడితే మంచి దేమో!" తన మాటలు తనకి అప్ప చెప్పా!

"లవ్ యు' అంది మళ్ళీ. సంతోషంగా నవ్వుతున్న నన్ను చూసి "నీ మంచి మనసుకు నీరాజనాలు విశాల్ లవ్ యు ఏ

లాట్"అంది. సుజా అలా అంటుంటే ఎంతో హాయిగా అన్పించింది. ప్రేమించటం ఒక వరం, ప్రేమించబడటం ఒక యోగం , మానవాళిని ప్రేమించలేకపోవడం ఒక రోగం అనిపించింది.




రాత్రి పది దాటింది. జోరున వర్షం కురుస్తుంది. రోడ్లన్నీ నదులుగా మారుతున్నాయి. పెట్రోలింగ్ వ్యానొకటి రోడ్లపై వున్న నీటిని చిమ్ముకుంటూ "చికెన్ బిరియాని" హోటల్ ముందు ఆగింది. హోటల్ ముందు ఒక కుక్క తన తోకని రెండు కాళ్ళ మధ్యలోకి తోసి చలిని అడ్డుకునే ప్రయత్నం చేస్తు... పొడిగా వున్న ప్రదేశాన్ని వెతుక్కుంటుంది. విసురుగా ఆగిన వ్యాన్ శబ్దానికి కుక్క కంగారుగా ప్రక్కకి వెళ్ళింది.

ఒకరిద్దరు కస్టమర్లు మినహా హోటల్ ఖాళీగానే వుంది. పెట్రోలింగ్ వ్యానులోంచి బొజ్జ పెరిగిన కానిస్టేబుల్ దిగాడు. హోటల్ లో వున్న

పదిహేనేళ్ళ కుర్రాడు "ఏమిటి స్సార్ పార్శిలా, తింటారా" అడిగాడు. "రెండు బిర్యాని" పార్శిల్ చెప్పి కుక్క పక్కన నిలబడ్డాడు కానిస్టేబుల్ జేబులో నుండి సిగరెట్ తీసి.

"ఐదు నిమిషాలు సార్... కూర్చోండి" కుర్చీ చూపించాడు కుర్రాడు. 'అక్కర్లేదు' నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి గాల్లోకి గుప్పు గుప్పున పొగ వదల సాగాడు కానిస్టేబుల్. వాన పెద్దదవసాగింది.

వేడి వేడి పార్శిల్స్ కానిస్టేబుల్ చేతికిచ్చాడు. పార్శిల్స్ తీసుకుని "సార్ కి రెండు థమ్సప్ ఇవ్వు" అన్నాడు కానిస్టేబుల్. వ్యాన్ లో కూర్చుని ఉన్న ఎస్సై కానిస్టేబుల్ ప్రభు భక్తికి తన పెదవులని చెవుల దాకా సాగతీసి నవ్వాడు. "థమ్సప్, బిర్యాని, పార్సిల్స్" తీసుకుని వెళుతున్న కానిస్టేబుల్ ను "సార్... డబ్బులు" అన్నాడు హోటల్ కుర్రాడు.

సిగరెట్ ని కిందపడేసి బూటు కాలితో నలిపేస్తూ "ఏరా... కొత్తా మీ అన్న లేడా... వాడికి తెల్సు మేము డబ్బులు ఇవ్వాలో వద్దో" అని గీరగా సమాధానం చెప్పి ముందుకు వెళ్ళాడు.

"అన్నకి లెక్క చెప్పాలస్సార్" రెట్టించాడు కుర్రాడు. బిర్యాని పార్శిల్స్ వ్యానులో పెట్టి వెనక్కి వచ్చాడు కానిస్టేబుల్. "ఏరా ఇప్పుడు టైం ఎంతయ్యింది. ఎన్ని గంటలకి హోటల్ మూసెయ్యాలి. బోడి మూడొందల కోసం కక్కుర్తి పడితే... స్టేషన్ చుట్టూ తిరగలేక మానసికంగా, ఆర్థికంగా దెబ్బ తింటావ్..." అంటూ బండ బూతులు తిట్టాడు కానిస్టేబుల్. "అది కాదస్సార్" అంటూ ఏదో చెప్పబోయాడు హోటల్ కుర్రాడు. "ఏరా... నీ... చెప్పితే అర్థం కాదా" అని కాలుతో కుర్రాడిని ఒక తన్ను తన్నాడు కానిస్టేబుల్.

పడుకోవడానికి పొడి ప్రదేశం వెతుక్కుంటున్న కుక్క ఈ గందర గోళానికి 'కుయ్య్' మంటూ ప్రక్కకు వెళ్ళింది. కానిస్టేబుల్ తన్నిన తన్నుకి హోటల్ కుర్రాడు మెలికలు తిరిగి పోసాగాడు.

కానిస్టేబుల్ కాలు ఎత్తి మళ్ళీ తన్నబోయాడు. ఇంతలో హోటల్ యజమాని రవి వచ్చి "సార్... సార్..." అంటూ ఆపాడు. రవిని చూడగానే కానిస్టేబుల్ "రవీ... ఎవడ్రా వీడు నన్నే డబ్బులు అడుగుతున్నాడు" అన్నాడు పైకెత్తిన కాలు దించి.

"మా వూరోడే సార్... తెలిదు... కొత్త కుర్రాడు. పైగా మీ లాంటోళ్ళు ఇంకా కొత్త..." అంటూ బాధతో మెలికలు తిరిగిపోతున్న కుర్రాడిని పైకి లేపాడు రవి.

"నువ్వు ఎక్కడికి వెళ్ళావ్" ముక్కు ఎగబీలుస్తూ అడిగాడు కానిస్టేబుల్.

"ప్రక్క సందులో పార్టీ వుంటే బిర్యాని పార్శిల్స్ ఇచ్చి వస్తున్నాను సార్" అన్నాడు రవి. "సరే నే వెళుతున్నా" అంటూ కానిస్టేబుల్ వ్యాను ఎక్కబోతూ వెనక్కి వచ్చి కుర్రాడి వైపు వేలు చూపిస్తూ "బిడ్డా... నరికేస్తా..." "జాగ్రత్తగా వుండు" అంటూ వ్యాను వైపుకు వెళ్ళబోయాడు.

ఇందాకట్నుంచి దూరం నుంచి ఈ తతంగాన్ని గమనిస్తున్న కుక్క "భౌ" మంటూ పెద్దపులిలా కానిస్టేబుల్ మీదకు దూసుకు వచ్చింది. పళ్ళు బయటకు పెట్టి భయంకరంగా మొరగసాగింది.

దాన్ని చూసి కానిస్టేబుల్ వికారంగా మొఖం పెట్టి గుట్కా పాకెట్ చింపి నోట్లో పోసుకుని "థూ... నీయమ్మా... మమ్మల్ని చూసి కాదే అరవాలి... దొంగల్ని చూసి అరవాలే... నీకు దొంగలెవరో... పోలీసోళ్ళు ఎవరో తెల్వనట్టుంది" అంటూ వ్యానెక్కాడు. లోపల కానిస్టేబుల్ వీరంగాన్ని చిద్విలాసంగా తిలకిస్తున్న ఎస్సై ఇప్పుడు వాడు చేసిన కామెడికి పెదవుల్ని చెవుల దాకా సాగదీసి మళ్ళీ నవ్వాడు. వ్యాను బయలుదేరింది. కుక్క అరుస్తూనే వుంది. కుక్కకు తెలుసు ఎవరిని చూసి అరవాలనే విషయం.




"నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ" అనే మధురమైన గానం వినిపించడంతో నాకు మెలకువ వచ్చింది. లేచి చూస్తే ఎవరూ లేరు. నేనింకా ఆ జ్ఞాపకాలలోంచి బయటపడలేదని రోజూ నన్ను నిద్రలేపే ఈ పాట గుర్తుచేస్తోంది. అవును మన జీవితంలో ముఖ్య పాత్ర పోషించిన వాళ్ళని ఎలా మరచిపోతాము. నా ఈ జీవితమే ఆ తల్లి దయ. ఆవిడే శాంతమ్మ.

శాంతమ్మ.... శాంతమ్మ..... నా ఈ జీవితం ఆవిడ కృపే. ఏ జన్మ రుణానుబంధమో ఇది.

**** **** **** ****

"మా మాట వినకుండా ఇలాంటి సమయం లో నువ్వు దూరంగా వెళుతున్నావు. అయినా నిన్ను బాధపెట్టడం ఇష్టం లేక ఒప్పుకున్నాము. అక్కడ జాగ్రత్తగా ఉండు. వేళకి భోజనం చెయ్యి. వేళకి నిద్రపో" అని మా అమ్మ ఇప్పటికే ఒక వెయ్యి సార్లు

చెప్పుంటుంది.

ఇప్పటివరకూ నేను మా ఊరు దాటి ఎక్కడికీ వెళ్లి ఉండలేదు. ఉద్యోగ రీత్యా వెళ్ళవలసి వస్తోంది. ఈ ఊరు, అమ్మా, నాన్నా వీటన్నిటికీ దూరం గా వెళ్ళవలసి వస్తోంది.

"అలాగే నమ్మా, నువ్వూ నాన్నా జాగ్రత్త. మీరు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి" అని చెప్పి బయలుదేరాను.

నాన్న నన్ను దిగపెట్టడానికి రైల్వే స్టేషన్ వరకు వచ్చి "అంకుల్ వాళ్ళకి చెప్పాను నీకు ఇల్లు ఏర్పాటు చేస్తారు. నువ్వు వెళ్ళగానే వాళ్ళ అబ్బాయి వచ్చి నిన్ను పిక్ అప్ చేసుకుంటాడు. ఏమైనా అవసరం అయితే మొహమాటపడకుండా అంకుల్ వాళ్ళని అడుగు. జాగ్రత్త" అని చెప్పి రైలు బయలుదేరినా నాకోసం అక్కడే ఉన్నారు. కనుచూపుమేర వరకు మేమిద్దరం ఒకరికొకరం చేతులు ఊపుతూనే ఉన్నాము.

మొదటసారి ఇలా నేను ఒంటరిగా వేరే ప్రదేశానికి వెళ్ళడం కొంత థ్రిల్లింగ్గా కొంత భయంగా ఉంది. అక్కడి వాతావరణం అలవాటు అవుతుందో లేదో. అక్కడ మనుషుల మనస్తత్వాలు ఎలాంటివో. ఇలా ఆలోచనలతో నా మెదడు నిండిపోయింది.

నేను ఉద్యోగ రీత్యా మా ఊరు నుండి ఇక్కడికి వచ్చాను. మా ఊర్లోని పచ్చటి చెట్లు, పక్షుల కిలకిలారావాలు, పల్లెటూరి ఆడపడుచుల సందడులు ఇక్కడ ఉండకపోయినా తప్పదు కాబట్టి ఇక్కడే కొన్నాళ్ళు ఉండాలని డిసైడ్ అయ్యాను.

ఆ సిటీ కి చేరగానే మా అంకుల్ వాళ్ళ అబ్బాయి వచ్చి నన్ను పిక్ అప్ చేసుకుని ముందుగా వాళ్ళింటికి తీసుకువెళ్ళాడు.

అంటీ నాకోసం టిఫిన్ రెడీ చేస్తోంది. నేను వాళ్ళని పలకరించి ఫ్రెష్ అప్ అయి వచ్చాను.

"అయ్యో అంటీ మీకెందుకండీ శ్రమ"

"శ్రమ ఏమిటయ్యా. నువ్వూ మా అబ్బాయిలాంటివాడివే మొహమాటపడకుండా తిను" అని కొసరి కొసరి వడ్డించారు.

అంకుల్ కూడా సరదా మనిషి వాళ్లతోటే ఉండమని కూడా అడిగారు. కానీ నాకు వాళ్ళని ఇబ్బంది పెట్టాలని అనిపించలేదు. వాళ్ళకే ఈ సిటీ నుండి కొన్ని కిలోమీటర్ల దూరం లో అందమైన ఇల్లు ఉంది. నేను అందులో ఉండబోతున్నాను.

టిఫిన్ చేసాక అంకుల్ నన్ను వాళ్ళ కారులో ఈ ఇంటికి తీసుకువచ్చారు. ఇల్లు అద్భుతంగా ఉంది. ఎలా అయితే నేను ఊహించానో అంతకి ఎన్నో రెట్లు అందంగా ఉంది. వీళ్ళు సిటీ లో ఉండాలని ఎంత అందమైన ఇంటికి దూరం గా ఉంటున్నారు అని వాళ్ళని చూస్తే కొంత జాలి వేసింది.

కాసేపయ్యాక అంకుల్ వెళ్ళిపోయారు. ఆ ఇంటి అందాన్ని, చుట్టూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ నిద్రపోయాను.

****      ****      ****      ****

ఉదయమంతా కృత్రిమ నవ్వులతో ఉండే ఆఫీసు వాతావరణం లోంచి కొంచెం ఉపశమనం లభించేది ఇంటికి చేరుకున్నప్పుడే కదా. అందుకని అందరిలాగా ఏదో ఒక హాస్టల్ లో ఉండకుండా నాకంటూ ఒక ప్రశాంతమైన ఇల్లు ఉంటే మంచిదని ఎంతో జాగ్రత్తగా ఏరి కోరి ఇక్కడకు వచ్చాను.

మా ఆఫీసుకి చాలా దూరంగా ఉన్నా సహజంగా ప్రకృతి ప్రేమికుడిని కాబట్టి దూరంగా పట్టుమని పది ఇల్లు కూడా లేని ప్రాంతంలో ఈ ఇంటిని అద్దెకి తీసుకున్నాను. నాన్నగారికి తెలిసిన వారు కావడం వల్ల అద్దె కూడా ఎక్కువ అడగలేదు. అసలేం ఇవ్వద్దని అన్నారు. కానీ ఉరికే నాకు ఆ ఇంట్లో ఉండాలనిపించలేదు. అందుకే నేను అద్దె తీసుకుంటేనే ఈ ఇంట్లో దిగుతానని చెప్పడంతో మొహమాటానికి ఒప్పుకున్నారు. వాళ్ళు ఈ సిటీలోనే ఉంటారు. నా ప్రైవసీ ని గౌరవిస్తూ నేను ఫోన్ చేసి మాట్లాడినప్పుడే మాట్లాడతారు. నేను ఫ్రీగా ఉన్నానా అని అడిగి వాళ్ళ ఇంటికి రమ్మంటారు. అప్పుడప్పుడు వెళుతూ ఉంటాను.

ఈ ఊర్లో ఉన్న మా ఫ్రెండ్ తన బైక్ ని అమ్ముతున్నాడని తెలుసుకుని నాకు ఎలాగో ఉపయోగపడుతుంది కదా అని తీసుకున్నాను. జీవించే ప్రతి క్షణం ఆనందంగా ఉండాలి. ఎందుకంటే జీవితం చాలా చిన్నది. ఎప్పుడో సంతోషంగా ఉందాం ఇప్పుడు డబ్బులు దాచుకుని అనుకునే మనస్తత్వం కాదు నాది. అందుకే నాకు నచ్చిన ప్రదేశంలో ప్రకృతి ఒడిలో సేద దీరెందుకు ఒక చక్కటి ఇంటిలో అద్దెకుంటున్నాను.

నగర జీవనంలో ఉన్న గజిబిజి గందరగోళం, కలుషిత ప్రాంతాలకి దూరంగా హాయిగా అనిపించింది ఈ ప్రాంతం. చుట్టూ మావిడికాయ, సపోటా, బొప్పాయ, జామ చెట్లు. దారిపొడుగునా పూల చెట్లు రోజా పలకరిస్తాయి. మా ఊర్లోని మా ఇల్లు తరువాత నాకు నచ్చిన ప్రాంతంగా ఈ ఇల్లు మారిపోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

ఇంటి ముందు పెద్ద వాకిలి. వాకిలిలో ఒక వరసగా చక్కటి డిజైన్ లో ఏర్పాటు చేసిన పూల మొక్కలు. చిన్న సైజు గార్డెన్ లా ఉంటుంది మా వాకిలి. ఆ మొక్కల మధ్య ముచ్చట గొలిపే శ్రీ కృష్ణుడి బుల్లి విగ్రహం. నాకు చాలా ఇష్టమైన ప్రదేశాలలో ఈ వాకిలి ఒకటి. హాయిగా చల్లటి సాయంత్రం వేళ ఈ వాకిటిలో రేడియోలోని అచ్చ తెలుగు పాటలు వింటూ మైమరచిపోవడం అంటే నాకు ఇష్టం.

మా నాన్నగారి స్నేహితుడు ఇంటిపని కోసం ఒక పనిమనిషిని ఏర్పాటు చేసారు. ఆవిడకి ఎభయి అయిదేళ్ళు ఉంటాయి. ఆవిడే శాంతమ్మ. తన స్వంత కొడుకులా చూసుకుంటుంది. వంట కూడా చేసిపెడుతుంది. ప్రతి రోజు ఉదయాన్నే ఆరుగంటల కల్లా ఇంటికొచ్చి పనులన్నీ చేసిపెట్టి వంట చేసి నాకోసం కాఫీ చేసిపెడుతుంది శాంతమ్మ. చాలా కొద్ది రోజులలోనే ఆవిడంటే అభిమానం, గౌరవం ఏర్పడ్డాయి.

ఆవిడ స్వంత విషయాలు ఎప్పుడూ నేను అడగలేదు. ఆవిడ కూడా చెప్పలేదు. హాయిగా పాటలు పాడుతూ పనులు చేస్తుంది. ఆదివారం కూడా వచ్చి పనులు చేసి వెళ్తుంది. ఆదివారం నేను ఇంట్లోనే ఉంటాను కదా సెలవు తీసుకో శాంతమ్మ అంటే "పరవేలేదయ్యా, మా అబ్బాయి అయితే నేను చేసిపెట్టనా" అని నవ్వేసేది. ఆవిడ నవ్వులోని ప్రశాంతత కోట్లు సంపాదిస్తున్న వాళ్ళకి కూడా రాదు. అంతటి స్వచ్ఛమైన నవ్వు ఆవిడది.

ఈ ఊర్లో నాకు కొత్తగా స్నేహితులు కూడా ఏర్పడ్డారు. వాళ్ళు కూడా బ్యాచెలర్స్. హాస్టల్ లో ఉంటారు. హాస్టల్ లో డ్రింక్స్ అనుమతించరని నా ఇంటికి వచ్చి వీకెండ్ లో ఫుల్ గా ఎంజాయ్ చేస్తామని చేరినప్పటి నుండి గోల పెడుతున్నారు.

నాన్న గారి క్రమశిక్షణ నాకు బాగా అలవరడం, ఇంకా భగవంతుని దయ వలన నాకు తాగుడు అలవాటు లేదు. తాగుడు వంటి కార్యక్రమాలు ఇక్కడ చెల్లవు అని నిర్మొహమాటంగా చెప్పేసాను. నాకు నచ్చని విషయాలు సూటిగా చెప్పే మనస్తత్వం నాది. అందువల్ల నాకు ఎక్కువ మంది స్నేహితులు లేరు. నన్ను అర్ధం చేసుకునే అతి కొద్ది మంది స్నేహితులు మాత్రమే కలరు. వారి సంఖ్యని వేళ్ళతో లెక్కపెట్టవచ్చు. అందరికీ బోలెడు మంది స్నేహితులు ఉంటారు. ఎలా సాధ్యం అని నాకు అప్పుడప్పుడు సందేహం వస్తుంది.

నాతో ఎల్లప్పుడూ ఉండే నా స్నేహితులు నేను అమూల్యంగా సేకరించుకున్న పుస్తకాలు. నాకు లాలి పాడే అన్నమయ్య కీర్తనల పుస్తకాలు. నాకు ఏదైనా బాధ కలిగినా ఓదార్చి నాకు తిరిగి ప్రేరణ కలిగించే Motivational బుక్స్. నాలోని రచయితను నిద్రలేపే నా డైరీ. సరదాగా ఉండే నవలలు. ఇవే ప్రస్తుతానికి నా లోకం. ఊర్లో ఉన్న అమ్మమీద, నాన్నమీద బెంగని త్వరగా నయం చేసిన ఇవే నా స్నేహితులు.

అలా కొద్ది రోజులలోనే నా జీవితంలో ముఖ్య పాత్రలుగా ఈ ఇల్లు, కొత్తగా చేరిన ఆఫీసు, నా నేస్తాలైన పుస్తకాలు ఇంకా శాంతమ్మ ప్రవేశించారు.

అలా రోజులు ప్రశాంతం గా గడిచిపోతున్నాయి. ఆ మర్నాడు క్లైంట్ విసిట్ ఉందని త్వరగా ఆఫీసు కి రావాలని మా మేనేజర్ ఫోన్ లో మెసేజ్ పెట్టాడు.

త్వరగా లేచి వెళ్ళబోతున్న సమయం లో శాంతమ్మ వచ్చింది. శాంతమ్మ కి జ్వరం వచ్చి రెండు రోజులు ఇంటికి రాకపోవడం చేత ఇంట్లో అంట్లు అలాగే వాసన వేస్తున్నాయి.

"శాంతమ్మ, నువ్వు అంట్లు తోమేసి వెళ్ళు. మళ్ళీ సాయంత్రం రా" అని తాళం చెవులు ఇచ్చాను. అప్పుడప్పుడు నేను ఆఫీసుకి త్వరగా వెళ్ళాల్సినప్పుడు తాళం చెవులు శాంతమ్మకి ఇవ్వడం నాకు అలవాటే.

ఆఫీసు పని ముగించుకుని ఇంటికి బయలుదేరేటప్పుడు నాకు సడెన్ గా గుర్తొచ్చింది. ఈ ఊర్లో నేను తీసుకోబోతున్న స్థలం రిజిస్ట్రేషన్ కోసం కొంత డబ్బులు డ్రా చేసి ఇంట్లోనే కప్ బోర్డులోఉంచిన సంగతి. ఆ సంగతే మరచిపోయాను. ఇంట్లో ఏమీ విలువైనవి లేనప్పుడు తాళాలు ఇవ్వడం వేరు. ఇప్పుడు వేరు. మనుషుల ప్రవర్తన మన ముందు ఉన్నట్లే ఎప్పుడూ ఉంటుందనుకోవడం మంచిది కాదు అనుకుంటూ హడావిడిగా ఇంటికి బయలుదేరాను.

ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. అవసరం అనుకున్నప్పుడే అన్నీ ఇబ్బంది పెడతాయి అనుకుంటూ ట్రాఫిక్ క్లియర్ అవగానే వేగంగా బయలుదేరాను.

****          ****        ****          ****

కళ్ళు తెరవడం చాలా కష్టంగా ఉంది. అతి కష్టం మీద కళ్ళు తెరిచాను.

హాస్పిటల్ బెడ్ పైన ఉన్నాను. నా చుట్టూ ఏడుస్తూ అమ్మా నాన్నా.

"ఎందుకురా అంత హడావిడి. కొంచెం మెల్లగా రావచ్చు కదరా" అని అమ్మ ఏడుపు గొంతు.

"డబ్బు, డబ్బు" అని అతి కష్టం మీద మాట్లాడగలుగుతున్నాను

"ఏమైందిరా ఎలా అయిపోయావో చూడు. అదృష్టం బాగుండి హెల్మెట్ వేసుకున్నావు కాబట్టి చిన్న చిన్న దెబ్బలతో సరిపోయింది" అని నాన్నగారు మాట్లాడుతున్నా వినిపించుకోకుండా

"డబ్బు, అమ్మ డబ్బు ఏమైంది" అని అడుగుతూనే ఉన్నాను

"డబ్బా, ఏ డబ్బు" అని నాన్న గారు అడిగారు

"ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు ఇంట్లో పెట్టాను"

"ఇంట్లో పెడితే ఇంట్లోనే ఉంటాయి" అని ఏమాత్రం కంగారు లేకుండా ఉంది అమ్మ జవాబు

"అది కాదు నాన్నా, ఆ రోజు ఆఫీసు హడావిడిలో డబ్బులు ఇంట్లో ఉన్న సంగతి మరచిపోయి తాళాలు శాంతమ్మకి ఇచ్చాను"

"ఎంత డబ్బు" నాన్నగారి ప్రశ్న

"మూడు లక్షలు"

"అవునా, నిన్ను ఇవాళ డిశ్చార్జ్ చేస్తారు కదా వెళ్లి చూద్దాం" అని నాన్న నన్ను సముదాయించడానికి ప్రయత్నం చేసారు.

అమ్మా నాన్నా, ఇంట్లో డబ్బు కంటే నేను వాళ్ళకి దక్కినందుకు దేవుడికి నమస్కరించుకుంటున్నారు. వాళ్ళకి అస్సలు డబ్బు గురించే బెంగ లేదు.

"ఏంటమ్మా కష్టపడి సంపాదించిన మూడు లక్షల రూపాయలు ఉన్నాయా లేవా అని నేను బాధపడుతుంటే మీకు కనీసం చీమ కుట్టినట్లైనా లేదు" అని గట్టిగా అరిచేసరికి

"అంటే ఏంట్రా నీ ఉద్దేశ్యం. నువ్వు శాంతమ్మ ని అనుమానిస్తున్నావా" అని అప్పటి వరకు నా గురించి ఏడుస్తూ ఉన్న అమ్మ ఒక్కసారిగా కోపంగా మారింది

"అంటే........"

"అసలు నువ్వు బ్రతకడానికి కారణం ఆవిడే...." అని అమ్మ ఏదో చెప్పబోతుంటే నాన్న అడ్డుకుని

"ఒరేయ్ నువ్వు విశ్రాంతి తీసుకో. అన్ని సంగతులు ఇంటికెళ్ళి మాట్లాడుకుందాం" అని అన్నారు

"అమ్మా, ఏమైంది చెప్పు, నాకేమైంది అసలు"

"మీరు ఉండండి దేవతలాంటి శాంతమ్మ ని అనుమానిస్తున్నాడు. నన్ను చెప్పనివ్వండి అని నాతో జరిగిన విషయం చెప్పసాగింది

"ఆ రోజు నీకు ఆక్సిడెంట్ అయితే కొందరు మానవతా మూర్తులు నిన్ను హాస్పిటల్ లో అడ్మిట్ చేసారు. నీ పర్స్ లో ఉన్న అడ్రెస్ ప్రకారం నీ గురించి సమాచారం ఇవ్వడానికి నువ్వుంటున్న ఇంటికి వెళితే అక్కడ శాంతమ్మ కనబడిందట. ఆవిడకి చెప్పారు. మాకు కూడా ఫోన్ చేసి చెప్పారు. కానీ అంత దూరం లో ఉన్నాం, రావాలంటే కనీసం ఆరేడు గంటలు పడుతుంది. ఈ లోపు హాస్పటల్ కి వచ్చిన శాంతమ్మకి డాక్టర్లు నీకు జరిగిన ఆక్సిడెంట్ గురించి వారు నిర్వహించిన టెస్ట్ ల ప్రకారం నీకు ఇదివరకే ఉన్న గుండె సమస్య గురించి చెప్పారు. ఆవిడ...."

"అమ్మా ఏడవకు ఏమయింది"

"నీకు ఆవిడ గుండె సరిపోతే అమర్చమని ప్రాధేయపడింది. డాక్టర్లు అందుకు ఒప్పుకోలేదు. బ్రతికున్న వ్యక్తుల గుండెలు తీసుకోవడం అనాగరికం అని వాదించారు. ఆవిడ ఒక ఉత్తరంలో

"గుండె జబ్బు వల్ల చనిపోయిన మా అబ్బాయి ని నేను ఎలాగో రక్షించుకోలేకపోయాను. కనీసం నా కొడుకులాంటి వాడు అయిన ఇతనిని రక్షించే అవకాశం నాకు కల్పించండి" అని రాసి నీ బెడ్ పై న పెట్టి ఈ హాస్పిటల్ పై నుంచి దూకి చనిపోయింది. ఆవిడనా నువ్వు అవమానిస్తున్నావు"

ఆగకుండా వస్తున్న కన్నీరు తో "అమ్మా..." అని మా అమ్మను గట్టిగా హత్తుకున్నాను.

నన్ను డిశ్చార్జ్ చేసారు. అమ్మా నాన్నలతో నాకు ఒకప్పుడు ఎంతగానో ఇష్టమైన ఇంటికి వచ్చాను. ఇప్పుడు ఆ ఇంటిలో శాంతమ్మ లేదు. నేను కంగారుగా దేనికోసమైతే బయలుదేరితే ఆక్సిడెంట్ అయిందో ఆ డబ్బు కప్ బోర్డులో నన్ను వెక్కిరిస్తూ చూస్తున్నట్టనిపించింది.

శాంతమ్మ పేరిట ఆ డబ్బుని గుడిలో అన్నదానానికి వాడాలనిపించింది.




'నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఇక్కడ కూడానా?'' విసుకున్నాడు పెరుమాళ్లు.

మందాకిని ఓ నవ్వు నవ్వింది.

''ఇక్కడ నీ చేతివాటం ఏం కొంప ముంచిద్దోనని నేను భయపడిఛస్తుంటే నీకు చీమ కుట్టినట్టయినా లేదే?'' అన్నాడు విసుగ్గా.

''ఊరుకుందురూ'' అంది మందాకిని సిగ్గుపడుతూ.

మందాకిని తీరే అంత.

కిరాణా కొట్టుకెళితే ప్రతి వస్తువు గిచి గిచి బేరమాడుతుంది. కందిపప్పు, వేరుసెనగనపప్పు లాంటి వాటిని షాపు వాడు తూచేలోపు ఓ గుప్పెడు పప్పు తీసుకుని గుటుక్కున నోట్లో వేసుకుంటుంది. అవతలవాడు ఏమన్నా పెద్దగా పట్టించుకోదు. నెలవారీ సరుకులు కొనేదాన్ని ఆ మాత్రం స్వతంత్రంగా ఉంటే తప్పేం ఉంది? అని ఎదురుప్రశ్నలు వేస్తుంది. లౌక్యంతో అవతల వాడి నోటికి తాళం వేసి తన పని కానిచ్చుకుంటుంది . కూరగాయల దుకాణానికి వెళితే, షాపు వాడి కన్ను కప్పి ఒకటో రెండో కాయలు బుట్టలో వేసుకునిగానీ ఇంటికి తిరిగి రాదు. ఏ స్వీటు షాపుకో వెళ్లినప్పుడు నాలుగయిదు రకాలు తుంపుకుని వాటి రుచిని ఆస్వాదిస్తుంది . లైబ్రరీకో, రీడింగు రూంకో వెళితే మూడో కంటికి తెలియకుండా పుస్తకాలు మాయం చేసి వెంట తెచ్చుకుంటుంది.

"ఈ అలవాటు మానుకోవే బాబూ" చాలాసార్లు నచ్చచెప్పి చూశాడు పెరుమాళ్లు.

ఆమె వినలేదు సరికదా..

"మీకు వ్యాపారుల సంగతి తెలీదు. అసలు ధరకు బోలెడు లాభం వేసుకుని అమ్ముతారు. తూకంలోనూ మోసం ఉంటుంది. ఇలా చేస్తే గానీ మనకు గిట్టు బాటు కాదు. "చేస్తున్న తప్పును సమర్థించుకుంటుంది. ఆమెకు చెప్పి చెప్పి విసిగిపోయాడు.

ఆరోజు తమ మూడేళ్ల కుమారుడిని స్కూలులో చేర్చటానికి బయలుదేరారు. అది నగరంలో బాగా పేరున్న టెక్నో స్కూలు. ఫీజులు భారీగా వసూలు చేస్తారని అంటారు. ఇక్కడ చదివితే బాగా రాణిస్తారన్న ప్రచారం ఉండటంతో పెరుమాళ్లు ఫీజు సంగతి అంతగా పట్టించుకోలేదు. భార్యను వెంటబెట్టుకుని అక్కడకు వచ్చాడు.

ఆమె దృష్టి లో పెరుమాళ్ళు నోరులేని సాధుజంతువు. ఇలాంటి వాళ్లని అవతల వాళ్లు తేలిగ్గా బుట్టలో వేసుకుంటారు. మాయమాటలు చెప్పి తమకు అనుకూలంగా మలుచుకుంటారు.

అందుకే ముందుగా హెచ్చరించింది అతన్ని.

“అన్నీ నేనే మాట్లాడతా... మీరు చూస్తూండండి. మధ్య మధ్యలో మాట్లాడి వ్యవహారం చెడగొట్టకండి” .

అందుకే మందాకిని ఏకథాటిగా డైరక్టర్ తో అరగంట మాట్లాడినా పెరుమాళ్లు కల్పించుకోలేదు. నోరుమెదపలేదు. డైరక్టర్ చెప్పుకుపోతున్నాడు.

“ఈ ఏడు ఐఐటి, ఎమ్ సెట్, బిట్స్ లో ర్యాంకులన్నీ మా కాలేజి వాళ్లకే వచ్చాయంటే, ఇక్కడ కోచింగ్ గురించి మీకు ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ప్రతి విద్యార్థి పైన ప్రత్యేకంగా దృష్టి పెడతాం. వెనకబడ్డ వాళ్లని ఓ గ్రూపుగా చేసి, గైడెన్స్ ఇస్తాం. ”

మందాకిని ఇంకేదో చెప్పబోయింది. డైరక్టర్ వినిపించుకోలేదు. తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

“మొన్నా మధ్య నాసాకి ఎంపికయిన పిల్లలో సగం మంది ఇక్కడి వాళ్లే. వారానికి మూడు రోజులు క్లాసులయిన తరువాత శిక్షణ ఇస్తాం. దీనికి బయట కాలేజీల నుంచి నిపుణుల్ని రప్పించాలి. ఇదంతా ఒక ఎత్తు. ఆరోగ్యం సూత్రాలు ఒక ఎత్తు. శారీరక, మానసిక వికాసానికి స్పోర్ట్స్, గేమ్స్ కూడా చూస్తాం. మిగతా స్కూళ్లలో పిల్లల్ని బట్టీ యంత్రాలుగా మారుస్తారు. మేం మాత్రమే సృజనాత్మకత కల వారిగా తీర్చిదిద్దుతాం. యోగా, మెడిటేషన్ వంటివి మా సిలబస్ లో జోడించాం. మానవతా విలువల బోధన మా చదువులో ఓ భాగం. మీరొక్కసారి పిల్లవాడిని మాదగ్గర చేర్చి ఆతర్వాత వాడి గురించి మరిచిపోవచ్చు. హాస్టల్లో చేర్చండి . చదువు, తిండీ తిప్పలు అన్నీ మేమే చూసుకుంటాం...”

ఒక్కో దానికి విడివిడిగా ఎంతవుతుందో చెప్పి, అందులో నుంచి ఓ పదివేలు తగ్గించి చెల్లించమని చెప్పాడు. ప్రిన్సిపాల్ని కలసి దరఖాస్తు పూర్తిచేసివెళ్లమని , అడ్వాన్సుగా ఓ పదివేలు చెల్లించి వెళ్లమని చెప్పాడు.

ఎప్పటిమాదిరిగానే మందాకిని బాగా బేరం ఆడింది. ఆరో తరగతిలో చేరితే ఇంటర్ వరకూ అక్కడే చదివిస్తాం. మా వాడు తెలివైన వాడు. స్కూలుకు మంచి పేరు తెస్తాడు...

ఇలాంటి మాటలేవో చెప్పి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఆ మాటా ఈ మాటా చెప్పి చివరికి పాతిక వేల దాకా తగ్గేలా బేరం ఆడగలిగింది.

అక్కడి నుంచి వస్తూ ...

"నిజంగా మంచిమాటకారి. ఆమె వల్ల ఫీజులో రాయితీ సాధ్యమయింది." మనసులో మెచ్చుకుంటూనే... తెరవెనక ఏం చేసిందోనని ఆందోళన చెందుతున్నాడు.

అతను భయపడినట్టుగానే స్కూలు గేటు దగ్గర సెక్యూరిటీ వాడు ఆపాడు.

భయంతో పై ప్రాణాలు పైనే పోయాయి అతనికి.

"ఇప్పుడు వాళ్లేం అంటారో... నలుగురి ముందు పరువుపోతుంది. సిగ్గుచేటు" అనుకున్నాడు.

"మేడమ్... పొరపాటున ఆఫీసులో పెన్ను పట్టుకొచ్చారట" లోపల నుంచి వచ్చిన బాయ్ చెప్పాడు.

ఎడమ చేతి గుప్పెడలో ఉన్న పెన్ను తీసి అతని చేతి కిచ్చింది.

అది ఖరీదయిన పార్కర్ పెన్ను.

"పొరపాటున తెచ్చావు అనుకున్నారు కాబట్టి సరిపోయింది" లేకపోతే ఈ పాటికి మనల్ని..." మందలించే ప్రయత్నం చేశాడు.

మందాకిని అదేం పట్టించుకోలేదు.

అప్పటికి స్కూలు గేటు దాటి రోడ్డు మీదకు వచ్చారు.

కొంటెగా నవ్వుతూ భుజాన వేలాడుతున్న హేండ్ బాగ్ నుంచి ఐపాడ్ తీసి అతని చేతిలో ఉంచింది మందాకిని.

కొన్ని నిముషాల క్రితం ఆ ఐపాడ్ ను ప్రిన్సిపాల్ గదిలో చూశాడు.

"ఖర్మ. కొసరు లేకుండా ఏ పనీ చేయవు కదా..." తలకొట్టుకున్నాడు పెరుమాళ్లు.

అదే సమయానికి బాయ్ మందాకిని తిరిగిచ్చిన పెన్నును డైరక్టర్ చేతిలో ఉంచి అడిగాడు.

“అదేంటి సార్... అంత ఖరీదయిన ఐపాడ్ పట్టుకుపోతే పట్టించుకోకుండా... మామూలు పెన్ను తిమ్మని అడిగారు.”

ఆ మాటలకు డైరక్టర్ చిరునవ్వు నవ్వాడు.

“మన స్కూలులో అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలున్న విషయం వాళ్లకి తెలీదు. మనల్ని బోల్తా కొట్టించామని సంబరపడుతున్నారు. ఆ ఐపాడ్ పాతది. ఈ మధ్యనే పాడయింది. మిగిలిన ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు ఇన్సూరెన్స్ కి అప్లై చేశా. రేపోమాపో డబ్బులు వస్తాయి. కొత్తవి తెచ్చుకుంటాం” అన్నాడు.

బాయ్ అయోమయంగా చూశాడు.

“వాళ్లని అంత తేలిగ్గా వదలలేదు. బిల్డింగ్ ఫండ్, టూర్ ఫండ్, సైన్స్ క్లబ్... ఇలా రకరకాల పేర్లతో చాలా ఫీజు గుంజేశాం. అసలుకు కొసరు అన్న మాట” అన్నాడు.

గదిలో నుంచి బయటకు వెళుతూ ఓసారి వెనక్కి తిరిగి చెప్పాడు...

“వాళ్లకే అంత తెలివితేటలుంటే... వ్యాపారం చేసేవాళ్లం మనకెంత ఉండాలి?”




‘ఏరా… నలుగురు ఎప్పుడూ అతుక్కుని తిరుగుతుంటారు. కనీసం పెళ్లిళ్లయినా విడివిడిగా చేసుకుంటారా… లేకపోతే ఒకే దానికి ముడేస్తారా…’ మా ఊరి వాళ్లు అనే మాటలు విన్న ప్రతిసారీ తెలియని ఆనందం. మా స్నేహాన్ని చూసి అసూయతో వాళ్లంటున్న మాటలు వింటే ఒకింత గర్వం.

మా స్నేహం ఎప్పుడు మొదలైందో గుర్తులేదుగానీ ఊహ తెలిసినప్పటి నుంచి కలిసే ఉన్నాం.

ఒకే రకం ఆలోచనలు, అభిప్రాయాలు కలిగిన వారి స్నేహం శాశ్వతంగా నిలిచి ఉంటుందనే సిద్ధాంతం మా విషయంలో అక్షరాలా అబద్ధం. నిజానికి మా నలుగురి వ్యక్తిత్వాలు వేరు. నేపథ్యాలు వేరు. ఇద్దరు పదోతరగతిలోనే చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి ఒకరు ట్రాక్టర్ డ్రైవర్‌గా, మరొకరు ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడ్డారు. నేను రేయింబవళ్లు కష్టపడి చదివి ముప్పయ్ ఐదు మార్కులకు ఒక్కటి కూడా ఎక్కువ కాకుండా మార్కులు తెచ్చుకుంటూ డిగ్రీ వరకూ వచ్చాను. కానీ వాడు బిట్స్ లో ఇంటర్ చదివాడు. ఇప్పుడు

అహ్మదాబాద్ ఐఐటీలో ఇంజనీరింగ్ చేస్తున్నాడు. మా కన్నా తెలివైనవాడు, అందగాడు, ఆస్తి బాగా ఉన్నవాడు. వాడితో స్నేహానికి ఊరుఊరంతా వెంట పడుతుంటే వాడు మాత్రం మా వెంటే ఉంటాడు. వాడికి సెలవులిస్తే మాకూ ఇచ్చినట్లే. మా అందరి మకాం ఊరి చివర చింతతోపులోనే. వాడు ఉన్నన్ని రోజులూ మాకు వేడుకే. సినిమాలు, షికార్లతో సమయమే తెలిసేది కాదు.

కాలేజి నుంచి వాడి స్నేహితులు ఎవరైనా ఫోన్ చేస్తే వాళ్లతో చక్కని ఇంగ్లీష్, హిందీల్లో మాట్లాడతాడు. ఊరిలో గేదెలు కాసుకునేవాళ్లు, కూలి పనులకు వెళ్లే వాళ్లు ఏదైనా అడిగితే వాళ్లకు అర్థమయ్యేలా సమాధానం చెబుతాడు. సైంటిఫిక్ డెవలప్ మెంట్స్, స్పోర్ట్స్, పాలిటిక్స్... వాడికి తెలియని విషయం లేదు. వాడు మాకో ఆశ్చర్యం, ఓ అద్భుతం. మాకు తెలిసిన చిన్న ప్రపంచానికి ఐన్‌స్టీన్.

ఏరా...నీ స్థాయిలో చదివే వాళ్లతో స్నేహం చేస్తే రేపు నీకేదైనా ప్రయోజనం ఉంటుంది కానీ, ఆ గాలి ఎదవల్తో తిరిగితే ఏం లాభం... అని అమ్మనాన్న ఒకరోజు వాడ్ని అడిగారు. దానికి వాడు ఏం సమాధానం చెప్పాడో తెలుసా... లాభాలు, నష్టాలు బేరీజు వేసుకుని చేయడానికి ఇది వ్యాపారం కాదు... స్నేహం. ఇక మళ్లీ ఎవరూ దీని గురించి మాట్లాడలేదు. నిజానికి దేవుడు మాకు పెద్దపెద్ద చదువులు, చదివే తెలివి తేటలివ్వలేదు. అందచందాలు, ఆస్తిపాస్తులు... ఏవీ ఇవ్వకుండా భూమి మీదకు తోసేశాడు. పాపం దేవుడు అంతలోనే జాలిపడి, తన తప్పుకు తానే పశ్చాత్తాప్పడి 'మిల్లీగ్రామ్ మెదడు కూడా లేని వీళ్లు ఎలా బతుకుతారో అని ఆలోచించి, మాకు తోడుగా వాడ్ని పంపాడని' మేమెప్పుడూ చెప్పుకుంటూ ఉంటాం. అంటే దీనర్థం వాడి మీద పడి బతికేద్దామని కాదు... వాడు తోడుగా బతికేద్దామని.

కాలం ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు కదా. నేనొకణ్ని ఉన్నాను అని గుర్తు చేయడానికి దేవుడు అప్పుడప్పుడు చిన్న చిన్న పరీక్షలు పెడుతుంటాడు. ఇప్పుడు అలాంటి పరీక్షే వాడికి ఎదురైంది. ఏదో చిన్న అనారోగ్యంతో ఊరికి వచ్చాడు. అమ్మానాన్నలతో కలిసి టౌన్లోని ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి డాక్టర్లు పరీక్షలు చేసి పెద్దాస్పత్రికి తీసుకెళ్లమన్నారు. అక్కడా పరీక్షలు చేశారు. ఎక్సరేలు, స్కానింగ్‌లూ తీశారు. చివరకు స్టమక్ క్యాన్సర్ అని తేల్చేరు. వ్యాధి రెండో దశలోనే ఉందని కీమోథెరపీతో ప్రయోజనం ఉండొచ్చని చెప్పారు.

ట్రీట్‌మెంట్ ప్రారంభమైంది. ఆరునెలలు గడిచాయి. మనిషి గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు. జుట్టు ఊడిపోయింది. చర్మం నల్లబడింది. కళ్లు, చెక్కిళ్లు పీక్కుపోయి... చర్మం కప్పుకున్న అస్తిపంజరంలా తయారయ్యాడు. పాతికేళ్లు కలిసి తిరిగిన మాకే వాడ్ని గుర్తుపట్టడానికి పావుగంట పట్టింది.

లోకంలో ఇంతమంది ఉంటే ఈ జబ్బు మా కొడుక్కే రావాలా... వెక్కివెక్కి ఏడుస్తున్నారు వాడి అమ్మానాన్న. అంతటి విషమ పరిస్థితిలోనూ వాడు నిబ్బరాన్ని కోల్పోలేదు. నాకొచ్చింది కాబట్టే బతికున్నా. అదే ఇంకెవరికైనా వచ్చుంటే జబ్బు ముదిరిపోయే

వరకూ గుర్తించేవాళ్లు కాదు. మూడు నెలల్లో ట్రీట్‌మెంట్ పూర్తవుతుంది. ఏడాదిలో మళ్లీ మామూలు మనిషినవుతానని అందరికీ ధైర్యం చెప్పేవాడు. ఆస్పత్రికి వెళ్లిన మాతోనూ సరదాగానే మాట్లాడేవాడు. ఎవరైనా సానుభూతిగా మాట్లాడితే ఒప్పుకునే వాడు కాదు. వాడికి చెస్ ఆడాలని ఉందంటే కాసేపు ఆడి ఇంటికి వచ్చాం. కొద్ది సేపు ఆడి మేము ఆట ఆపాం. మరుక్షణం ఆట దేవుడు మొదలు పెట్టాడు... బ్రెయిన్ స్ట్రోక్ రూపంలో. అర్ధరాత్రి ఒక్కసారిగా వచ్చిన తలనొప్పితో విలవిల్లాడిపోయాడు. డాక్టర్లు వచ్చి చూసేలోపే తలలో నరాలు చిట్లి చ..ని..పో..యా..డు.

ఆ వార్తను నమ్మడం మావల్ల కాలేదు. వాడికి క్యాన్సర్ అని తెలిసినా మేము భయపళ్లా. కాన్సర్ మీదున్న భయం కన్నా వాడి మీదున్న నమ్మకం మాకెక్కువ. క్యాన్సర్ పిరికిది. మనల్ని చంపే దమ్ము ఆ క్యాన్సర్ గాడికి లేదులే అని వాడే సరదాగా అంటుండే వాడు. కానీ ఇప్పుడు ఇలా..! మృతదేహాన్ని ఉదయాన్నే ఊరికి తీసుకొచ్చారు. చూసేందుకు ఊరుఊరంతా కదలి వెళ్లింది. విగతజీవిగా పడి ఉన్న వాణ్ని చూసి కన్నీటి సంద్రమైంది. బాడీ డీకంపోజ్ అవుతుండటంతో మధ్యాహ్నమే అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. మేళతాళాలతో వాడి అంతిమయాత్ర ప్రారంభమైంది. ఎన్నో ఆశలు, ఆశయాలు, కోరికలు...సాయంత్రానికి గుప్పెడు బూడిదగా మిగిలిపోయాయి. 'ఇన్నాళ్లూ కలిసి తిరిగి ఇప్పుడు కనీసం చూడ్డానికి కూడా రాలేదు చూడు...ఏం స్నేహితులో ఏమో..!' ఊళ్లో రకరకాల వ్యాఖ్యానాలు.

నిజమే మేము వాడ్ని కడసారి చూసేందుకు వెళ్లలేదు. వాడ్ని అలా చూసే శక్తి లేదు. చూసి తట్టుకునే ధైర్యం లేదు. ఊళ్లోవాళ్లకి మాట్లాడుకోవడానికి రెండు రోజుల్లో కొత్త టాపిక్ దొరుకుతుంది. మిగిలిన ఇద్దరు పిల్లల్ని చూసుకుని వాడి అమ్మానాన్న నెమ్మదిగా బాధను మర్చిపోతారు. అలా చూసుకుని మర్చిపోవడానికి మాకు మరో స్నేహితుడు లేదు. అయినా ఎప్పుడూ కళ్లముందు ఉండేవాడ్ని కడసారి చూడ్డమేంటి. అర్థం లేని మాట. వాడు మాతో మాట్లాడిన మాటలు, నవ్వుకున్న నవ్వులు, కలిసి తిరిగిన రోజులు, చూసిన సినిమాలు, తాగిన వన్ బై టూ చాయ్‌లు, చింతతోపులో గంటలకు గంటలు చెప్పుకున్న కబుర్లు మా స్మృతిపథంలో సజీవంగా ఉంటే... వాడు లేడని నమ్మేదెలా. ఇక ముందూ చింతచెట్టు కొమ్మమీద మేమున్నప్పుడు మధ్యలో వాడికి చోటుంటుంది. సినిమాహాల్‌కు వెళితే నాలుగు టికెట్లు. హోటల్‌కి వెళ్తే టూ బై ఫోర్ ఛాయ్. పండగొస్తే నాలుగు జతల బట్టలు. దేనిలోనూ మార్పుండదు. ప్రతి మనిషి గుండెలో నాలుగు గదులుంటాయంటా. ఒకదాంట్లో ఎప్పటికీ వాడే...పదిలంగా. మా ప్రతి వ్యాపకంలో, జ్ఞాపకంలో వాడుంటే.. చనిపోయింది ఎక్కడ... దేవుడు గెల్చింది ఎక్కడ.




స్వర్ణముఖి దంపతులు ఇంటికి దగ్గరలోని వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళారు. దర్శనానాంతరం తిరిగి వెళుతుండగా వారికి గుడి ఆవరణలో ఎనిమిది సంవత్సరాల ఒక అమ్మాయి కనిపించింది. ఆమె వారి దగ్గరకు వచ్చి "అమ్మా! ఏదైనా పనివుంటే ఇప్పించండమ్మా, మీ ఇంట్లో పని చేసుకొని బతుకుతాను." అని వారిని ఎంతో దీనంగా బ్రతిమలాడింది.

ఆ అమ్మాయిని చూసి జాలిపడి వారితోపాటే ఇంటికి తెచ్చుకొని పెంచసాగారు.

స్వర్ణముఖి సాంప్రదాయ నృత్యకళాకారిణి. ఇంటివద్దే తరగతులు నిర్వహిస్తూ శిక్ష ణ నిస్తూ వుంటుంది. అనేకమంది ఆమె వద్ద శిక్షణ పొంది, అనేక ప్రదర్శనలిస్తూ వుంటారు.

స్వర్ణముఖి ఏకైక కూతురు నర్మద. నర్మద కి కూడా ప్రత్యేక శిక్షణ నిచ్చి ప్రముఖ నర్తకిని చేయాలని ఆమె ఆశ.

ఇంటికి తీసుకువచ్చిన ఆ చిన్నారికి గోదారి అని నామకరణం చేసింది. స్వర్ణముఖి కి గోదారి వచ్చిన దగ్గరనుంచి కొంచెం కాదు బాగానే పని తగ్గిందని చెప్పొచ్చు. ఇంట్లో నమ్రత గా వుంటూ, చిన్నపిల్లయినా ఇంటి పనినంతటిని చక్కగా చేసిపెట్టేది గోదారి.

స్వర్ణముఖి శిష్యులకు నృత్య పాఠాలు చెప్పడం దూరం నించే గమనించేది గోదారి. తనకి తెలియకుండానే పనులు చేసుకుంటూ అవలీలగా నర్తించగలిగేది గోదారి. ఏకలవ్య దీక్ష తోటే, ఇంచుమించుగా చాలావరకు గ్రహించింది. ఒకరోజు యాధృచ్ఛికంగా నర్తిస్తున్న గోదారి, స్వర్ణముఖి కంట పడింది.

"నీకు నాట్యం వచ్చా?" అని అడిగింది స్వర్ణముఖి.

" లేదమ్మా, ఏదో ఊసుపోక పనిలో సాయంగా అలా గెంతుతూ వుంటాను తప్ప నాకేమీ తెలియదమ్మా ." అని చెప్పింది.

"లేదు, నీకు తెలియకుండానే నీలో మంచి మెళుకువ వుంది. రేపటి నుండి నర్మద తో పాటు కలిసి నేర్చుకో." అని చెప్పి ప్రోత్సహించింది స్వర్ణముఖి.

అలా నర్మద, గోదారి ఇద్దరూ నాట్యం అభ్యసించడం మొదలెట్టారు. అనతికాలం లోనే ఇద్దరూ మంచి నర్తకిలుగా పేరు సంపాదించారు. ఇద్దరూ అనేక చోట్ల జంట ప్రదర్శనలు కూడా ఇచ్చేవారు.

ఒకనాడు కళాతరంగిణి సంస్థవారు జాతీయస్థాయి పోటీలను నిర్వహించదలచి ఎంట్రీలను కోరగా అనేకమంది దరఖాస్తు చేయడం జరిగింది. ఆ పోటీలకి నర్మద, గోదారి కూడా దరఖాస్తు చేయడం, సెలక్ట్ కావడం కూడా జరిగింది. కళాతరంగిణి జాతీయ అవార్డ్ ఇంచుమించు నాట్యరంగం లో అతి పెద్ద గుర్తింపుగా చెప్పుకోవచ్చు. ఫైనల్ విన్నర్ కి విదేశాల్లో నాట్యప్రదర్శన అవకాశాలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు పరంగా మంచి గుర్తింపు లభిస్తుంది. ఇలాంటి అవకాశాన్ని ఎలాగైనా వదులుకోకూడదని స్వర్ణముఖి నిశ్చయించుకొని ఎలాగైనా నర్మద కి ఈ అవార్డ్ వచ్చేలా అనేక లాబీయింగ్ లు చేయించింది.

అయినా ఎక్కడ గోదారి ఈ అవార్డ్ ఎగరేసుకుపోతుందో అన్న సంశయం వచ్చిపడింది స్వర్ణముఖికి. ఈ రోజు వరకు ఏనాడూ తేడా లేకుండా విద్యను నేర్పినా, పనిపిల్ల గా ఇంట్లోకి తీసుకువచ్చినా పరాయి మనిషిగా చూడలేదు. కాని తను పెంచిన మొక్కనీడ,తన మొక్కనే ఎదగనివ్వదేమోనన్న దుగ్ధ ఆవహించింది. అభిమానం స్థానాన్ని స్వార్ధం ఆక్రమించింది.

కాని ఇప్పుడు గోదారి అడ్డుతొలగించుకోవడమెలాగో ఆమెకు అర్ధం కాలేదు. ఇంత పెద్ద పేరు ప్రఖ్యాతలున్న నాట్యవేత్త కూతురు కాకుండా, ఒక పనిపిల్ల ఎదగడాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఎలాగైనా ఈ పోటీలకు వెళ్ళకుండా గోదారిని ఆపాలనుకుంది.

ఒక పక్క పోటీలకోసం ఇద్దరూ హోరాహోరీగా అభ్యాసం చేయసాగారు.

ఒక రోజు మెట్లమీదనించి దిగుతుండగా చూడకుండా నూనెపోసింది స్వర్ణముఖి. కాని చిన్న తుంటినొప్పితో బయటపడింది గోదారి. స్వర్ణముఖి మొదటి ప్రయత్నం బెడిసికొట్టింది.

పోటీలు జరిగే రోజు రానే వచ్చింది.

ఆడిటోరియంకి గోదారిని వేరే డ్రయివర్ తో వేరే కారులో పంపించింది. ఆ కారులో బ్రేకులు తీసివేసింది. చివరి ప్రయత్నం ఈ సారి గురి తప్పదనుకుంది. కాని విచిత్రం ఆ ప్రమాదం లో కూడా సురక్షితం గా బయటపడింది గోదారి.

ఆడిటోరియం లో హోరాహోరీగా పోటీలు సాగుతున్నాయి. నర్మద ప్రదర్శన పూర్తయింది. గోదారి కోసం ఎనౌన్స్ చేసారు. ఆడిటోరియం అంతా ఒకటే చప్పట్లు, అభిమానుల కోలాహలం తో ఎంతో సందడిగా వుంది. కాని విచిత్రం గోదారి రాలేదు. గోదారి ప్రదర్శన ఇవ్వలేదు. సమయం దాటిపోయింది.

నర్మద విజేత గా నిలిచింది. ఎంతో పేరు, హోదా, కీర్తి లభించాయి స్వర్ణముఖి కి గురువుగా.

కాని గోదారి ఏమైంది, గోదారికి ఏమైంది?.

గోదారికారు యాక్సిడెంట్ అయినచోట ఒక ఉత్తరం దొరికింది స్వర్ణముఖి కి. దానిలో...

"అమ్మా, గుడిమెట్ల మీద బతకవలసిన నన్ను దేవాలయం లో దేవతగా తీర్చిదిద్దారు మీరు. గోదారిగా నామకరణం చేసి తల్లిదండ్రులెవరో తెలియని నాకు, తల్లిదండ్రులకన్నా ఎక్కువయ్యారు. ఊసుపోక గంతులేసే నాకు, గజ్జెకట్టి నాట్యగత్తెనయ్యే స్థాయి, హోదా కల్పించారు.

ఈ జీవితానికి ఇంతకన్నా ఎక్కువకోరుకుంటే దేవుడైనా నీది అత్యాశే కదా అనడా? మెట్ల మీదనించి జారిపడ్డప్పుడే నేను గమనించాను. కానీ జన్మనిచ్చిన తల్లికన్నా నాకు మీరెక్కువ... ఏ తల్లయినా పిల్లను కష్టపెట్టాలనుకోదు కదా! మా అమ్మకాని అమ్మ అంతకన్నా గొప్పది. అలా ఎందుకు చేస్తుంది. అని నా మనసు కొట్టి పారేసింది. కారులో మీరు మెకానిక్ కి చెప్పి బ్రేకులు తీయిస్తుండగా నేను చూసాను. తల్లి కోరుకుంటే తల్లికోసం ప్రాణాలు ఇవ్వగలిగితే నా జీవితానికి ఇంతకు మించిన ఆనందం ఇంకేముందనుకున్నాను.

విచిత్రం కారును జాగ్రత్తగా చెట్టుకు గుద్ది గండం నుంచి బయటపడేసాడు డ్రైవర్. అంతా విధి అనుకున్నాను.

మనిషి ఒకటి తలిస్తే దైవం మరోలా చేస్తున్నాడని గ్రహించాను. తీరా నేను గజ్జెకట్టి ఆడితే, నేను బాగా చేయకపోయినా అక్కడ కూడా అదృష్టం వరించి నేను విజేత నయితే, ఇక ఈ జీవితం లో నేను అమ్మకాని అమ్మ ఋణం తీర్చుకోలేనేమోనని ప్రదర్శన ఇవ్వడం మానేసాను."

ఇలా చదువుకుంటూ పోతున్న స్వర్ణముఖి కి నోట మాట రాలేదు.

కళ్ళ నించి జలజలా రాలుతున్న నీరు తప్ప... మనసులో అనుకుంది స్వర్ణముఖి, "నువ్వు వట్టి గోదారివి కాదు జలజల పారే నిండు గోదారి కన్నా గొప్పదానివని..."




ఇందూ ఈమధ్య మరీ చలాకీగా మారిపోయింది. మామూలుగానే చురుకైంది. ఇవ్వాళ రేపు ఇంతగా మారిపోతున్న చుట్టూ జనాలని చూసి తనకేం తక్కువనుకుంది. ముఖ్యంగా ఇవ్వాల్టి కుర్రజంటలు. ఎప్పుడో... "మొగుడు పెళ్ళాన్ని పేరెట్టి పిలవడమా...!" అని దవడలు నొక్కుకునే రోజులు చూసిన ఇందూ, ఇప్పుడు పెళ్ళాలే మొగుళ్ళని పేరు పెట్టి పిలవడమే కాకుండా ఒకరినొకరు ముద్దుపేర్లు కూడా పెట్టుకుని పిలుచుకోవడం చూసి మురిసిపోయింది.

ఎంచక్కా... ఎంత మంచి రోజులొచ్చాయి... భార్యాభర్తలిద్దరూ ఒకరికోసం ఒకరన్న వారి భావం ఎంతబాగుందీ... అనుకుంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఈనాటి భార్యాభర్తల్లో ఇందూకి చాలా చాలా నచ్చేసిన విషయం ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం. అది కూడా సర్ ప్రైజ్ అంటూ...

నిజమే కదా.. ఒకప్పుడు "వచ్చే నెల నా పుట్టినరోజండీ... కొత్త చీర కొనుక్కుంటాను..." అని అడిగితే...

"వచ్చే నెల కదా... ఇంకా బోల్డు టైముంది... చూద్దాంలే..." అనడం... తీరా ఆ వచ్చేనెల మర్చిపోవడం... తను ఉడుక్కోవడం... ఇలాంటి అనుభవాలున్న ఇందు ఇప్పటి కుర్రజంటలు ఇద్దరి పుట్టినరోజులూ ఒకరిదొకరు గుర్తు పెట్టుకుని, ఆరోజు సర్ ప్రైజ్ గా వారికి గిఫ్ట్ కొనివ్వడమే కాకుండా ఇద్దరూ బైటకి పోయి ఎంజాయ్ చెయ్యడం చూస్తుంటే... తనెందుకు అలా చెయ్యకూడదూ... అనిపించింది.

అనిపించడమేమిటి... ఆచరించేసింది కూడానూ. వచ్చే వారంలో వస్తున్న భర్త పుట్టినరోజుకి మొట్టమొదటిసారిగా చందూకి తెలీకుండా బజారుకి వెళ్ళి ఒక మంచి షర్ట్ తీసుకుంది. ఎంతో భావజాలంతో వున్న పుట్టిన్రోజు శుభాకాంక్షలు తెలిపే కార్డు వెతికి వెతికి మరీ కొంది.

ఆ రోజు పొద్దున్నే అతనిచేత తలంటు పోయించి, "సర్ప్రైజ్ " అంటూ వెలిగిపోతున్న మొహంతో షర్టూ, కార్డూ అతని చేతిలో పెట్టింది.

అలవాటు లేని ఔపోసన అన్నట్టు అదేమిటో అర్ధంకాక తెల్లమొహం వేసుకుని ఇందూ వైపు చూసేడు చందూ.

"ఇవాళ మీ పుట్టిన్రోజండీ. కొత్తషర్ట్ కొన్నాను... వేసుకోండి..." అంది.

ఇందూ మొహంలో ఆనందం చూసిన చందూ మారుమాట్లాడకుండా ఆ చొక్కా తొడుక్కున్నాడు. చొక్కా ఎంత బాగుందో అని మురిసిపోయిన ఇందూ... ఓ థాంక్సు పడెయ్యొచ్చు కదా అని అనుకుంది.

ఇవేవీ అర్ధంకాని చందూ కొత్తచొక్కా తొడుక్కుని, సోఫాలో కూర్చుని, తీరుబడిగా టీవీ చూస్తున్నాడు.

"లేవండి వెడదాం..." అంది ఇందూ అతని దగ్గరకొచ్చి.

"ఎక్కడికి?" ఆశ్చర్యపోయేడతను.

"బైటకి..."

"ఎందుకు..."

"ఎంజాయ్ చెయ్యడానికి.."

"అంటే,,

"అబ్బా, చెప్తాను పదండి..." అంటూ సినిమాకి లాక్కుపోయింది.

ఓ కథంటూ లేకుండా అర్ధంపర్ధంలేని పిచ్చిగెంతులూ, కవాతులూ వున్న ఆ సినిమా చూసేసరికి ఇద్దరికీ తలనొప్పి వచ్చేసింది.

ఇంటికి వస్తూ వస్తూ హోటల్లో భోంచేసేరిద్దరూ. ఇందూ చేతివంట అలవాటైన చందూ ఆ భోజనం అస్సలు తినలేకపోయేడు. ఇందూ అంతే. దొంగాడికి తేలు కుట్టిన పరిస్థితి.

పైకేమీ మాట్లాడకుండా తినేసి, అలసిపోయి ఇల్లు చేరేరిద్దరూ. ఇంటికి రాగానే సినిమా ఖర్చూ, హోటల్ ఖర్చూ ఎంతైందీ చందూ లెక్కలు చూసుకుంటుంటే, ఇందూ ఫోన్ తీసి తన స్నేహితులూ, చుట్టాలకందరికీ ఫోన్లు చేసి, తను చందూ పుట్టిన్రోజుకి యెంత సర్ప్రైజ్ పార్టీ యిచ్చిందో, తామిద్దరూ యెంత బాగా యెంజాయ్ చేసేరో వర్ణించి వర్ణించి చెప్పడం మొదలుపెట్టింది.




జాదవ్ అంటే రౌడీ!

ఆరడుగుల ఆజానుబాహుడు... కండల వీరుడు. తారు డబ్బాలా నల్లగా నిగ నిగ లాడుతూ వాడి గ్యాంగ్ తో తిరుగుతూంటే ఎదురుపడిన వాళ్ళు వాడి హింసకి బలైపోవలసిందే!

మా ఏరియాలోని ఆబాలగోపాలానికి వాడంటే హడల్. వాడిని చూస్తే గుండె జారిపోతుంది.

ఇహ నా గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. భయపడేవాళ్ళలో నేనూ ఒకడిని.

రేషన్ షాపుదగ్గరైనా... వీధి కుళాయి వద్దయినా 'కాదేది వాడికడ్డం' అన్నట్టుగా వాడి దాష్టీకానికి గురవుతూంటాం!

ఒకరోజు రాత్రి సెకండ్ షో సినిమా చూసి వస్తున్నాను.

నిజానికి ఈ సమయంలో మా వీధిలో ఎవరూ బయటికి వెళ్ళరు. 'చీకట్లో వాడికెక్కడ దొరుకుతామో?' అని. కాని నా అభిమాన హీరో సినిమా రిలీజ్ అయింది. సిటీకి వెళ్ళకుండా ఉండలేకపోయాను. ఫ్రెండ్స్ ని రమ్మంటే 'రామంటే రామ'న్నారు. నేను తెగించి వెళ్ళి సినిమా చూశాను గాని. మా ఏరియాలోకి ఎంటర్ అవ్వగానే భయం ప్రారంభమైంది. 'స్వామీ! వెంకటేశ్వరా నేను జాదవ్ గాడి కంట పడకుండా చూడు. నేను శనివారం ఉపవాసం వుండి గుడికొచ్చి కొబ్బరికాయ కొడతాను' అని మనసులో వేల సార్లు మొక్కుకుంటూ నడుస్తున్నాను. చీకటికన్నా... పురుగు పుట్రకన్నా... దెయ్యాలు భూతాల కన్నా వాడి భయం నాకు ఎక్కువైంది. అవును మరి అవి వాటి జోలికెళితేనే మనకి అపకారం తలపెడతాయి. వాడలా కాదే! అన్నిటి కన్నా క్రూరమైన విషతుల్యమైన వాడు. తలుచుకుని ఆలోచిస్తూ నడుస్తున్న నేను తలెత్తి చూసేసరికి కళ్ళు భయంతో విచ్చుకున్నాయి. నోరు పిడారిపోయింది. గుండె కొట్టుకునే వేగం రెట్టింపు అయింది. ఇవాళ్టితో నా చాప్టర్ క్లోజ్ అయిపోతుంది. వెంకటేశ్వర స్వామి కూడా ఏమీ చేయలేకపోయాడు. విధినెదిరించడం ఎవరితరం? కొద్ది దూరంలో లైట్ పోల్ కింద జాదవ్ ఒక్కడూ నుంచుని వున్నాడు. నేను అడుగు ముందుకు పడక భూమి మాగ్నెట్ కి అతుక్కుపోయాను. వాడు నా వంక చూసి నా దగ్గరికి రావడం మొదలెట్టాడు. నన్నేం చేస్తాడు? ఉత్త పుణ్యానికి చంపిపారేస్తాడా? చంపితే ఎలా చంపుతాడు? కత్తితోనా? పిస్తోల్ తోనా? లేక ఒక గుద్దు పొట్టలో గుద్దా? వాడి చేతిలో మాత్రం ఏం లేదు. ఏం చెప్పగలం జేబులో వున్నాయేమో? వాడు కాస్త వేగంగా నా వైపు రాసాగాడు. నాకెందుకో కళ్ళు మూసుకోవడం మంచిదనిపించింది. మూసుకున్నాను.

కొద్ది సేపటికి "అన్నా" అన్న వాడి గొంతు కర్కశత్వంలో కాసింత బేలతనం కలసి వినిపించింది.

నేను కళ్ళు విప్పాను.

'ప్లీజ్ నన్నేం చేయకు... నీకు పుణ్యముంటుంది...' అని అనబోయేంతలో..." అన్నా! నేను నీ వెనకాలే వస్తాను నన్ను మా ఇంటికాడ దింపుతావా?" అన్నాడు వణుకుతున్న గొంతుతో.

ఆ కొత్త ట్విస్ట్ కి నాకు ఆశ్చర్యం కలిగింది. 'వీడు కాసేపు నాతో ఆడుకుని ఆ తర్వాత ఫినిష్ చేస్తాడేమో' అన్న ఆలోచన రాగానే

మళ్ళీ భయం ఆపాదమస్తకం ఆవహించి చెమట్లు పట్టించింది.

"నేను నిన్నేం చేయనన్నా... ఒట్టు... నన్ను కాస్త మా ఇంటి దగ్గర వదులు చాలు." అన్నాడు.

వాడి ముఖం చూస్తే నాకు కాస్త ధైర్యం చెక్కింది! 'సరే పద' అన్నాను.

మేము నడుస్తూంటే "అవునూ! అందర్నీ గడగడలాడించే నువ్వు ఇలా నన్ను ఇంటి దగ్గర దింపమనడమేంటి?" అడిగాను మరికాస్త ధైర్యం కూడదీసుకుని.

కాస్సేపు 'చెప్పాలా వద్దా' అన్నట్టు తటపటాయించాడు. కాని "అన్నా నేను చెప్పేది నీ గుండెల్లో పెట్టుకోవాలె! ఎవ్వరికి చెప్పొద్దు. ఇప్పట్నుంచి నిన్ను మాత్రం నేను ఏమన. నాకు... నాకు కుక్కలంటే చాలా భయం అవి కరిస్తే బొడ్డు చుట్టూ ఇంజెక్షన్లు తీసుకోవాల. నాకు దేనితోటి భయం లేదు ఒక్క కుక్కతోటి తప్ప. అందుకే నాతో పాటు మా వోళ్ళని ఏసుకుని తిరుగుతుంట. ఈ రోజు 'పక్క ఊరిలో పని పడిందిరా రండిరా' అంటే ఒక్కడూ రాలేదు. దాంతో భయపడుకుంటూ అక్కడ పోల్ దగ్గర నుంచున్నా. దేవుడు నిన్ను పంపిండు. అన్నా... పొరబాట్న కూడా ఎవరికీ ఈ విషయం చెప్పకు. మాకేమన్నా సదువులా? నౌకరీలా? మందిమీద బ్రతికేటోళ్ళం." అన్నాడు బిక్కచచ్చిపోయి.

ధైర్యం ఇప్పుడు నన్ను నిలువెల్లా ఆవరించింది. గర్వంగా తల పైకెత్తి దర్జాగా నడుస్తున్నాను. వెనక పిల్లిలా వాడు. చాలు నాకీ తృప్తి చాలు.

వాడిని ఇంటిదగ్గర దింపి ముందుకు కదిలాను వాడోసారి చుట్టూ చూసి ఎవరూ లేరని నిర్ధారించుకుని "అన్నా చెప్పింది గుర్తుందిగా..." అన్నాడు.

నేను 'సరే' నన్నట్టుగా చిన్నగా నవ్వి మా ఇంటివైపు అడుగులేశాను.

మరుసటి రోజు ఆఫీసు నుండి వస్తూ ఒక జాతి కుక్కని వాడి ముందు నుండే క్రీగంట వాడి భయాన్ని గమనిస్తూ... మనసులో నవ్వుకుంటూ... ఇంటికొస్తున్నాను. వాడి చుట్టూ వున్న రౌడీ మిత్రులకి వాడు నన్నేం అనకపోవడం మింగుడుపడడం లేదు.

ఇహ నేను కుక్క నెందుకు కొన్నానా మీ డౌటు. ఏమో వాడి మనసు ఎప్పుడెలా వుంటుందో ఎలా తెలుస్తుంది? పైగా వాడి బలహీనత కూడా నాకు తెలిసిందాయే! అందుకే నా జాగ్రత్తలో నేనున్నా.




హలో, అమ్మా, అమ్మా, నేను ఫోన్లో అరుస్తూనే ఉన్నాను. అమ్మ మాట, సరిగ్గా వినబడటం లేదు. సిగ్నల్ ప్రాబ్లం అనుకుంటా. బస్ లో అందరూ నన్ను అదోలా చూస్తున్నారు.

అమ్మ పొద్దుట్నుంచి ఇది 3వ ఫోన్.

పొద్దున్న 10గంటలకి:

ఆఫీసు లో మీటింగ్ ఉన్నప్పుడు కాల్ చేసింది. ఏంటమ్మా అని అడిగాను, ఒకసారి ఊరికి వస్తావా నాన్నా అంది.

ఏ అమ్మ, అన్నాను.

నాన్న పరిస్థితి ఏమీ బాగాలేదు అంది.

నాకు ఏమీ అర్ధం కాలేదు, ఏమయ్యింది అన్నాను ఖంగారుగా,

ఏమీ లేదురా, తుఫానుకి చేనంతా పడిపోయిందిగా బెంగపెట్టుకున్నాడు, అంది. కొంచెం జ్వరంగా వుంది అంది.

సరే అమ్మ నేను సాయంత్రం బయల్దేరతాను అని చెప్పాను.

మధ్యాహ్నం రెండు గంటలు.

కేంటీన్ లో భోజనం చేస్తున్నాను.

అమ్మా చెప్పు, వద్దులే నాన్నా నువ్వు బయల్దేరకు అంది.

ఏమైంది అమ్మా అన్నాను నేను.

నువ్వొచ్చి మాత్రం ఏం చేస్తావు, ఈ బురదలో, మీ నాన్న కూడా తిట్టారు, వాడికెందుకు చెప్పావు అని అంది.

పర్వాలేదులే, ఇపుడే ఆఫీసులో చెప్పాను, రెండు రోజులు రానని, నాక్కూడా ఇంటికి రావాలనుంది, అన్నాను.

అయితే నీ ఇష్టం, అంది.

ఇప్పుడు ఊరు వెళ్ళే బస్ లో ఉండగా, మళ్ళీ ఫోన్ చేసింది, బహుశా బయల్దేరానో, లేదో, అని కనుక్కోవడానికి అయ్యుంటుంది.

పొద్దున్నే ఊళ్ళో దిగేప్పటికి, కొంచెం తుపర పడుతుంది.

నాన్న బస్టాండ్ లో గొడుగు పట్టుకుని నుంచుని ఉన్నారు.

అయ్యో మీరెందుకు వచ్చారు, నేను వచ్చేసేవాడిని కదా అన్నాను.

ఏమీ మాట్లాడలేదు, గొడుగు పట్టారు. ఆయనింతే ఏమీ మాట్లాడరు.

మా ఊరి గురించి నాకు బాగా తెలుసు, వానపడితే ఎలా ఉంటుందో, జాగ్రత్తగా చెప్పులు బ్యాగ్ లో కుక్కి, ప్యాంటు పైకి లాక్కుని నడుస్తున్నాను.

ఊళ్ళో తెలిసిన మొహాలు అన్ని పలకరిస్తున్నాయి.

ఇంటికెళ్ళి, నేను స్నానం చేసి వచ్చేప్పటికి, అమ్మ వేడిగా ఉప్మా తయారుచేసి పెట్టింది.

పొలం ఎలా ఉంది నాన్నా అని అడిగాను, మునిగిపోయిందని తెలిసినా.

బాగానే ఉంది, కావాలంటే వెళ్లి ఈత కొట్టుకుంటూ తిరుగు పొలం అంతా అన్నారు.

ఆయన మాటలు అలాగే ఉంటాయి.

రోజు రోజుకీ, వాతావరణాలు మారిపోతున్నాయి కదా, ఇంక వ్యవసాయాలు కష్టమే అన్నాను.

మనుషులు మారిపోతున్నారు, దానికి వాతావరణం జవాబు ఇది అన్నారాయన.

నీకో విషయం చెప్పనా, అన్నారు.

చెప్పండి, అని ఎదురుగా కూర్చున్నాను.

ఈ సంవత్సరం కాలవలు వస్తాయో లేదో అనుకుంటూనే, అందరూ పంటలు వేసారు, దురదృష్టం, కాలువలు వచ్చాయి. పొలాల్లో పనిచేయట్లేదు గాని, అదేంటో విచిత్రం, మనూళ్ళో ఒకళ్ళిద్దరు మీద బాగానే పనిచేశాయి, పురుగుల మందులు. చచ్చారు సన్నాసులు.

మొన్నా మధ్య M. L. A గారు వచ్చినప్పుడు చెప్పారు, అదేదో వరి పండించే దేశంలో మొత్తం మునిగిపోయిందంట. కాబట్టి ఈ సంవత్సరం మనకు రేట్లు బాగానే వస్తాయి, అన్నారు. అందరూ ఆనందించారు. బహుశా ఆ దేశంలో రైతులు తప్ప. ఆశలు ఎక్కువ ఆవిరి అయ్యిపోవడం వల్లో ఏమో, ఇక్కడ కూడా వానలు బాగానే పడ్డాయి. ఎంతగా అంటే, మొత్తం మునిగి పోయేంతగా, అని చెప్పి ఆపారు.

పోన్లేండి నాన్నా, మీరు కూడా పొలం ఎవరో ఒకరికి కౌలికి ఇచ్చేసి, నాతో వచ్చేయండి అన్నాను. నేను పొలం వెళ్తున్నాను, అన్నారాయన.

ఇంకేం ఉంది, మొత్తం మునిగిపోయాక, అన్నాను నేను.

కొన ఊపిరిలో ఎవరైనా ఉంటే చూస్తూ ఊరుకోలేం కదా, ఇదీ అంతే, నీళ్ళు ఏమన్నా తగ్గాయేమో చూసొస్తా, అన్నాను.

ఆగండి, నేనూ వస్తానని, ఆయన వెనకాలే బయల్దేరాను.

ఇంటికి ఒకళ్ళు చొప్పున, పొలం వెళ్ళే వరకు, ఎవరో ఒకళ్ళు పలకరిస్తూనే ఉన్నారు.

పొలం దగ్గరికి వచ్చాము. నిజంగానే ఈత కొట్టుకోవచ్చు.

నీళ్ళు ఏమైనా తగ్గాయా, అని అడిగాను.

లేదు అన్నారాయన.

ఆ నీళ్ళల్లోనే రెండు మూడు గట్లు తవ్వారు. ఆయన పిచ్చిగానీ, పక్కపొలాల్లో నీళ్ళు ఉన్నప్పుడు, మా పొలంలో నీళ్ళు ఎక్కడికి వెళ్తాయి. నేను గట్టు మీద నుంచుని ఉన్నాను. పొలం అంతా తిరిగి, నాదగ్గరకి వచ్చి నుంచున్నారు.

నిన్ను చిన్నప్పుడు జీవితంలో ఒక్కసారే చూసాను. కానీ ఈ చేనుని మాత్రం సంవత్సరానికి రెండు సార్లు పెంచుతాను. నా కళ్ళ ముందు నేను చల్లిన విత్తనాలికి, నేల పురుడు పోసుకోవడం, అది పెరిగి పెద్దదవడం. నువ్వంటూ ఉంటావు చూడు, నాతో వచ్చేయండి నాన్నా అని ప్రేమగా, అలాగే అది కూడా అభిమానంతో పంట ఇచ్చేసి చచ్చిపోతుంది. కానీ దాన్ని కోసేసాం అన్న బాధ, నాకు రాదు, ఎందుకంటే నేను మనిషిని, అది నా పిల్లల్ని పెంచుకోవడానికి ఉపయోగపడే అవసరం, అన్నారు.

ఇంతలో మాదగ్గరికి ఒక నలుగురైదగురు చేరారు.

ఎవరండి ఈయన అని అడిగారు.

వీళ్ళని ఇంతకుముందు ఎప్పుడు ఊళ్ళో చూసిన జ్ఞాపకం లేదు. కాని మా ఊళ్ళో, నన్ను ఎవరు అని అడుగుతా ఉంటే చిరాగ్గా అనిపించింది.

మా అబ్బాయి, అని చెప్పారు నాన్నా.

వాళ్ళు వెళ్ళిపోయారు, నన్ను ఎవరు అనిఅడుగుతున్నారు. వీళ్ళెవరు నాన్న, అన్నాను.

వీళ్ళది శ్రీకాకుళం దగ్గరంట, ఆళ్ళ ఊళ్ళో ఏదో కంపెనీ పెడతామని, పొలాల్ని ప్రభుత్వం వాళ్ళు, తీసేసుకుంటే, తుఫాను గాలిలో ఎగిరిన ఆకు, ఎక్కడో పడ్డట్టు. వీళ్ళు ఇక్కడ పడ్డారు. పనులు చేసుకుంటా బతుకుతున్నారు, అన్నారు.

గవర్నమెంట్ డబ్బులు బాగానే ఇచ్చుంటుందిగా, అన్నాను.

ఆ బాగానే ఇస్తుంది. 4లక్షల పొలానికి, లక్ష రూపాయలు. ఆ పొలం కోసం చేసిన అప్పులుకి సరిపోతాయి ఆ డబ్బులు. రైతు కాస్తా, కూలిగా మారిపోయాడు, వాళ్ళ దెబ్బకి.

పోన్లేండి, అన్నాను.

కాని పంటకి పనికిరాని భూమిని కంపెనీలకి ఇస్తే ఫర్వాలేదుగానీ, ఇలా పంట భూములని అభివృద్ధి పేరుతో తగలేస్తే, రేపు మీ పిల్లలు తినడానికి గింజలు దొరకవు భూమ్మీద. అన్నారాయన.

ఆ రోజంతా, ఊళ్ళో చుట్టాలింటికి వెళ్ళడం. ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళడంతో సరిపోయింది.

సాయంత్రం వెళ్ళిపోతున్నావా, పొద్దున్న ఇంటి ముందు కూర్చుని టీ తాగుతూ ఉంటే, అడిగింది అమ్మ.

మరి వెళ్ళక ఈ బురదలో వాణ్ణేమి చెయ్యమంటావ్, అన్నారు నాన్న.

నేను వెళ్ళడం సంగతి పక్కన పెట్టండి. నేను ఈరోజు అంతో ఇంతో చదువుకున్నానన్నా, ఏదో ఉద్యోగం చేసుకుంటున్నానన్నా, మీరు, ఆ పొలమే కారణం. కానీ ఇంక, ముందు ముందు ఎరువులు దొరకడం కష్టం, వానలు ఎప్పుడు పడతాయో తెలవదు. ఇంక వ్యవసాయాలు మానేసి నాదగ్గరికి వచ్చేయండి అన్నాను.

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

శ్రీకాకుళం వాళ్ళు మన ఊరొచ్చినట్టు, నువ్వు వేరే ఊరెళ్ళావు. రేపు ఇంకా మంచి అవకాసం వస్తే, ఇంకో దేశం వెళ్తావు. తరువాత అందరం ఇంకో లోకానికి పోతాము. వ్యవసాయం చేస్తా వుంటే వున్న ఆనందం, బహుశా ఆ సిటీలో మాకు ఉండదు. అన్నారాయన.

వాళ్ళకి అక్కడే ఆనందం ఉన్నప్పుడు, నేను వాళ్ళకి జాగ్రత్తలు కూడా చెప్పాల్సిన అవసరం లేదనిపించింది.

సాయంత్రం బయల్దేరి వచ్చేసాను.

పొద్దున్నే రూంకి వెళ్ళే ముందు, పేపర్ కొన్నాను. తుఫానులో మునిగిపోయిన పొలాలకి గవర్నమెంటు నష్టపరిహారం ఇచ్చింది. ఎకరానికి ఎనిమిది వేలు. నాకు నవ్వాగలేదు, మా నాన్న ఖర్చుపెట్టింది 25వేలు పైనే, ఎకరానికి. ఈ గవర్నమెంటు ఇచ్చే ఎనిమిది వేలలో, మా నాన్నకి వచ్చేదెంతో దేవుడికే తెలియాలి.




'ఆడియో వరల్డ్' ముందు నుంచి వెళుతుంటే ఆ పాట నన్ను అమితంగా ఆకర్షించింది

నాది చాలా షార్ప్ బ్రెయిను.

అందుకే - నాగస్వరం చెవినబడ్డ నాగుపాములా ఠక్కున నిలబడిపోయాను.

'వెయ్యిదయ్యాలు' ఒకేసారి అరుస్తున్నట్టు చాలా వికృతంగా ఉందా పాట.

ఒకింతసేపు చెవులు దిక్కరించి ఆలకించిన మీదట అప్పుడర్థమైంది నాకు - అది తెలుగు పాటేనన్న సంగతి.

తెలుగుని ఇంత భయంకరంగా కూడా పాడొచ్చన్నమాట అనుకున్నానాశ్చర్యంగా.

ఒంటి మీద జర్రులు పాకుతున్నట్టు... గుండెకాయ మీద మరిగిన నూనె చుక్కలు పడుతున్నట్టు... శరీరంలోని నరాలన్నిటినీ బ్లేడుతో కోస్తున్నట్టు... నవరంధ్రాల్లోనూ సిరెంజితో నువాక్రాన్ ఎక్కిస్తున్నట్టు... ఎలాగో... ఎలాగో... అనిపించింది నాకా పాటని వింటుంటే.

ఓర్నాయనోయ్... ఎంత ఘోరంగా ఉందీ పాట!

ఎవడు స్వరపరిచాడో గానీ నిజంగా వాడికి సాగిలపడి మొక్కినా తప్పులేదు.

ఎవడు రాశాడో గానీ, నిజంగా వాడికి గండపెండేరం గొంతుకి తొడిగినా తప్పులేదు.

ఇంతనీచమైన పాట ఏ సినిమాలో దయ్యుంటుందబ్బా?

దీనికి ఏనర భయంకరుడు కుప్పిగంతులు వేసుంటాడబ్బా?

ఏ సినిమాలోదైతే ఏం? కుప్పిగంతులు వేసింది ఎవడైతే ఏం?

ఆ వివరాలన్నీ అనవసరం! ఆడియో... ఆడియో ముఖ్యం గాడి మల్లబోయిన మనసుని రైట్ ట్రాక్ లో పెట్టి, చకచకా ఆ షాపులోకి దారితీశాను.

"ఆ సి.డి కావాలి?" అడిగాను షాపువాడిని.

"ఏ సి.డి సార్?" ఎదురుప్రశ్న వేశాడతను.

"ఆ వినిపిస్తున్న పాటే..." అన్నాను నవ్వుతూ.

బహుశా నాది చాలా పూర్ టేస్టని వాడనుకున్నాడో ఏమో - నాకేసి అదోలా చూశాడు.

చూసి "అలాగే సార్" అన్నాడు వినయంగా...

"ఇంతకీ అది సినిమా పాటేనా?

"అవున్సార్! నటవీర కిశోరం గారి రెండొందల పదో సినిమా 'నీ దుంప తెంచుతా!' ఇంకా రిలీజ్ కాలా! కానీ ఆడియో మాత్రం అప్పుడే ఫట్టయిపోయింది... సారీ... సారీ... సార్... హిట్టయిపోయింది..." ఒక ర్యాక్ లోంచి ఆ సి.డి ని బైటకు తీస్తూ చెప్పాడు షాపువాడు.

"మిగతా పాటలన్నీ కూడా ఇలాగే ఉంటాయా?"

"ఇంతకన్నా ఇంకా అసహ్యా... కాదుకాదు... శ్రావ్యంగా ఉంటాయ్..." చెప్పాడు షాపువాడు మధ్యలో ఓ మారు నాలుక్కరుచుకుని.

అతనలా నాలుక్కరుచుకున్నందుకు నాకు నవ్వొచ్చింది.

అసలు నాకు ఆపాట నచ్చింది - అది అసహ్యంగా ఉండబట్టే కదా! మిగతా పాటలు అంతకన్నా అసహ్యంగా ఉండేట్టయితే అంతకన్నా కావాల్సింది ఏముంది?

"ఎంత?" అడిగాను సి.డి ని అతని చేతిలోంచి అందుకుంటూ.

"ముప్పయ్యారు"

"ఓస్... ఇంతేనా?" అంటూ ఆ సి.డి ని ఫ్యాంట్ జేబులో పడేసుకుని, షర్ట్ జేబులోంచి ఓ యాభై నోటు తీసి అతని కందించాను.

అతను సొరుగులోంచి చిల్లర తియ్యబోతుంటే "అక్కర్లేదు... ఉంచేసుకోండి..." అని చెప్పి హుషారుగా ఈల వేసుకుంటూ ఆ షాపులోంచి బయటపడ్డాను.

నేను వెనక్కి తిరిగి చూడలేదు గానీ, బహుశా అతను నాకేసి చాలాచాలా ఆశ్చర్యంగా చూసుంటాడు.

****　　****　　****　　****

"అప్పుడే వచ్చేశారేంటి? శంకర్రావు దగ్గరికి వెళ్ళలేదా?" నన్ను చూసి ఆశ్చర్యంగా అడిగింది మా ఆవిడ.

మా ఇల్లు నల్లకుంటలో - శంకర్రావు వుండేది ఆల్వాల్ లో... ఎంత లేదన్నా అక్కడికి వెళ్లి రావడానికి మూడు గంటలైనా పడుతుంది.

అలాంటిది అరగంటైనా కాకముందే తిరిగొచ్చేశానూ అంటే. "అప్పు" కోసం శంకర్రావు దగ్గరికి వెళ్ళలేదనేగా అర్థం.

"లేదు..." అన్నాను చిన్నగా నవ్వి వెళ్లి సోఫాలో కూలబడుతూ.

"మరి డబ్బెలా? వాళ్లింకా ఓ పదిహేను రోజులు ఉండేలా ఉన్నారు..." అంది మా ఆవిడ గాబరాగా.

"ఉండరు! అది సరే గానీ... ఇంతకీ వాళ్ళంతా ఏరీ?" అనడిగాను. ఇల్లంతా బోసిగా ఉండటం గమనించి.

"బిర్లామందిర్ చూసొస్తామంటూ వెళ్లారు..." మా ఆవిడ ఇంకా చెబుతూనే ఉంది - అంతలోనే ఇంటిముందు మూడు ఆటోలు ఆగాయ్.

ఆగిన ఆటోల్లోంచి పొలోమంటూ క్రిందకు దిగారు. గత పదిహేనురోజులుగా మా ఇంట్లో తిష్టవేసుక్కూర్చున్న చుట్టాలందరూ.

వాళ్ళని చూస్తుంటే నాకు మేకల మంద గుర్తొచ్చింది.

నేను వెంటనే మా డి.వి.డి ప్లేయర్ దగ్గరికి పరుగుతీసి "నీ దుంప తెంచుతా" సి.డి ని అందులోకి ఇన్ సర్ట్ చేశాను.

****    ****    ****    ****

ఓ ఇరవై నాలుగంటల పాటు "నీ దుంప తెంచుతా" పాటలు మా ఇంట్లో అవిశ్రాంతంగా మోగాక...

నేనూహించినట్టే మా చుట్టాలంతా మూటా ముళ్ళు సర్దుకుని - "అప్పుడేనా?" ఇంకో నాల్రోజులుండొచ్చుగా? మనకి అందుబాటులోని 'థియేటర్లు' రెండింటిలో కొత్త సినిమాలు "గంపలోన గంగ ప్రేమికుడు, గత్తర పెట్టిన తత్తర బిత్తరగాడు" వస్తున్నాయ్. చూసుకొని పోవచ్చుగా?" అని మేం బ్రతిమాలుతున్నా వినిపించుకోకుండా ఉడాయించేశారు.

ప్రస్తుతం రాహుకాలం అన్నా ఆగలేదు.

ప్రస్తుతం యమగండం అన్నా వినలేదు.

"నీ దుంప తెంచుతా" కి సంగీతం సమకూర్చిన, ఆ పాటలు పాడిన - ఆ మహానుభావులు...



"భలే మంచిరోజు... పసందైన రోజు..." అని ఆనందంగా పాడుకుంటూ ఆదివారం తీరుబడిగా నిద్ర లేచాడు చందు. ఆలస్యంగా లేవడానికి కారణం ఆరోజు ఆఫీసుకి సెలవవడం వల్లకాదు... నిన్న సాయంత్రం ఇందూ చేసుకొచ్చిన పని అతన్ని రాత్రంతా నిద్ర పోనివ్వలేదు.

ఎన్నడూ లేనిది నిన్న సాయంత్రం చంద్రం భార్య ఇందుమతి పని కట్టుకుని రైతుబజార్ కి వెళ్ళి రెండు పెద్ద సంచీలనిండా కూరలు కొనుక్కొచ్చింది. ధరలు చుక్కల నంటుతున్న ఈ రోజుల్లో ఏ కూర కూడా పావు కిలో కన్నా ఎక్కువ కొనని ఇందు యేకంగా రెండు సంచీలనిండా కిలోలక్కిలోలు కూరలు కొనితేవడం చూసి సంబరపడిపోయాడతను. సహజంగా భోజనప్రియుడవటం చేత వరసగా నాలుగురోజులు షడ్రసోపేతమైన విందుభోజనానికి మానసికంగా సిధ్ధపడిపోయాడు.

ఇందుమతి చెయ్యి సాక్షాత్తూ అన్నపూర్ణ హస్తమే. కూరలో ఆవ పెట్టిందంటే ఆ ఘుమ ఘుమ ఇల్లంతా సందడి చేస్తుంది. దప్పళంలో ఇంగువపోపు వేసిందంటే అందులోని ఆవాల చిటపటలు మూడు వీధులు వినిపిస్తాయి. మరింక నూనెలో ముక్క వేస్తేనా... నా సామిరంగా... చుయ్యి చుయ్యి మంటున్న ఆశబ్దానికే నోట్లో నీళ్ళూరిపోతాయి.

యేంటో ఈ మధ్య శుభ్రంగా భోంచేసి యెన్నేళ్ళయిందో అనుకుంటూ పడుకుంటే రాత్రంతా కలలలో కమ్మటి గుత్తివంకాయలు, ఆవపెట్టి, వడియాలు వేసిన పనసపొట్టు కూర, నోరూరించే మామిడికాయ పప్పూ, ఘుమఘుమలాడిపోతున్న ముక్కల పులుసూ వరసగా వస్తూనే వున్నాయి.

ఉదయాన్నే టీపాయ్ మీదకి కాళ్ళు జాపుకుని కూర్చుని, కాఫీ తాగుతూ రాత్రి వచ్చిన కలలని నెమరేసుకుంటున్న చందూకి,

"ఆటో వచ్చిందా?" అని ఇందూ పనిపిల్లని అడగడం వినిపించింది.

యేమిటా అని చూస్తే పనిపిల్ల ఆ రెండు పెద్ద కూరగాయల సంచీలూ మోసుకెళ్ళి ఆటోలో పెట్టేసివచ్చింది.

తెల్లబోయి చూస్తున్న అతనితో "నేను వచ్చేటప్పటికి సాయంత్రం అయిపోతుంది. ఈ పూటకి బైట యెక్కడైనా భోంచేసెయ్యండి.." అంది ఇందూ పర్సులో డబ్బూ, సెల్ ఫోనూ వున్నాయో లేవో చూసుకుంటూ.

"ఆ సంచులు మనవి కాదా..?" తన ప్రాణం వాటిల్లో వెళ్ళిపోతున్నంత బాధతో అడిగేడు చందూ.

"మనవే. రమా వాళ్ళింటి దగ్గరి కమ్యూనిటీహాల్ కి వెడుతున్నాను."

“అక్కడేదైనా ఫంక్షన్ పెట్టుకున్నారా?"

ఫ్రెండ్సందరూ కలిసి వండేసుకుని, తినేస్తారేమో అన్న దుగ్ధతో అడిగేడు. వారి చేతిలో విద్యేకదా...

"కాదు. ఇవాళ అక్కడ వెజిటబుల్ కార్వింగ్ లో పోటీ వుంది. ఎవరి కూరలు వాళ్ళే తెచ్చుకోవాలి. అన్నట్టు బైట కెడుతున్నప్పుడు తలుపులన్నీ జాగ్రత్తగా వెయ్యండేం..." అంటూ ఆటో యెక్కి వెళ్ళిపోయింది.

యేవిటీ... వెజిటబుల్ కార్వింగా? అంటే అవన్నీ తినడానికి కాదా... ఒట్టినే అలంకరణకేనా...

సాయంత్రం ఇందూ చేటంత మొహంతో, చేతిలో ఫస్ట్ ప్రైజ్ తో, అలసిపోయినా మెరుస్తున్న కళ్ళతో, ఖాళీ అయిన రెండు పెద్ద సంచులతో వచ్చింది ఇంటికి. ఎంతో సంబరంగా ఆ ప్రైజ్ ని చందూ చేతిలో పెట్టి, గర్వంగా చూసింది.

పాపం చందూ ప్రైజ్ ని చూసి సంతోషించాలో... ఖాళీ అయిన రెండు పెద్ద సంచుల్ని చూసి దుఃఖపడాలో తెలీక అలా నిలబడిపోయాడు.




"వాడు మళ్ళీ నా విషయంలో వేలు పెట్టాడు" విస్కీ బాటిల్ కింద పెడుతూ చెప్పాడు రాకేష్. స్టఫ్ రెడీ చేస్తున్న రాజేష్ "ఎవరూ ఆ ఏకాంబరం గాడేనా" అన్నాడు.

"అవును వాడే. నా ఫ్యాక్టరీ వలన పర్యావరణానికి ముప్పు అట. జనాల్ని వెంటేస్కుని వచ్చి గొడవ చేస్తున్నాడు". కోపంతో చెప్పాడు రాకేష్. "ముప్పుని, నిప్పుని ఎలా ఆర్పాలో ఈ రాజేష్ కి తెలుసు" సిగరెట్ ని ఆర్పేస్తూ అన్నాడు రాజేష్. "అంటే" ప్రశ్నార్ధకంగా చూసాడు. "అంటే ఏమి లేదు. చంపెయ్యడమే" అన్నాడు రాజేష్. "ఇప్పుడు వాడిని చంపేస్తే జనాలు నన్నే అనుమానిస్తారు" చెప్పాడు రాకేష్. మళ్ళీ తనే "వాడు వారం రోజుల్లో నా ఫ్యాక్టరీని మూసెయ్యమని వార్నింగ్ ఇచ్చాడు. జనాల దృష్టిలో వాడు మంచోడు. నేను విలన్ ని. ఇప్పుడు వాడిని చంపేస్తే ఇంకొక కష్టము తెచ్చుకున్నట్లే". చెప్పాడు రాకేష్.

"మంచోళ్ళని దేవుడు ఎక్కువ కాలం బ్రతకనీయడు. తన పేరు ఎక్కడ పోతుందోనని దేవుడికి భయం. నువ్వేమి భయపడొద్దు నాకు తెలిసిన ప్రొఫెషనల్ కిల్లర్ వాసుదేవ్ వున్నాడు. వాడు చంపితే అది హత్యలా వుండదు. చాలా సహజంగా పోయినట్లు వారావరణాన్ని క్రియేట్ చేస్తాడు." చెప్పాడు రాజేష్.

రాజేష్, రాకేష్ లు వాసుదేవ్ వున్న చోటికి వెళ్ళారు. స్మార్ట్ గా ఇన్ షర్ట్ చేస్కుని ఫ్రెంచ్ బియర్డ్ తో చూడగానే ఆకట్టుకునే రూపం వాసుదేవ్ ది. అతనిని చూడగానే రాజేష్ కి మతిపోయింది. ఎందుకంటే హత్యలు చేసేవాడు గళ్ళలుంగీ, చారల బనియన్, ముఖం పై కత్తిగాటు పులిపిరికాయతో వుంటాడని ఊహించుకున్నాడు.

హత్యలు చేసేవాడి దగ్గరికి తీసుకెళతానని చెప్పి ఈ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ దగ్గరికి ఎందుకు తీసుకువచ్చావ్? రాకేష్ చెవిలో గుసగుసగా చెప్పాడు రాజేష్...

"నీ డౌటు అర్ధమైంది. చూడడాన్కి సాఫ్ట్ గా వున్న మనిషి చాలా హార్డ్..." అన్నాడు రాకేష్. వీళ్ళిద్దరినీ చూసి వాసుదేవ్ నవ్వుతూ విష్ చేసాడు.

"నేను చంపాల్సిన అతని ఫోటో ఇస్తారా? అడిగాడు వాసుదేవ్." రాజేష్ జేబులో నుండి ఏకాంబరం ఫోటో ఇచ్చాడు. "నా పేరు బయటకు రాకూడదు" చెప్పాడు రాజేష్. "నా పేరు కూడా బయటకు రాదు" నవ్వుతూ చెప్పాడు వాసుదేవ్. హత్యలు చేసేవాళ్ళు ఇలా కులాసాగా నవ్వుతూ మాట్లాడుతారని అస్సలు అనుకోలేదు రాజేష్. వాసుదేవ్ అసిస్టెంటు మళ్ళీ ఇద్దరికీ 'టీ' లు ఇచ్చాడు. "సారీ... నేను మందు తాగను ఎప్పుడన్నా టీ... కాఫీ మాత్రము తీస్కుంటాను" చెప్పాడు వాసుదేవ్.

వాసుదేవ్ తన అసిస్టెంటును పిల్చి "హైద్రాబాద్ పరిధిలో కూలడానికి సిద్ధంగా వున్న ఇళ్ళు, హోటల్స్ లిస్టు తెప్పించమన్నాడు."

"చూడండి రాజేష్ గారు వెంటనే వేట కొడవళ్ళతోవేటాడి చంపను. నా స్టైల్ వేరు. ఆయా కాలాల్ని బట్టి సందర్భాలని బట్టి చంపుతుంటా. అడ్వాన్సు లక్ష. పని అయిన తర్వాత లక్ష ఇవ్వండి. కౌంటర్ లో అడ్వాన్సు కట్టెయ్యండి. ఏకాంబరం పోయాడన్న విషయం టీవిల్లో వచ్చిన తర్వాతే మిగతా అమౌంట్ పే చెయ్యండి. ఇంకొక విషయం నాకు వీడిని చంపడానికి ఒన్ ఆర్ టూ మంత్స్ టైం కావాలి" చెప్పాడు. రాజేష్ రాకేష్ లు సరేనన్నారు.

"అన్నా! జి.హెచ్.ఎం.సి లెక్కల ప్రకారం సిటీలో 58 పాత బిల్డింగ్ లు కూలడానికి సిద్ధంగా వున్నాయి. ఇందులో నలభై రెండు, రెండతస్థుల మిద్దెలు. రెండు షాపింగ్ మాల్ లు మిగతా పద్నాలుగు హొటల్స్ వున్నాయి. ఇందులో ఒక నెలలో కూలిపోవడానికి

సిద్ధంగా మూడు హోటల్స్ వున్నాయి. అవి సికింద్రాబాద్ లో ఒకటి. పాతబస్తీ లో ఒకటి, చిక్కడపల్లి లో ఒకటి వున్నాయి" చెప్పాడు వాసుదేవ్ అసిస్టెంటు.

"మిస్టర్ రాజేష్ ఏకాంబరం వుండేది ఏ ఏరియాలో" అడిగాడు వాసుదేవ్. "సికింద్రాబాద్" చెప్పాడు రాజేష్.

ఇద్దరూ అడ్వాన్సు కట్టి బయటికొచ్చారు. "వీడు మన విషయం పట్టించుకోకుండా కూలడానికి సిద్ధంగా వున్న బిల్డింగు విషయాలు అడుగుతున్నాడు. ఏమైన వీడికి సీరియస్ నెస్ తక్కువ" అన్నాడు రాకేష్. "చూద్దాం. వీడు తన స్టైల్ డిఫరెంట్ అంటున్నాడుగా" చెప్పాడు రాజేష్.

రాకేష్, రాజేష్ మందు పార్టీలో కూర్చుని మందు తాగుతూ టీవి చూస్తున్నారు. "వాడికి అడ్వాన్సు ఇచ్చి నెల అవుతుందా. ఆ ఏకాంబరాన్ని ఎప్పుడు వేసేసి ఫోన్ చేస్తాడా చూస్తుంటే ఆ వాసుదేవ్ గాడు అడ్రస్ లేడు" కోపంతో అన్నాడు రాజేష్... "ప్రముఖ సామాజికవేత్త ఏకాంబరం దుర్మరణం సికింద్రాబాద్ లోని పురాతన హొటల్ లో ఛాయ్ కోసం వెళ్ళి దుర్మరణం చెందాడు" అని టీవిల్లో స్క్రోలింగ్ లు వస్తున్నాయి.

ఎక్కిన మందు దిగినట్టయింది. "రేయ్ ఆ వాసుదేవ్ గాడికి ఫోన్ చేసి ఆ లక్ష అడ్వాన్సు వెనక్కి ఇచ్చెయ్యమను. దేవుడే ఆ ఏకాంబరాన్ని చంపేశాడు." పెద్దగా అరిచాడు ఆనందంతో రాజేష్...

"చంపింది దేవుడు కాదు. వాసుదేవ్. ఇదిగో ఫోన్ వాసుదేవ్ లైన్లో వున్నాడు. ఇంకో లక్ష రడీ చేసుకోమంటున్నాడు" చెప్పాడు.

"బ్రదర్... ఇదే నా స్టయిల్ చాలా నేచురల్ గా వుంటుంది. ఆ ఏకాంబరంతో ఫ్రెండ్షిప్ చేసా... చాయ్ తాగడానికి రోజు ఆహొటల్ కి వెళ్ళేవాడిని వర్షాలు బాగా పడుతుండడంతో నా పని ఈజీ అయ్యింది. నా అంచనా ప్రకారం ఇంకో అయిదు నిమిషాల్లో ఆ హొటల్ కూలి పోద్దని నాకు తెలుసు. చాయ్ ఆర్డరిచ్చి బయటకు వచ్చాను... నెక్స్ట్ ఏం జరిగిందో టీవిల్లో చూసే వుంటారు. పేమెంట్ చెయ్యండి. వుంటాను బై" అంటూ ఫోను పెట్టేశాడు వాసుదేవ్...




సుధాకర్ కొంచెం ఆలశ్యంగా ఇల్లు చేరాడు. అతని కోసం ఎదురు చూస్తున్న అతని శ్రీమతి సత్య ఎదురొచ్చి చెప్పింది.

"ఏవండోయ్ బుజ్జిగాడు కాలు గోకిన వాడు గోకినట్లే వున్నాడు - పాదం గీక్కున్నవాడు గీక్కున్నట్లే ఉన్నాడు."

"బుజ్జిగాడికి హోమ్ వర్క్ యివ్వలేదా?" కౌంటర్ వేశాడు.

"ఇచ్చారు గాని - వాడి మనసంతా కాలుమీద, గోకుడు మీద ఉంది." సత్య.

స్నానం చేసి కొంచెం రిలాక్స్ అయి బుజ్జిగాడిని దగ్గరికి తీసుకున్నాడు - వాడికి ఐదు పూర్తి కాలేదు. యల్.కె.జి. యు.కె.జీలు ముగించుకుని ఒకటో క్లాసులోకి వచ్చి పడ్డాడు. బుజ్జిగాడికి పేరు ఉంది - శీను.

సుధాకర్ అంతకు ముందు అనంతపురంలో అఘోరించేవాడు. అయిదేళ్ళు అయిపోయిందని బలవంతాన అతన్ని ఈ ఊరికి బదిలీ చేసారు. ఉద్యోగికి దూరం లేదని - ఉండకూడదని తెల్సుకుని పెట్టే బేడా - భార్య - పిల్లాడితో కల్సి ఈ ఊళ్ళో కాపురం పెట్టాడు. అది మండలం హెడ్ క్వార్టర్స్ అయినా పెద్దగా వసతులు లేని ఊరు. ఆధునికతను అరువు తెచ్చుకోవాలని - ఎరువులు మింగి ఒక్కసారి పైకి లేవాలని చూస్తున్న ఊరు.

ఆ ఊళ్ళో కాపురం వెలుగ బెట్టి రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. కొత్త వాతావరణం - కొత్త ఊరు - కొత్త గోల! అసలే రాయలసీమ ఫ్యాక్షన్లకు పేరు పడింది. సినిమాల పుణ్యం వలన ప్రపంచం మొత్తానికి తెల్సింది. అందుకని బిక్కు బిక్కుమంటూ బ్రతుకు ఈడుస్తూ ముక్కు మూసుకుని తన డ్యూటీ తను చేసుకుని వీలైనంత పెందరాలే - యిల్లు చేరుకుంటాడు బ్యాంకు నుండి.

శీనును ఆడించాడు. కథలు వినిపించాడు. - పాటలు పాడించాడు. కాని వాడి ఒక చెయ్యి ఎప్పుడు కాలు మీదో - పాదం మీదో గీరుతూనే ఉంది.

మందలించాడు. చెయ్యి పట్టుకుని ఆపాడు - వాడు ఏడ్పు మొదలెడతాడు.

"ఏవండీ! వాడికి ఎందుకు దురద వచ్చింది?" సత్య ప్రశ్న.

"రోజూ స్నానం చేయించడం లేదా?" సుధాకర్ అనుమానం కలిగింది.

"రోజూ రెండు పూటలా లాల పోసుకుంటాడు - ఏరా శీను లాలా -" అంటూ పాడింది.

శీనుగాడు తలూపాడు - ఇంకొంచెం గీక్కున్నాడు.

"ఒరే బాబు! ఎందుకు గీకుతావు - కాస్త ఆపు!" గద్దించాడు సుధాకర్.

"ఊ!" అని వాడు బిక్కుమొహం పెట్టి దూరంగా పోయాడు.

"కాలికి కొబ్బరి నూనె రాయకపోయావా?" అడిగాడు.

"అయింది - అదీ అయింది - నాకు చేతనైన గృహ వైద్యాలు చేసాను - ఫలితం కనపడలేదు. ఏమండీ వీడికేమన్నా గజ్జి తామర లాంటి అంటువ్యాధులు వస్తున్నాయంటారా?" భయంగా అడిగింది.

"ఛీ! ఛీ! అలా ఎందుకనుకుంటావు?"

"నాకేదో భయంగా ఉంది - ఈ గీకుడుతో ఒళ్లంతా పుళ్ళు పడిపోతున్నది."

"ప్రికిల్ పౌడర్ వెయ్యి - రేపటికి తగ్గకపోతే డాక్టరు దగ్గరికి తీసుకెళతాను" హామీ యిచ్చాడు.

"కాని ఈ పిచ్చి ఊళ్ళో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందిటగా! వీడ్ని పట్నం తీసుకుపోలేమా!" సందేహించింది సత్య.

"ఇంత చిన్నదానికి అంతదూరం ఎందుకులే. ఈ మధ్యే ఈ ఊళ్ళో కొన్ని కోట్లు ఖర్చుపెట్టి ఓ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించారట - దానిలో చూపించుకుంటే యిట్టే తగ్గిపోతుంది -" చెప్పాడు.

ముస్లిం పండుగ ఉన్న కారణాన మరునాడు బ్యాంకుకు హాలిడే! బుజ్జిగాడు గోకుడు ఏమాత్రం తగ్గలేదు. అదేదో సీరియసు గేములాగా ప్రాక్టీసు చేస్తున్నాడు. సత్య కన్నీళ్ళ పర్యంతమై వారిస్తున్నది - వాడు వినడం లేదు.

పది గంటలకు శీనుని తీసుకుని - సత్యతో కల్సి ఆ కొత్త ఆసుపత్రికి తీసుకొచ్చాడు....

ఎంక్వయిరీలు వగైరాలు అయింతర్వాత డాక్టర్ పిచ్చేశ్వర్రావు యమ్ డీ ఎక్స్ట్రా ఎక్స్ట్రా ముందుకు వచ్చారు.

డాక్టర్ పిచ్చేశ్వర్రావు బాబును బల్లమీద పడుకోబెట్టాడు. గుండ్రంగా అతని చుట్టూ తిరిగాడు - స్టెత్ తో అతని ఊపిరితిత్తులు - గుండెకాయ పరీక్షించాడు. ఏమీ అర్ధంగాక కాలిమీద కూడా సుత్తితో కొట్టాడు - స్టెత్ తో కాలును పరీక్షించాడు. దాంతో శీను ఆరునొక్కరాగం అందుకున్నాడు.

డాక్టర్ పిచ్చేశ్వర్రావు కూడా శీను కంటే గట్టిగా ఏడ్పు నటించాడు. దాంతో వాడు భయపడిపోయి ఏడ్పు ఆపి విచిత్రంగా చూడసాగాడు.

"బాబూ - నేను అడిగే ప్రశ్నలకు బాగా ఆలోచించి జవాబు చెప్పు!" పిచ్చేశ్వర్రావు సీరియసుగా బాబును అడిగాడు పరిశీలిస్తూ.

"నీకు దురద ఎక్కడుంది?"

"కాలిమీద -"

"గుడ్! ఇంటలిజెంట్ బాయ్ వి! ఎందుకు గోకుతావు?"

"దురద వేస్తున్నది కాబట్టి!"

"ఎందుకేస్తున్నది -"

"గోకుతాను కాబట్టి -"

"గుడ్! గుడ్! గోకడం ఆపి చూడు - ఏమవుతుంది?"

"దురద పుడుతుంది - గోకంది ఊపిరాడదు" శీను చెప్పాడు.

"యూసీ! సంథింగ్ సీరియస్సు! మీ పేరేమన్నారు?" అడిగాడు డాక్టరు.

"నా పేరు సుధాకర్ అండి - ఈమె నా భార్య సత్య అండి -" చెప్పాడు.

"చూడండి సుధాకర్ గారు - ఎంత డీప్ గా పరీక్షించినా అస్సలు పాయింటు నాకు తట్టడం లేదు - మన పెద్దలేమన్నారు?" అడిగాడు అతని కళ్ళల్లోకి చూస్తూ.

"నాతో ఏమీ అనలేదు సార్!" సుధాకర్ భయపడి చెప్పాడు.

"పెద్ద పామునైనా చిన్న కర్రతో కొట్టమన్నారు -" డాక్టర్ పిచ్చేశ్వర్రావు చెప్పాడు -"అందుకని -"

ఈ లోగా సత్య అందుకుంది "కాదు సార్! చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు -"

"వెర్రీ షార్పు - చూడు బాబు - నీ పెళ్ళాం వెరీ షార్పు - నోబుల్ ప్రైజు యివ్వవచ్చు - అందుకని మనం యిప్పుడు ఏం చెయ్యాలి?" అడిగాడు.

"నోబుల్ ప్రైజు కోసం అప్లికేషన్ పెట్టుకోవాలా సార్!' ఆశ్చర్యంగా అడిగాడు.

"నో - నో - ఇప్పుడు కావాల్సింది శీనుకు వైద్యం!" సత్య గుర్తు చేసింది.

"కదూ - అందుకని కొన్ని టెస్టులు రాసిస్తాను అవి చేసి రిపోర్టులు పట్టుకురండి -" అన్నాడు డాక్టరు.

"రాయండి సార్! మీ అంతటి వారు చెబితే తప్పుతుందా?" సుధాకర్.

"గుడ్! గుడ్!" అంటూ ఓ తెల్లపేపరు తీసుకుని ఓ పెద్ద లిస్టు రాశాడు డాక్టర్ పిచ్చేశ్వర్రావు.

అది చూసి సుధాకర్ కళ్ళు తిరిగాయి -"సార్! ఇదేంటి సార్ - ఈ లిస్టు మావాడికంటే పొడుగ్గా ఉంది!" అడిగాడు దీనంగా.

"సీ మిష్టర్! డాక్టర్ వి నువ్వా - నేనా?" కోపంగా అడిగాడు డాక్టర్.

"తమరే సార్ - అందులో అనుమానం లేదు -" బిత్తరపోయాడు.

"దెన్ - వెంటనే పోయి చేయించుకురా!" ఆజ్ఞాపించాడు.

"సార్ - దీంలో ఏంటి సార్ బ్లడ్ టెస్టులతో పాటు, సిటీస్కాన్ కూడా రాశారు. సిటీస్కాన్ అంటే బ్రైన్ స్కాన్ కదుసార్! కాని దుర్దకు బ్రైన్ స్కాన్ అవసరమా సార్!" సత్య అడిగింది ధైర్యం చేసి.

డాక్టర్ పిచ్చేశ్వర్రావు అలవోకగా నవ్వాడు.

"గుడ్! యు ఆర్ ఏ జినియస్ నో డౌట్! తలనెప్పికి మాత్ర మనం ఎక్కడ వేసుకుంటాం?" సత్యను చూస్తూ అడిగాడు.

"ఇంట్లో!" అన్నాడు సుధాకర్ - డాక్టర్ అతని వంక కోపంగా చూశాడు.

"నోట్లో సార్!" సత్య అరిచింది.

"గుడ్! తలనెప్పి వస్తే - మాత్రను తలకు వెయ్యం - నోట్లో వేస్తాం - అలాగే కాలికి దురద వస్తే మాత్రను ఎక్కడ వేస్తాం - కాల్లోనా?"

"కాదు సార్! నోట్లోనే!" చెప్పాడు సుధాకర్.

"కదూ! దురద ఉంది అని మనకు ఎలా తెలుస్తుంది?" డాక్టర్.

"దురద పుట్టినప్పుడు తెలుస్తుంది!" సుధాకర్.

"అదే - అదెలా తెలుస్తుంది - దేని ద్వారా తెలుస్తుంది?" డాక్టర్.

"నోటి ద్వారా చెబితే తెలుస్తుంది సార్!" సుధాకర్.

"నోరుకు ఎలా తెలుస్తుంది?" మళ్ళీ అడిగాడు.

సుధాకర్ నిస్సహాయంగా చూసాడు పిచ్చేశ్వర్రావు డాక్టర్ వంక.

"అదే సార్! మెదడు చెబుతుంది నోటికి - అప్పుడు నోరు మనకి చెబుతుంది -" సత్య చెప్పింది.

"గుడ్! యు ఆర్ ఏ జీనియస్సు నో డౌట్ - కాకపోతే యితనితో చేరి చెడిపోయావు - నీ బుర్ర తినేస్తున్నాడు ఇతగాడు." నిట్టూర్చాడు.

"అయితే ఇప్పుడేం చెయ్యమంటారు సార్!" సుధాకర్ అసహనంగా అడిగాడు సత్య దగ్గర తనను చిన్న బుచ్చడం నచ్చక.

"సో! దురద ఉంది అని చెప్పేది మెదడు. అది సక్రమంగా పనిచేస్తున్నదా లేదా తెల్సుకోవాలి! నిజంగా దురద ఉంటే దురద ఉందని చెబుతున్నదా లేదా ఫాల్సు అలారం పంపిస్తున్నదాని తెల్సుకుని అప్పుడు ట్రీట్ మెంటు మొదలెట్టాలి!" పిచ్చేశ్వర్రావు చెప్పాడు తాపీగా.

"సార్! అప్పటిదాకా కనీసం ఆయింట్ మెంటు కాని - ట్యాబ్లెట్స్ కాని యివ్వరా సార్!" సుధాకర్ అడిగాడు.

"అరే! నేను డాక్టర్నా నువ్వు డాక్టర్వా! వీడేం అల్లాటప్పా ఆర్ యంపీ డాక్టరులాగా కనిపిస్తున్నాడా - పేషంటు రాగానే మూడు రకాల సూదులు గుచ్చడానికి. చూడు మిష్టర్ నేను యండీ, యఫ్ఫార్ సియస్సును - ఫారిన్ రిటర్న్ డ్! ముందు బ్లడ్డు టెస్టులు పూర్తికావాలి - యూరినరి రిపోర్టు కావాలి - తర్వాత కల్చరు రిపోర్టు రావాలి - లంగ్సు యక్సురే కావాలి! బ్రైన్ పిక్చర్ రావాలి! ఇవన్నీ అయింతర్వాత స్పెషలిస్టులు వాళ్ళ ఒపీనియన్స్ యివ్వాలి. అవన్నీ బేసు చేసుకుని నేను ట్రీట్ మెంటు మొదలెడతాను. ఆషామాషీగా మందులివ్వడానికి నేను మెదడు లేని డాక్టరులాగా కనిపిస్తున్నానా?" అంటూ వికటంగా నవ్వాడు డాక్టర్ పిచ్చేశ్వర్రావు.

ఈసారి ఆ నవ్వుకు శీను ఏడుపు లంకించుకున్నాడు.

"ఈ టెస్టులు ఎక్కడ చేస్తారు సార్?" సుధాకర్ అడిగాడు.

"ఈ కారిడార్ చివరకు పోతే వాళ్ళే వరుసగా చేసుకుంటూ పోతారు"

"సరే సార్ వస్తాం -" అంటూ లేచాడు.

"నా ఫీజు - వంద రూపాయలు - అక్కడ పెట్టు" డాక్టర్ చెప్పాడు.

సుధాకర్ ఆశ్చర్యపోయాడు "ఇంకా ట్రీట్ మెంటు మొదలు కాలేదు కదు సార్! టెస్టులు పూర్తయింతర్వాత - యిస్తా!"

"అప్పుడు మళ్ళీ ఆలోచిద్దాం - ఇప్పుడు టెస్టు చేశాను గదా - కష్టపడి టెస్టులు రాసాను గదా - అందుకు ఫీజు -" చెప్పాడు.

చేసేది లేక ఓ వంద తీసి యిచ్చి గోవిందా అనుకుంటూ టెస్టుల వైపు కదిలాడు.

ఎంతైనా అత్యాధునికమైన ఆసుపత్రి కదా! ఏ మాత్రం కష్టం కలగకుండా నర్సమ్మలే చకచక అన్ని టెస్టులు చేయించేశారు - ఓ మూడు గంటల్లో బయటకు పంపారు.

శీను దురద తగ్గకపోతే పెరట్లో వున్న కలబంద చెట్టు ఆకులు కోసి రసం పిండింది. అతడు ప్రశాంతంగా నిద్రపోయాడు.

కాని సుధాకర్ పడుకోలేకపోయాడు - టెస్టులకే ఆరువేలైంది. రీ ఇంబర్సుమెంటు స్కీంలో ఈ దురదకు ఉందో లేదో అని అతనికి దురద పట్టుకుంది. మెడీ క్లెయిముకు పంపిస్తే వాళ్ళు ఎంత రీయింబర్సు చేస్తారో - ఎంత తన జేబుకు బొక్కపడుతుందో తెలీక బెంబేలు పడ్డాడు.

మూడు రోజుల తర్వాత డాక్టర్ పిచ్చేశ్వర్రావును కలిసాడు.

"ఆ! దురద తగ్గిపోయిందా బాబు!" అడిగాడు డాక్టర్.

"మీరు మందులు యివ్వందే!" సత్య ఆశ్చర్యంగా అడిగింది.

"గుడ్ క్వశ్చన్! నో డౌట్ యు ఆర్ ఏ జినియస్సు - అయినా జవాబు చెప్పడం నా బాధ్యత - డాక్టరు పేషంటుకు మందులు యిచ్చినా యివ్వకపోయినా కొన్ని రోగాలు వాటంతట అవే తగ్గిపోతాయి - ఎందుకంటే బాడీలో రెసిస్టన్స్ పవరు పెరిగి దానికి తగ్గ

రసాయనిక చర్యలు కలిగి జబ్బు తగ్గిపోతుంది. ఉదాహరణకు జలుబుకు మందులిస్తే ఒక్క వారంలో తగ్గుతుంది. మందులివ్వకపోతే ఏడు రోజుల్లో నయమవుతుంది - అందుకనే అడిగా బాబుకు దురద తగ్గిందాని -"

"ఈ మాట ముందు చెప్పిఉంటే అన్ని టెస్టులు చేయించుకునే వాళ్ళం కాదు కదు సార్!" సుధాకర్ అన్నాడు నీళ్ళు నములుతూ.

"యు ఆర్ రాంగ్! మానవ ప్రయత్నం ముఖ్యమని ఆ శ్రీకృష్ణపరమాత్మ చెప్పాడా లేదా? యాక్సిడెంట్ లో చనిపోయాడని తెల్సినా - ఉగ్రవాదులు కాల్చి చంపారని తెల్సినా పోస్టు మార్టం చేస్తారు - ఎందుకు మిలియన్ డాలర్ క్వశ్చన్ సంధించాడు డాక్టర్ పిచ్చేశ్వర్రావు సుధాకర్ కు.

సుధాకర్ పరపర బుర్ర గోక్కున్నాడు.

సత్య ఠపీమని చెప్పింది. "ఎవళ్ళ డ్యూటీ వాళ్ళు చెయ్యాలి కాబట్టి".

"గుడ్! యు ఆర్ ఏ జినియస్సు - నో డౌట్ - ఇంతకీ మీ బుజ్జిగాడి దురద ఎలా ఉంది?" మళ్ళీ అడిగాడు పిచ్చేశ్వర్రావు.

"కొంచెం పైకి పాకింది సార్!" చెప్పాడు సుధాకర్!

"ప్రోగ్రెస్! గుడ్ ప్రోగ్రెస్!" అరిచాడు పిచ్చేశ్వర్రావు.

"అదేంటి సార్! మేము భయపడుతుంటే మీరలా అంటారు?" సత్య అడిగింది ధైర్యం చేసి.

"గుడ్ క్వశ్చన్! యు ఆర్ ఏ జినియస్సు - నో డౌట్! తగ్గుతున్న రోగానికి - పెరుగుతున్న రోగానికి మంచి వైద్యం అందించవచ్చు - కాని ఒక్కలా నిలబడ్డ రోగాన్ని ట్రీట్ చేయడం కష్టం!" డాక్టర్ పిచ్చేశ్వర్రావు ఉవాచ.

"ఇప్పుడన్నా మందులు రాస్తారా సార్!" సుధాకర్ అడిగాడు.

"అందుకే గదయ్యా నే కూర్చుంది... మీతో మాట్లాడుతున్నా నా లెఫ్టు బ్రైన్ మందుల గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నది - ఉదాహరణకి ఏ అనే మందు రాస్తే ఏం రియాక్షన్ వస్తుంది - దానికి విరుగుడుగా యింకే మందు రాయాలి - దానివలన కూడా ఇంకో రియాక్షన్ వస్తే దాన్ని అరికట్టడానికి యింకే మందు రాయాలి అని!" కోపంగా చెప్పాడు డాక్టర్.

"నా కర్థం కాలేదు సార్!" సుధాకర్ దీనంగా మొహం పెట్టాడు.

"గుడ్! నీ కర్థం కాదు - బాబుకు ఒక యాంటీ బయాటిక్ రాసాననుకోండి - దానివలన డయేరియా - అంటే - విరోచనాలు రావచ్చు - ఆ విరోచనాలను అరికట్టడానికి ట్యాబ్లెట్లు రాస్తే దానివలన వాడికి చచ్చే నీరసం రావచ్చు - నీరసం తగ్గడానికి సెలైన్ కాని - గ్లూకోజు గాని ఎక్కిస్తే దానివలన చలి జ్వరం రావచ్చు. దాన్ని పోగొట్టడానికి యింజెక్షన్ చేస్తే - ఇంజెక్షన్ ఇచ్చిన చోట పుండు పడి గోకవచ్చు - మళ్ళీ దానికి యింకో మందు - యిలా చైన్ రియాక్షన్ ఉంటుంది - అది ఆలోచిస్తున్నా!" చేతులతో టేబులును బాదుతూ చెప్పాడు డాక్టర్.

"మీరు నిజంగా జీనియస్సు సార్! మీలాంటి డాక్టర్ ఈ ఊళ్ళో ఉండటం ఈ ఊరి ప్రజల అదృష్టం సార్!" సత్య పొగిడింది.

"మరి డాక్టర్ పిచ్చేశ్వర్రావు అంటే ఆర్.యమ్.పి కాదు గదా మూడు సూదులు గుచ్చడానికి - బాబూ! నీకు కాలు ఎందుకు గోకాలనిపిస్తున్నది?" మళ్ళీ మొదటి కొచ్చాడు డాక్టరు.

"దురదపుడుతున్నదంకుల్! అందుకని!" శీను చెప్పాడు.

"దురద ఎందుకు పుడుతున్నది?" డాక్టర్ అడిగాడు.

"అది తెల్సుకుందామనే కదు సార్ మీ దగ్గరికి వచ్చింది?!" ఈసారి శీను తల్లి సత్య జవాబు చెప్పింది.

డాక్టర్ పిచ్చేశ్వర్రావు కొన్ని సెకనులు ఆమె వంక సీరియస్సుగా చూసి నవ్వేశాడు. "గుడ్! యు ఆర్ ఏ జీనియస్సు - నో డౌట్! కాని నాకు మటుకు ఏం తెల్సమ్మా మీకు చెప్పడానికి! ఈ బ్లడ్ రిపోర్టులు - ఈ యక్స్ రేలు - ఈ స్కానింగు ఏవీ పూర్తిగా నిర్ధారించలేక పోతున్నాయి. అందుకే పేషెంటన్నా ఏమన్నా చెబుతాడేమోనని ఆశపడ్డా!" చెప్పాడు.

"పోనీలేండి సార్! మాకు చెప్పకపోయినా ఫర్వాలేదు - తగ్గేదానికి మందులు రాసివ్వండి." సత్య అడిగింది - రాజీపడిపోతూ.

డాక్టర్ మోహంలో సంతృప్తి కనిపించింది "గుడ్! యూ ఆర్ ఏ జీనియస్సు - నో డౌట్! చూడు బాబు -" అంటూ శీనును పిల్చాడు.

వాడు చూడకుండా స్టెత్ తో ఆడుకుంటున్నాడు. స్టెత్ ను కాలిమీద పెట్టుకుని - పరీక్షిస్తున్నాడు. సుత్తితో కొడుతున్నాడు డాక్టరులాగా...

"మాకు చెప్పండి సార్ - నే చూస్తున్నా!" సుధాకర్ నోరు తెరిచాడు.

"మూడు రకాల మాత్రలు రాస్తున్నాను - మూడు పూటలా వెయ్యమని" డాక్టర్ చెప్పాడు.

"అరే! చిన్న దురదకు మూడు రకాల మాత్రలు - మూడు పూటలా!" సుధాకర్.

"సీ మిష్టర్ సుధాకర్! నేను ఆర్ యమ్ పీ డాక్టర్ని కాదు - మూడు సూదులు గుచ్చడానికి - ఐ యామ్ యమ్ డీ; ఎఫ్.ఆర్.సి.యస్. - ఫారిన్ రిటర్డు - అందుకని మినిమమ్ లో రాస్తున్నాను - ఆయింట్ మెంటు ఉదయం రాత్రి కూడా రాయండి... కాని మాత్రలు మటుకు మర్చిపోకుండా నేనిచ్చిన టైముకే వేయండి... ఉదయం ఆరు - మధ్యాహ్నం రెండు - రాత్రి పది - తేడా రాకూడదు - ఓ వారం వాడి ప్రోగ్రెస్ చెప్పండి - రియాక్షన్ ఉంటే వెంటనే రండి!" డాక్టర్ చెప్పాడు.

"సార్ వాడు నిద్ర లేచేటప్పటికే ఏడవుతుంది సార్ - రాత్రి పదికంటే ముందే నిద్ర పోతాడు సార్! రెండుకు మధ్యాహ్నం స్కూలులో ఉంటాడు సార్!" సుధాకర్ లబలబలాడుతూ

చెప్పాడు.

"సి మిష్టర్! డాక్టర్ నేనా - నువ్వా? పదేళ్ళపైన కోర్సు చేసింది నువ్వా నేనా? ఫారిన్ పోయింది నువ్వా నేనా?" గాండ్రించాడు డాక్టరు.

"నిజమే కదు సార్! మీరే! నేను ఒట్టి బ్యాంకు ఆఫీసర్ని!" ఒప్పుకున్నాడు.

"వేర్ దేరీజ్ ఏ విల్ దేరీజ్ ఎ వే!" డాక్టర్ చెప్పాడు.

"మనసుంటే మార్గముంటుంది." సత్య అనువదించింది సింపుల్ గా.

"గుడ్! యూ ఆర్ ఏ జీనియస్సు - నో డౌట్! అవునమ్మా నీకు ఈయన ఎలా దొరికాడమ్మా!" కుతూహలంగా అడిగాడు డాక్టర్ పిచ్చేశ్వర్రావు.

"దొరకలేదు సార్! మానాన్నగారు కష్టపడి కొనుక్కొచ్చారు - అదంతా పెద్ద హిస్టరీ! ఆ మిష్టరీ చెప్పాలంటే టైము పడుతుంది - ముందు బుజ్జిగాడి భారతం అయిపోతే!" సత్య

నిట్టూర్చింది.

సుధాకర్ కోపంగా చూశాడు ఆమె వంక. బుజ్జిగాడు ఆడుకోవడం మానేసి ముగ్గురిని చూశాడు.

"ఓకే! ముందు బాబుగాడి దురద తగ్గాలి! ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి ఇంత పెద్ద హాస్పిటల్ కట్టించి... ఇన్ని యంత్రాలతో టెస్టులు చేయించి తగ్గించలేక పోతే నాకే కాదు ఈ దేశానికే అవమానం! ఎంత అవమానం! మానం పోయే అవమానం! మన దేశానికే దురద పట్టినట్టు లెక్క! ఏం దురద పుట్టి నేనింత పెద్ద డాక్టరై హాస్పిటల్ కట్టించాను? అందుకే - ప్రపంచం బాధ శ్రీశ్రీది - కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానిది! అందుకని ఇంకో రెండు మందులు కూడా రాస్తాను -" అంటూ ప్రిస్కిప్షన్ బరబర రాసిచ్చాడు... సుధాకర్ ఆ చీటి అందుకుని నమస్కరించి వెళ్ళబోయాడు. యింకాసేపుంటే మందుల లిస్టు పెంచుతాడేమోనని భయపడి.

"నా ఫీజు రెండొందలు మాత్రమే!" చెప్పాడు పిచ్చేశ్వర్రావు.

"అదేంటి సార్ - లాస్టు టైము వంద యిచ్చాం గదా!" సుధాకర్.

"అది టెస్టు రాసినందుకు! ఇది మందులు రాసినందుకు -"చెప్పాడు.

సత్య వేడి చూపులతో సుధాకర్ జేబులోంచి రెండునోట్లు తీసి టేబుల్ పైన పెట్టాడు పిచ్చేశ్వర్రావు వాటిని డ్రాయరులో నొక్కేసాడు.

"యూసీ మిష్టర్! మందులు కొని నాకు తెచ్చి చూపించండి!" చెప్పాడు.

"ఏం సార్ చూపించిన దానికి - చూసిన దానికి మళ్ళీ బిల్లు చెల్లించాలా!" కంగారుగా అన్నాడు సుధాకర్ భయపడి.

"అబ్బ కాదండి! ఆ షాపు వాడు మీ అమాయకత్వం చూసి ఎక్కడ మోసం చేస్తాడోనని డాక్టరు గారి భయం! ఆ కంపెనీ మందు లేదు ఈ కంపెనీ మందు చీపు అంటూ ఇంకో నాసిరకం మందు అంటగడతారేమోనని డాక్టరు గారు చూపించమన్నారు. దానికి ఫీజు తీసుకోరు ఎలాగూ షాపు వాడు కమీషను యిస్తాడు." సత్య కోపంగా చెప్పింది.

డాక్టర్ పిచ్చేశ్వర్రావు మెచ్చుకోలుగా నవ్వాడు "గుడ్! యూ ఆర్ ఏ జీనియస్సు - నో డౌట్! నీ బుజ్జిగాడు కూడా నాలాగా జీనియస్ కావాలి!" అంటూ ఆశీర్వదించాడు డాక్టర్ పిచ్చేశ్వర్రావు. మందులకు కొన్ని వందలు అయ్యాయి.

ఇంకా ఆరాత్రి నుండి డాక్టర్ గారి ప్రిస్కిప్షన్ ప్రకారం మందులు వేయడం ప్రారంభించింది సత్య. బుజ్జిగాడి నిద్ర జాస్తి అయింది. అయినా నిద్రలో కూడా గోకుతూనే ఉన్నాడు. రెండు రోజులు బడికి సెలవులు రావడం మూలంగా సజావుగా మందులు వేయగలిగింది - రెండు రోజులు పైన.

మూడో రోజు బడికి పంపింది.

మధ్యాహ్నం గుర్తుకొచ్చింది రెండున్నరకు రెండు గంటలకు వేయాల్సిన మాత్రలు వేయలేదని - బుజ్జిగాడు ఎంచగ్గా బడిలో ఉన్నాడని. కోర్సు సరిగ్గా వెయ్యకపోతే మందులు పని చెయ్యకపోతే మళ్ళీ డాక్టరుకు మొహం ఎలా చూపించాలో అర్థం కాలేదు ఆమెకు.

ఆలోచనలో పడిపోయింది. దీర్ఘాలోచన చేస్తున్నది.

ఈ మధ్య బుజ్జిగాడు వీలు చిక్కినప్పుడల్లా తల్లిని చూస్తూ అంటున్నాడు "గుడ్! యూ ఆర్ ఏ జీనియస్సు - నో డౌట్!" అంటూ పైగా ఏం దొరికితే దాంతో స్టెత్ లాగా అందరికీ టెస్టులు చేస్తున్నాడు. ఈ ట్రీట్ మెంటు అయ్యేదాకా సెలవు పెట్టిద్దామనుకుంది. కాని ఆ స్కూలు మేనేజిమెంటు మహాస్ట్రిక్టు! ఒక్కరోజు సెలవు కలెక్టరు కన్నా ఈజీగా దొరుకుతుందేమోగాని - ఆ స్కూలు పిల్లలకు దొరకదు! యక్ష ప్రశ్నలు - చివాట్లు - పెనాల్టీలు! ఎంత చిన్న క్లాసయినా ఒక్కరోజు పాఠాలు కూడా వాళ్ళ భావి జీవితంలో గొప్ప ప్రభావం చూపిస్తాయని నమ్ముతారు ఆ స్కూలు యజమానులు.

అందుకే ఇంక చేసేదేమీ లేక మాత్రలు పట్టుకుని స్కూలుకు బయలుదేరింది సత్య.

ఆయా కాళ్ళా వేళ్ళా పడి బడి లోపలి రాగలిగింది. కాని టీచరు పాఠం చెబుతున్నది... బెల్లు కొట్టే దాకా బయట నిలబడమని ఆయా సెలవిచ్చింది...

దూరంగా ఉండి ఆ టీచరును - ఆ క్లాసు పిల్లలను చూడసాగింది సత్య. ఓ నలభై మంది బుజ్జి బుజ్జి పిల్లలు బుజ్జి బుజ్జి బెంచిలమీద కూర్చున్నారు వివిధ రకాలుగా.

టీచరు చిన్న చిన్న గేయాలు - పాటలు నేర్పిస్తున్నది - కాని మధ్య మధ్యలో కాలు బరబరా గోక్కుంటున్నది - చీర పైకెత్తి పాదాన్ని కూడా అందిన చోటల్లా గోకుతున్నది... ఏదో ఆనందం అనుభవిస్తున్నట్లు గోక్కుంటున్నది.

కాసేపటికి బెల్లు మోగి టీచరు బయటకొచ్చింది...

కొందరు పిల్లలు కూడా గోక్కుంటున్నారు ఆమె లాగా -

సత్య బుజ్జిగాడిని బయటకు పిలిపించి మాత్రలు మింగించింది. అప్పుడు ఆమె మనసు స్థిమిత పడింది, తను డ్యూటీలో ఫెయిలు కాలేదని.

కోర్సు అయింతర్వాత డాక్టర్ పిచ్చేశ్వర్రావు దగ్గరికి వచ్చారు ముగ్గురు.

"బాగా ఆలోచించి జవాబు చెప్పు - దురద తగ్గిందా బాబూ!" అడిగాడు.

"వాడి మొహం వాడేం చెబుతాడు సార్ - ఎప్పుడూ నిద్ర పోతుంటాడు" సుధాకర్ చెప్పాడు. ఈసడించుకుంటూ

"హోమ్ వర్క్ బాగా చేస్తున్నాడా?" డాక్టర్ పిచ్చేశ్వర్రావు అడిగాడు.

"ఆ గోక్కుంటూ - గీరుకుంటూ బాగానే చేస్తున్నాడు నిద్ర వచ్చేదాకా!" చెప్పాడు సుధాకర్!" కాని బాగా డల్ అయిపోయాడు సార్ మావాడు."

"మరి మాత్రలు మార్చి రాసిమ్మంటారా! మళ్ళీ టెస్టులు చేయించాలా! ఆర్ యంపీ డాక్టరులా సూది మందులు యివ్వాలా!" డాక్టర్.

"ఏమీ వద్దు సార్! మా పిల్లాడ్ని ఆ స్కూలు మాన్పించేస్తాను." సత్య చెప్పింది - డాక్టర్ గారి వంక సూటిగా చూస్తూ.

"గుడ్! గుడ్! యూ ఆర్ ఏ జీనియస్సు - నో డౌట్! మందులతో రోగం తగ్గకపోతే వాతావరణం - పరిసరాలు మార్చమన్నారు -" అభినందించాడు.

"అలాగే డాక్టర్ ని కూడా సార్ - కాని ఈ ఊళ్ళో యింకెవరూ లేరు సార్! అందుకని ఈ పని చెయ్యలేం కాబట్టి - మేమే మానుకుంటాం!"

సత్య చెప్పింది ఖరాఖండితంగా - డాక్టర్ వంక చూస్తూ.

డాక్టర్ బిత్తరపోయాడు - ఆ తర్వాత నవ్వాడు పెద్దగా "గుడ్ జోక్! ఎవరి కర్మకు ఎవరు కర్తలమ్మా! మన గీత ప్రకారం మనం పూర్వజన్మలో చేసుకున్న పాపాల మూలంగా ఈ జన్మలో రోగాలు వస్తాయి - పాపం దానికి డాక్టర్లు ఏం చేస్తారు కనుక! ఏదో మీరు వారికి అంతకు ముందు జన్మలో రుణపడి ఉంటారు కాబట్టి ట్రీట్ మెంటుకు వస్తారు - కనుక బుజ్జిగాడ్కి ట్రీట్ మెంటు యిద్దాం - కాకపోతే టెస్టులు వద్దు - అయినా నాకో సందేహం! మీ వాడ్ని స్కూలు మారుద్దామని ఎందుకు అనుకున్నావమ్మా!" సత్యను అడిగాడు పిచ్చేశ్వర్రావు గుచ్చి గుచ్చి చూస్తూ.

"చిన్న పిల్లలు పెద్దలను అనుకరిస్తారు మీరు పరిచయం అయింతర్వాత వాడు మిమ్మల్ని మా యింట్లో అనుకరిస్తున్నాడు - అలాగే వాళ్ళ టీచరుకు దురద ఉండి - గోక్కుంటూ ఉంటే అనుకరిస్తున్నాడు" చెప్పింది సత్య.

"నో డౌట్! యు ఆర్ ఏ జీనియస్!" సత్యను అభినందించాడు డాక్టర్ పిచ్చేశ్వర్రావు ఏడుపు మొహం పెట్టి.

అక్కడనించి బయలుదేరి ఓ మూడుచోట్ల షాపింగు చేసుకుని ఎండనబడి యింటికి వచ్చారు. ఎండలు మండిపోతున్నాయి.

బాతురూముకు పోయి వచ్చాడో లేదో సుధాకర్ కళ్ళు తిరిగి మంచం మీద అడ్డంగా పడిపోయాడు. ఆ సంగతి శీను సత్యకు చేరవేశాడు. ఆమె కంగారు పడుతూ వచ్చి అతన్ని తట్టి లేపడానికి ప్రయత్నించింది. ఒళ్ళు కాలిపోతున్నది. నీళ్ళు చల్లింది మొహంమీద. మూలిగాడు కాని కళ్ళు తెరవలేదు.

గత అనుభవం గుర్తుకొచ్చి పిచ్చేశ్వర్రావు దగ్గరికి పోకుండా దగ్గరగా వున్న ఆర్.యం.పి డాక్టరు దగ్గరకు వెళ్లి అతన్ని పట్టుకొచ్చింది. రాజు రాగానే మూడు యింజెక్షన్లు చేశాడు సుధాకర్ కు. వెంటనే అతను లేచి కూర్చున్నాడు "నాకేమైంది? ఇతను ఎవరు?" అంటూ.

సత్య జరిగింది చెప్పింది. పనిలో పనిగా అంతకు ముందు బుజ్జిగాడికి జలపుడితే డాక్టర్ పిచ్చేశ్వర్రావు దగ్గరికి పోయి ఎంత కష్టపడింది వివరించింది రాజుకు.

ఆర్.యం.పి డాక్టర్ రాజు పడిపడి నవ్వాడు.

"మీకు ఈ సంగతి తెలియదా? బిల్డింగుల మీద బిల్డింగులు కట్టించి డాక్టర్ పిచ్చేశ్వర్రావు అప్పుల పాలైపోయాడు. వడ్డీలమీద వడ్డీలు కట్టలేక అతని బుర్ర తిరిగిపోయింది. ఈ మధ్య హైద్రాబాద్ లో డాక్టర్ పిచ్చేశ్వర్రావు పిచ్చి డాక్టర్ల దగ్గర పిచ్చి వైద్యం కూడా చేయించుకున్నాడు. అందుకని తెల్సినవాళ్ళెవరూ అతని దగ్గరకెళ్ళరు. మీరు ఈ ఊరికి కొత్తగదా - పాపం - అందుకని -" మళ్ళీ నవ్వాడు రాజు.

"అదా అస్సలు సంగతి ఈ డాక్టరుకు డబ్బు పిచ్చి పట్టిందన్నమాట! పాపం! అంత చదువుకుని - అన్ని దేశాలు పోయొచ్చి డబ్బు పిచ్చిలో మతిపోగొట్టుకున్నాడన్నమాట!" సుధాకర్ సానుభూతి చూపాడు.

"కాని కొంతమంది డాక్టర్లు ఎంత చదువుకున్నా - ఓ లెవల్ కెళ్ళిన తరువాత కూడ డబ్బు పిచ్చి నించి బయటపడలేకపోతున్నారు - ఇతనికన్నా ట్రీట్ మెంటు ఉంది - వాళ్ళ డబ్బు దురదకు ట్రీట్ మెంటు లేదు". అంటూ ముక్తాయించాడు ఆర్.యం.పి డాక్టర్ రాజు.

శేనుకు అర్థమైనట్లు నవ్వాడు పకపక.




"సార్ మీరు రచయితా?"

చెప్పొద్దూ నాకు మహదానందంగా అనిపించింది. నన్ను నన్నుగా కన్నా రచయితగా గుర్తిస్తే ఆ ఆనందం ముందు అన్నీ బలాదూరే!

"ఆఁ..అవును"

"సార్..మిమ్మల్ని చూస్తుంటే నాకు గొప్ప సంతోషమేస్తోంది. మీ కథలు నవల్లు తెగ చదువుతాను. అరెరె! ఏమి రాస్తారండి. మధ్యతరగతి వాళ్ళ రక్తం..కలలు..ఆశలు మీ కలంలో ఇంకుకు బదులు పోస్తారా ఏమిటి? మా జీవితాలకి జిరాక్స్ లా వుంటాయి. హేట్సాఫ్ సార్!"

ఎదురుగా నుంచుని దేవుడ్ని భక్తుడు పొగిడినట్టు పొగుడుతుంటే ఇబ్బందిగానూ వుంది. ఉబ్బి తబ్బిబ్బయ్యేంత సంతోషంగానూ వుంది.

"మిమ్మల్ని కలుద్దామని... మీ ఎడ్రెస్ కోసం చాలా ప్రయత్నించాను. కాని...      ప్చ్... దొరకలేదు... కాని ఆ దేముడు వరమిచ్చినట్టు మీరే ఇక్కడ కనిపించడం ఓహ్!" ఇంకా అతనిలో నన్ను కలసిన ఆనందపు తాలూకు వైబ్రేషన్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నేను..ఆ పక్క అపార్ట్ మెంట్ లోకి కొత్తగా వచ్చాను. నీకు సాహిత్యమంటే అంత ఇష్టమైనప్పుడు నువ్వూ రాయడానికి ప్రయత్నించలేదా?" బాగుండదని నేనూ ఓ ప్రశ్న అడిగాను.

"నా పేరు రఘు. ఇక్కడే నా ఫ్రెండ్ వుంటాడు సార్! వాడిని కలుద్దామని వచ్చాను. లక్కీగా మిమ్మల్ని కలిశాను. నాకూ రాద్దామనే వుండేది సార్. చాలా ప్రయత్నించి చాలా చాలా రాసాను... కాని తిరిగొచ్చేశాయి. రచయితలు కావడమంటే బ్రహ్మదేవుడు నుదుటిమీద రాయాలి కద సార్!" సాగర సంగమంలో కమల్ హసన్ లా కొద్దిగా బాధగా      అన్నాడు.

"ప్రయత్నిస్తే ఏదైనా సాధించొచ్చు! ఎప్పుడూ నిరుత్సాహ పడకూడదు." అన్నాను.

నాతోపాటు మా ఇంటికి తీసుకెళ్ళి టిఫిన్ కాఫీలయ్యాక... "చూడు రఘూ! నువ్వు మా ఇంటికి ఎప్పుడైనా రావచ్చు. నీలాంటి అభిమానులిచ్చే సలహాలు సూచనలవల్ల మా రచనల స్థాయి ఇంకా మెరుగవుతుంది. అలాగే నువ్వూ రాయడం నేర్చుకుందువుగాని." అన్నాను.

"మీరెంత మంచివారండి. రాతల్లో కనిపించే మంచితనమంతా మీదేనన్నమాట... చాలు సార్ నాకీ తృప్తి చాలు." అని వెళ్ళిపోయాడు.

***

ఆ తర్వాత మా మధ్య సాన్నిహిత్యం బాగా పెరిగింది.

తనకెప్పుడు సమయం చిక్కినా నా ముందు వాలేవాడు. నేను రాసినవి చదివే మొదటి పాఠకుడయ్యాడు. అంతకు ముందు ఆ స్థానం మా ఆవిడది. తను మా స్నేహానికి కుళ్ళిపోతోంది. భార్యకన్న అభిమానే ముఖ్యమయ్యాడు నాకు. ఇంటికి సంబంధించిన పనులు కూడా చక చక చేసేవాడు. అంచేత రాన్రాను మా ఆవిడ మార్కులూ కొట్టేశాడు.

'కథలకి సబ్జెక్ట్ ఎలా ఎంచుకోవాలి? తర్వాత పాఠకులకి ఆసక్తి కలిగించే విధంగా ఎలా అక్షరాల్లో పెట్టాలి' అనేది నేర్పించేవాడిని. ఒక్కోసారి నా కథలు ఫెయిర్ చేయించేవాడిని.

***

ఒకరోజు సాయంత్రం రఘు పరిగెత్తుకుంటూ వచ్చి రొప్పుతూ "సార్ అక్షర జ్యోతి పత్రిక వాళ్ళు దీపావళి కథల పోటీ పెట్టారు. మొదటి బహుమతి అక్షరాల పదివేల రూపాయలు. ఈ పత్రికలో రచన పడ్డమే ఓ అవార్డ్. అలాంటిది మొదటి బహుమతి పదివేలు సాధించడం. సార్ మీకెలాగన్నా ఆ బహుమతి రావాలి. రావాలేంటి నా ముఖం వచ్చి తీరుతుంది. అంతే!" అన్నాడు.

నేను కథలు చాలా రాశాను కాని కథల పోటీల్లో మాత్రం పాల్గొలేదు. దానికి పెద్ద కారణం లేదు. నాకెందుకో నచ్చదు. అదే విషయం రఘుతో చెప్పాను.

"లేదు సార్! ఈసారి మీరు కథ రాయాలి. పోటీలో పాల్గోవాలి. ఫస్ట్ ప్రైజ్ రావాలి." అన్నాడు దృఢంగా.

అంతేకాదు కలిసినప్పుడల్లా అదే అడిగేవాడు. నాకోసం అతనంత తాపత్రయం పడడం నన్ను ఏదో ఉద్వేగానికి గురిచేస్తోంది. "పాపం రఘు కోరిక తీర్చండి. అయినా పొల్గొంటే మీకేగా పేరూ డబ్బొచ్చేది. రఘుకి ఏమొస్తుంది? మీ అభిమానిగా మానసిక తృప్తితప్ప." అని మా ఆవిడ కూడా వెంట తగిలింది.

ఇహ లాభంలేదని. మూడు నాలుగు రోజులు తీవ్రంగా ఆలోచించి ఒక చక్కటి సబ్జెక్ట్ సిద్ధం చేసుకున్నాను. రఘు ఆనందానికి అవధిలేదు. "సూపర్బ్ సార్! మంచి సబ్జెక్ట్! ఖచ్చితంగా మనకే వస్తుంది. త్వరగా రాయండి సార్!" అన్నాడు.

నేను వారం రోజులు శ్రద్ధగా కూర్చుని కథకి చక్కని అక్షర రూపం ఇచ్చాను.

"రేపు పంపించేద్దాం!" అన్నాను.

"ఇలా కాదు సార్! నా ఫ్రెండ్ కి ప్రింటింగ్ ప్రెస్ వుంది. ఇది డి టి పి చేయించి. స్పైరల్ బైండింగ్ చేయించి నేనే పోస్ట్ చేస్తాను. మన ప్రయత్నం పత్రికల వారిని ఆకట్టుకోవాలి. అంత గొప్ప బహుమతికి ఈ మాత్రం శ్రమ అవసరమే కద సార్!" అన్నాడు.

నాకూ నిజమే అనిపించింది. పాపం రఘు ఎల్లప్పుడు నాతో లక్ష్మణుడిగా... ఆంజనేయుడిలా... ఇప్పుడిలా ఉడతా భక్తితో... వాడికిచ్చాను.

ఆ తర్వాత రెండురోజులకి వచ్చి డి టి పి అయిపోవచ్చిందని చెప్పాడు.

మరో రెండు రోజుల తర్వాత వచ్చి పోస్ట్ చేసేయడం కూడా అయిపోయిందని చెప్పి... "సార్ నేను అర్జెంట్ గా ఊరెళ్ళాలి మా అమ్మకి ఒంట్లో బాగుండలేదట" అన్నాడు దిగులుగా.

"అయ్యో అలాగా సరే జాగ్రత్తగా వెళ్ళిరా" అన్నాను.

***

రఘులేని లోటు మాకు స్పష్టంగా కనిపిస్తోంది. నేను ఇదివరకులా రాయలేకపోతున్నాను. ఆఫీసుపనిమీద ఎక్కువగా దృష్టి పెడుతున్నాను.

ఒకసారి నేను మా ఫ్రెండ్ రామారవు ఇంటికెళ్ళాను. అక్కడ టీపాయ్ మీద రెండువారాల క్రితం విడుదలైన అక్షర జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక కనిపించింది. 'అరే నేను కష్టపడి రాసిన కథ పంపించింది ఈ పత్రిక నిర్వహించిన కథల పోటీకే కద. అసలెలా మర్చిపోయాను?. పాపం రఘు నాకు బహుమతి రావాలని ఎంతో తాపత్రయ పడ్డాడు కూడా!' అని పత్రికని చేతిలోకి తీసుకుని షాక్ కి గురయ్యాను. కథల పోటీలో ఫస్ట్ ప్రైజ్ నా కథకే వచ్చింది. కాని పేరు రఘూదుంది. పక్కనే నవ్వుతున్న ఫోటో. తనురాసిన మొదటి కథకే ఫస్ట్ ప్రైజ్ వచ్చినందుకు ప్రస్తుతిస్తూ ఇంటర్వ్యూ.

"అచ్చు నువ్వు రాసినట్టే చాలా బాగా రాసాడురా ఆ కొత్త రచయిత." అన్నాడు రామారావు.

ప్రచురించిన కథలు కాపీకి గురవడం తెలుసు కానీ ఇదో కొత్త చేదు అనుభవం. అసలు విషయం ఎవరికీ చెప్పలేను. మోసపోయాను. రచయితగా దారుణంగా మోసపోయాను.

***